fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 66 | విజయవాడ, గురువారం 8 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

ప్రత్యేక కథనాలు 4, 5 పేజీలలో..

నేటి నుంచి వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈనెల 15 నుంచి పదో తరగతి చివరి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు పరీక్షల విభాగం వెబ్‌సైట్ www.bseap.orgలో గురువారం నుంచి అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విఎస్ భార్గవ ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లను ఆయా పాఠశాలలకు పంపామన్నారు. హాల్ టికెట్లు తీసుకోక పోయినా, పోగొట్టుకున్నా విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేత ధ్రువీకరించుకుని పరీక్షలకు హాజరు కావొచ్చునని సూచించారు.

హోదాపై లాఠీ





ఢిల్లీలో జరిగిన ధర్నాలో మధు, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు

ప్రత్యేక హోదా కోసం ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై ఢిల్లీ పోలీసుల దౌర్జన్యం


వామపక్ష, సాధన సమితి నేతలు, కార్యకర్తలపై దాడి
"చలో పార్లమెంట్"పై పోలీస్ జులుం
లాఠీలతో బాదారు..కాళ్లతో తొక్కారు
మండుటెండలో నడిరోడ్డుపైనే ఈడ్చారు
పలువురి నేతలకు, కార్యకర్తలకు గాయాలు, 80 మంది అరెస్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని అడిగిన ఆంధ్రులపై మోడీ సర్కార్ పోలీసులు దాష్టీకానికి ఒడిగట్టారు. వామపక్ష నేతలు, కార్యకర్తలపై లాఠీలతో దాడి చేశారు. ప్రత్యేక హోదా నినాదాలు చేస్తోన్న నేతలు, కార్యకర్తలపై లాఠీలతో కుళ్లబొడిశారు. కొంత మందిని రోడ్డుపనే పడేసి కాళ్లతో తొక్కారు. ఇంకొంత మందిని అరెస్టు చేసి పోలీస్ వ్యాన్, బస్సుల్లో ఎక్కించి మరి చావ బాదారు. మహిళలని కూడా చూడకుండా మండుటెండలో రోడ్డుపైనే ఈడ్చిపారేశారు. ఢిల్లీ పోలీసుల దాడిలో అనేక మంది గాయాల పాలైయ్యారు. దాదాపు 80 మందిని అరెస్టు చేసి మందిర్ మార్గ్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఏపికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నేతృత్వంలో "చలో పార్లమెంట్" రెండు రోజు బుధవారం కూడా జరిగింది. తొలిత స్థానిక పార్లమెంట్ స్ట్రీట్‌లోని మిగతా 3లో

కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా


టిడిపి నిర్ణయం ప్రకటించిన చంద్రబాబు
అదే బాటలో బిజెపి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేకహోదా ఉద్యమ సెగ తెలుగుదేశం సర్కారుకు తాకింది. నరేంద్ర మోడీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర మంత్రి వర్గం నుండి తప్పుకోవాలని నిర్ణయించింది. అయితే, ఎన్‌డిఎ కూటమిలోనే కొనసాగనుంది. కేంద్ర మంత్రివర్గంలో ఉన్న ఇద్దరు టిడిపి మంత్రులు గురువారం రాజీనామా చేయనున్నారు. టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మేరకు బుధవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ప్రకటించారు. టిడిపి తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న బిజెపి మంత్రులు కూడా తమ పదవులకు రాజీనామా చేయనున్నారు. చంద్రబాబు ప్రకటన తర్వాత హోటల్ ఐలాపురంలో సమావేశమైన బిజెపి నేతలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం బడ్జెట్ ప్రతిపాదనకు ముందే వారు రాజీనామా లేఖలు సమర్పించనున్నారు. బుధవారం మధ్యాహ్నం శాసనసభలో సుదీర్ఘంగా ప్రసంగించిన చంద్రబాబు, ప్రత్యేక హోదా రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌గా మారిందని, దానిని దెబ్బతీయొద్దని, మరోసారి దగా చేయవద్దని కేంద్రాన్ని కోరారు. సిఎం ప్రసంగం ముగిసిన కాసేటికే ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ 'సెంటిమెంట్లకు లొంగమని, ప్రత్యేక హోదా ఇచ్చేది లేదు' అని స్పష్టం చేశారు. ఈ ప్రకటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. ఆందోళనలకు వామపక్షాలు పిలుపునిచ్చాయి. మరోవైపు తెలుగుదేశం పార్టీలో కూడా శరవేగ ంగా పరిణామాలు చోటు చేసుకున్నాయి. బిజెపితో తెగతెంపులు చేసుకోవాలనే ఒత్తిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో మిగతా 9లో

జైట్లీ ఏమన్నారు..?



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి కుండబద్ధలు కొట్టేశారు. ఇందుకుగల కారణాలు వివరిస్తూ మళ్ళీ పాతపాటే పాడారు. కొన్ని పరిణామాల వల్ల ప్రత్యేక హోదా అనే అంశం మనుగడలో లేదని, దేశంలో ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా ఇస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయనేది ముందుగా చూడాల్సిన ముఖ్యమైన అంశమని అన్నారు. జీఎస్టీ రాబడి కేంద్ర, రాష్ట్రాలకు పంపిణీ జరుగుతోందని అన్నారు. తగినంత రాబడి లేకపోవడం వల్లే గతంలో ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక మిగతా 9లో

1.91 లక్షల కోట్లు?

- కాసేపట్లో అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్
- ఈ సారీ భారీగానే యనమల పద్దు
- ఆదరణ, ఇళ్ల నిర్మాణాలకు పెద్దపీట
- వడ్డీలేని రుణాలపైనా ప్రత్యేక దృష్టి
- విద్యార్థులకూ భారీగా నజరానాలు
- పోలవరానికి కేటాయింపులు పెంపు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి


ఊహించని రీతిలో భారీ బడ్జెట్‌కే రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత బడ్జెట్ కన్నా ఏకంగా 23 శాతం వరకు ఎక్కువ బడ్జెట్ పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత ఏడాది రూ. 1.56 లక్షల కోట్ల అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టగా, ఈసారి రూ. 1.91 లక్షల కోట్ల వరకు బడ్జెట్ కూర్పు ఉంటుందని తెలుస్తోంది. ముందుగా రెండు లక్షల కోట్ల రూపాయల వరకు బడ్జెట్ ఉంటుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించినప్పటికీ చివరకు కొంత తగ్గించుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను గురువారం ఉదయం 11.30 గంటలకు శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెట్టనుంది. ఇందుకోసం గత నాలుగు నెలలుగా భారీ కసరత్తు నిర్వహించారు. రానున్నది పూర్తిగా ఎన్నికల సంవత్సరం కావడంతో బడ్జెట్ కూడా భారీగానే ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా వివిధ రంగాలకు నజరానాలు, తాయిలాలు ప్రకటించేందుకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేయాలని ముందుగానే అన్ని శాఖలకు దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలోనే కసరత్తు కూడా ఎన్నికల బడ్జెట్ దిశగానే సాగింది. జంబో బడ్జెట్‌కు తగిన స్థాయిలో ఆదాయం రాదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, చివరకు భారీ బడ్జెట్‌కు రూపకల్పన తప్పలేదని భావిస్తున్నారు. మొత్తం బడ్జెట్‌లో ఈసారి కూడా రెవెన్యూ వ్యయానికే ఎక్కువ నిధులు కేటాయించనున్నారు. పెట్టుబడి వ్యయానికి నిధుల కొరత తప్పేలా లేదన్న భావన వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఈసారి బడ్జెట్‌లో విద్యార్థులు, వెనుక బడిన కులాలు, నీటి పారుదల రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిసింది. బిసి కులాలకు సంబంధించి గతంలో అమలు చేసి నిలిపివేసిన ఆదరణ పథకాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ పథకానికి రూ.500 కోట్లకు పైగా కేటాయించాలని యోచిస్తున్నారు. చంద్రన్న పెళ్లికానుకకు కూడా భారీగా నిధులు కేటాయించనున్నారు. బిసిలకు ఆర్థిక సహకార సంస్థ ద్వారా ఇచ్చే మిగతా 9లో



త్రిపురలో సిపిఎం శ్రేణుల పైనా, కార్యాలయాలపైనా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాల దాడులను నిరసనగా కర్నూలులో మతోన్మాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్షాల నాయకులు 7

రెండు పార్టీలూ వాడుకుని వదిలేశాయ్..!

ప్రశ్నిస్తే నా ఇంటిపైనా ఐటి దాడులు చేశారు
జనసేన నేత పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిజెపి, టిడిపి తనను వాడుకుని వదిలేశాయని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తే, నా ఇంటిపైనా ఐటి దాడులు జరిగాయని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు తనదైన ధోరణిలో సమాధానమిచ్చారు. ప్రత్యేకహోదా ఇస్తానని మోడీ ప్రకటన చేయలేదని, అది బిజెపి చేసిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వైసిపి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించగా, బిజెపికి వైసిపి అనుకూలంగా ఉందంటరా..? అని ఎదురు ప్రశ్నించారు. థర్డ్‌ఫ్రంట్‌కు మద్దతిస్తామన్న మీరు ఆ ఫ్రంట్‌లో చేరుతారా.? అని ప్రశ్నిస్తే నన్ను చేర్చుకుంటారంటారా.? ప్రశ్నించారు. ప్రత్యేకహోదా అంశాన్ని రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. సినిమాల్లో నటించే తాను రాజకీయ నాయకుల నటనను అర్థం చేసుకోలేక పోతున్నాని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఏపికి హోదా ఇవ్వని పక్షంలో రాష్ట్రంలో పరిస్థితులు అదుపు తప్పుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హోదా సాధన కోసం ఎవరు కలిసొచ్చినా రాకున్నా తాను ముందుకు సాగుతానని ప్రకటించారు.

14న భవిష్యత్ కార్యాచరణ

ఈ నెల 14న గుంటూరులో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏపి, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నిసీట్లలో పోటీ చేస్తానన్నది ప్రకటిస్తానని తెలిపారు. బిజెపి, టిడిపి తనను చిన్నపిల్లాడిగా భావిస్తున్నాయని, అన్ని ప్రశ్నలకు 14న సమాధానం చెబుతానని స్పష్టం చేశారు.



కొనసాగుతున్న విధ్వంసం

- ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం
- తమిళనాడులో పెరియార్ విగ్రహంపై దాడి

మీరట్/చెన్నయ్/న్యూఢిల్లీ: మొన్న త్రిపురలో లెనిన్ విగ్రహం, నిన్న తమిళనాడులో పెరియార్ విగ్రహం, తాజాగా యుపిలోని మీరట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం.. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత విగ్రహాల కూల్చివేత పరంపర కొనసాగుతోంది. మీరట్‌లోని మౌలానా ఖుర్ద్ ప్రాంతంలో వున్న అంబేద్కర్ విగ్రహాన్ని కొంతమంది గుర్తు మిగతా 8లో

ప్రధాని ఆగ్రహం 8

అతిసారకు మరో ఆరుగురు బలి

గుంటూరులో 10కి చేరిన మృతుల సంఖ్య
రూ.10 లక్షల చొప్పున పరిహారానికి సిపిఎం డిమాండ్



అతిసార రోగులతో కిటకిటలాడుతున్న గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి కలుషితం వల్ల మరో నలుగురు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య పదికి చేరింది. ప్రభుత్వ, ప్రయివేలు ఆస్పత్రుల్లో డయేరియాతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో బాలాజీనగర్‌కు చెందిన అడపాల వెంకట్రావు (61), చౌత్రా సెంటర్‌కు చెందిన చిన్ని సామ్రాజ్యం (60), లాలాపేటకు చెందిన పాత టైర్ల వ్యాపారి షేక్ గౌస్ (52), సంగడిగుంటకు చెందిన లక్ష్మీ (48), వసంతరాయపురానికి చెందిన సిహెచ్ శ్రీనివాసరావు (25) బుధవారం మృతి చెందారు. ఆర్‌టిసి కాలనీలోని జియాఉద్దీన్ నగర్‌కు చెందిన సానికొమ్ము బాలకోటిరెడ్డి (65) ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని అమరావతి ఆస్పత్రిలో చికిత్స పొందూతూ మృతి చెందాడు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి డయేరియా వ్యాధిగ్రస్తుల తాకిడి కొనసాగుతోంది. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పాత గుంటూరు నుంచి ఇతర ప్రాంతాలకూ తాగునీటి కాలుష్యం బెడద వ్యాపిస్తోంది. దీంతో నగరంలోని 10 డివిజన్లలో తాగునీటి మిగతా 9లో

రాజ్యసభ అభ్యర్థిగా ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిపక్ష వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ సెక్రటరీ కె.సత్యనారాయణకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌కు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వేమిరెడ్డి ఆస్తుల విలువ రూ.230 కోట్లు....

నామినేషన్ పత్రాల్లో వేమిరెడ్డి తన నికర ఆస్తుల విలువ రూ.230.26 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో తన పేరుతో ఉన్న స్థిర, చరాస్తులు రూ.204.83 కోట్లు, భార్య పేరుతో 25.42 కోట్లు ఉన్నట్లుగా పేర్కొన్నారు. రూ. 47.05 కోట్లు చరాస్తులు, రూ.157.77 కోట్లు స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు. వీటితో పాటు రూ.96.84 కోట్ల మేర అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు.

నామినేషన్ దాఖలు

రాజ్యసభ అభ్యర్థిగా వైసిపి తరుపున నామినేషన్ దాఖలు చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పిజి నీట్‌లో స్టేట్ టాపర్ విరించి యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిజి నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. దేశ వ్యాప్తంగా 1,24,600 మంది పిజి నీట్‌కు హాజరయ్యారు. ఎపి నుంచి 10,207 మంది హాజరవ్వగా అన్ని విభాగాలలో కలిపి మొత్తం 6,078 మంది అర్హత పొందారు. రాష్ట్రం నుంచి అర్హత పొందిన తొలి పది ర్యాంకులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీలో ప్రకటించారు. బివిఎస్ఆర్‌ఎస్ సాయి విరించి యాదవ్ మొదటి ర్యాంకు సాధించగా, ఎన్ ఉమామహేశ్వరి, ఎస్‌వి‌ఆర్. సృజన, కె శ్రీరామమూర్తి, పురుషోత్తం రెడ్డి రామిరెడ్డి వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు ర్యాంకులను సాధించారు. కె. వైష్ణవి రాణికి ఆరో ర్యాంకు, వి. ఫణి బాబుకు ఏడు, కె. నవీన్ కుమార్‌కు ఎనిమిది, సిహెచ్.హేతుకు తొమ్మిది, అవ్వా సాహితికి పదో ర్యాంకు లభించాయి.

జూడాల డిమాండ్లు పరిష్కరిస్తాం..

ఈ సందర్భంగా మంత్రి కామినేని మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, సాధ్యమైనంతవరకు వారి డిమాండ్లను పరిష్కరిస్తామని తెలిపారు. సీనియర్ రెసిడెంట్స్ (ఎస్‌ఆర్) జీతం 40 శాతం పెంచామన్నారు. పిజి చేసేవారికి 2016-18 సంవత్సరానికి 15 శాతం పెంచిన అరియర్స్ రూ 32 కోట్లు బకాయిలు త్వరలోనే చెల్లిస్తామన్నారు. ఎస్‌ఆర్ చేసే పిజిలకు మొదటి సంవత్సరం పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకునే ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్‌ను యూనివర్శిటీకి ఇవ్వాలన్నారు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన వారు గ్రామీణ వైద్య సేవలు చేయాలన్న నిబంధనను ఎత్తివేస్తూ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెడతామన్నారు. స్పెషలిస్టుల కొరత వల్లే పిజి వైద్యులకు రిటైర్మెంట్ వయసు పెంచామన్నారు. ఎంబిబిఎస్ వారికి 63 ఏళ్లకు పెంచే యోచనపై చర్చిస్తున్నామన్నారు. మెడికల్ సీట్ల పెంపుపై త్వరలో ఢిల్లీ వెళ్ళి ఎంసిఐతో చర్చిస్తానన్నారు.



పొడి వాతావరణమే

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

లక్ష్యద్వీప్ పరిసర ప్రాంతాల నుంచి కర్నాటక మీదుగా తెలంగాణ వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలోని భూమధ్య రేఖకు ఆనుకుని మరో అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు తెలిపింది. రాష్ట్రంలో మూడు రోజుల పాటు పొడి వాతావరణమే కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

ప్రజ్ఞ

1. ప్రపంచంలో అత్యంత అధునాతన వాతావరణ ఉపగ్రహం GOES-S ను ప్రయోగించినది?
2. 19వ ఫిక్కి ఫ్రేమ్స్‌ను ఎప్పుడు, ఎక్కడ ప్రారంభించారు?
3. 2018 స్నూకర్ టీమ్ వరల్డ్ కప్‌ను గెలుచుకున్న భారత జోడి ?
4. భూమిని పోలిన ఎన్ని భారీ గ్రహాలను ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు?
5. ఫోర్బ్స్ జాబితాలో ప్రపంచంలో అత్యంత ధనికుడు?

సమాధానాలు 7లో

ఎపిలో ఆకమై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

కంపెనీ ప్రతినిధులతో లోకేశ్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సెక్యూరిటీని ఏర్పాటు చేసేందుకు కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్, సైబర్ సెక్యూరిటీ సర్వీసెస్ అందిస్తున్న ఆకమై సంస్థ ఆసక్తి కనపరిచింది. ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆకమై కంపెనీ ఆసియా, పసిఫిక్ డైరెక్టర్ గ్రామీ బియర్డ్సెల్‌తో సచివాలయంలో బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఐటి కంపెనీల ఏర్పాటుకు అందిస్తున్న రాయితీల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిపి పనిచేయాలని కోరారు. రాష్ట్రంలోని యువతకు శిక్షణ ఇచ్చి సైబర్ సెక్యూరిటీ వారియర్స్‌గా తయారు చేసేందుకు ఆకమై సహకారం కావాలన్నారు. నెట్వర్క్ సమర్ధవంతంగా పనిచేయడానికి, సైబర్ సెక్యూరిటీకి సహకారం అందించాలన్నారు. ఐఐఐడితో భాగస్వామ్యం అవుతామని, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సెక్యూరిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎపికి సహకారం అందిస్తామని, ప్రభుత్వ శాఖల సమాచారానికి భద్రత కల్పిస్తామని తెలిపారు.

దగా పడ్డాం.. న్యాయం చేయండి

- కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండ్
- విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాల్సిందే
- విభజన హేతుబద్ధంగా లేకనే ఇబ్బందులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విభజన చట్టంలో హామీలను అమలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దగా పడిన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. హేతుబద్ధత లేకుండా జరిగిన రాష్ట్ర విభజనతో ఎపి ప్రజలు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి బుధవారం ధన్యవాదాలు తెలుపుతూ సిఎం మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర పరిస్థితి దారుణంగా ఉందని, అత్యంత క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. విభజన నష్టాలను పూడ్చేందుకు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రణాళికా బద్ధంగా పని చేస్తూ అందరి సహకారంతో డబుల్ డిజిట్ వృద్ధి రేటు సాధించామన్నారు. రాష్ట్ర విభజనతో నష్ట పోయిన మనం నిలదొక్కుకునేందుకు చేసిన ప్రయత్నాలు చాలా వరకు ఫలప్రదమయ్యాయని చెప్పారు. 2014-15లో 9.2 శాతం వృద్ధి రేటు సాధిస్తే 2015-16లో 10.06 శాతం, 2016-17లో 11.02 శాతం, 2017-18లో 11.22 శాతం వృద్ధి సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిచామన్నారు. అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే 12 శాతం వృద్ధి రేటు సాధించాలని, త్వరలోనే ఈ వృద్ధి రేటును చేరుకుంటామనే నమ్మకం ఉందని అన్నారు. రాష్ట్ర విభజన హేతు బద్ధంగా లేదని, ఆస్తుల విభజన భౌగోళికంగాను, అప్పులు మాత్రం జనాభా ప్రాతిపదికన విభజించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ రెండు రాష్ట్రాల మధ్యా ఉన్న రూ.30 వేల కోట్ల అప్పులు, ఆస్తుల లెక్కల్లో రూ.10 వేల కోట్ల లెక్కలే తేలగా, ఇంకా రూ.20 వేల కోట్ల లెక్కలు తేలాల్సి ఉందని వివరించారు. విభజన సమయంలో ఐదేళ్ళు ప్రత్యేక హోదా కల్పిస్తామని ప్రధాని చెబితే, పదేళ్ల హోదా ఇస్తామని అప్పుడు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న అరుణ్‌జైట్లీ, వెంకయ్యానాయుడు చెప్పారని గుర్తు చేశారు. అప్పుడు ఇస్తానన్న బిజెపి ఇప్పుడెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘం చెప్పినందువల్లే ఎవరికీ ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నామని చెబుతున్న బిజెపి



ఇతర రాష్ట్రాలకు హోదా ఎలా కల్పిస్తున్నారని నిలదీశారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు హోదా కింద ఇస్తున్న నిధులు, కల్పిస్తున్న సౌకర్యాలు ఎపికి కూడా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర విభజనతో నష్టపోయిన ఎపికి సమన్యాయం చేస్తామని బిజెపి హామీ ఇవ్వడంతోనే పొత్తుపెట్టుకున్నామని తెలిపారు. ప్రత్యేక హోదాను ప్రజలు తమ హక్కుగా భావిస్తున్నారని, వారి మనోభావాలను దెబ్బతీయొద్దని కేంద్రాన్ని కోరారు. విభజన చట్టం, రాజ్యసభలో ప్రధాని ఇచ్చిన హామీలను అసెంబ్లీలో సిఎం చదివి వినిపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు, వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు బందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ తదితర హామీల నుంచి తప్పించుకోలేరని బిజెపి సభ్యులను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. విభజన హామీలపై ఇప్పటి వరకు 29 సార్లు ఢిల్లీ వెళ్లానని, అందరినీ కలిసి పదేపదే విజ్ఞప్తి చేశానని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కావాలని కోరలేదని, అది ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగిన నిర్ణయమని తెలిపారు. ఇప్పటివరకు పోలవరం కోసం రూ 13,054 కోట్లు ఖర్చు చేస్తే, కేంద్రం రూ.5,349.70 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన దాంట్లో ఇంకా రూ.2568 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులకు సంబంధించి రూ.4,932 కోట్లకు లెక్కలను పోలవరం అథారిటీ ద్వారా కేంద్రానికి పంపామన్నారు. విభజన తర్వాత గవర్నర్ పాలనలోనే రూ.16,072 కోట్ల ఆదాయ లోటును తేల్చగా, అందులో రూ. 3900 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చిందని వివరించారు. ప్రస్తుతం కేంద్రం రెవిన్యూ లోటు లెక్కలే అడుగుతుందని, కానీ వాటికి లెక్కలు చూపాల్సిన అవసరం లేద న్నారు. విశాఖ రైల్వే జోన్‌ను విభజన జరిగిన ఆరు నెలలలోపు ఇవ్వాలని ఉంటే, నాలుగేళ్లయినా ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. రాజధాని విషయంలోనూ ఢిల్లీకి మించిన నగరాన్ని నిర్మించేందుకు సహకరిస్తామని తిరుపతిలో ప్రధాన మంత్రి అభ్యర్థిగా మోడీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు అమరావతి నిర్మాణానికి రూ.1500 కోట్లే ఇచ్చారని తెలిపారు. ఈ లెక్కలు కూడా ఇప్పటికే కేంద్రానికి అందజేశామన్నారు. రాష్ట్రంలో 11 జాతీయ విద్యా సంస్థలకు భూములు కేటాయిస్తే, కేంద్రం మాత్రం కేవలం రూ.420 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. దుగరాజపట్నం పోర్టు నిర్మాణం సాధ్యం కాదని కేంద్రం చెబుతోంది, ఎందుకు సాధ్యం కాదంటే చెప్పటం లేదని అన్నారు. ఖర్చుతో పని లేని అసెంబ్లీ సీట్లు అయినా పెంచమని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. పైగా తన అవసరం కోసం అసెంబ్లీ సీట్లు పెంచాలని కోరుతున్నానని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. దీంతో తాను అసెంబ్లీ సీట్ల పెంపు గురించి అడగడం మానేశానని చెప్పారు.

నా భార్యా హోదా కావాలంటోంది! : విష్ణు కుమార్ రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'నా భార్య కూడా ప్రత్యేక హోదా కావాలంటోంది' అని బిజెపి శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ అందరికీ ఇచ్చినప్పుడు మన రాష్ట్రానికి ఎందుకివ్వరని తన భార్య ప్రశ్నించిందన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే తాము చూస్తూ ఊరుకోబోమని తెలిపారు. విభజన చట్టంలో అన్ని విషయాలకు పరిశీలన (ఎగ్జామిన్) వెసులుబాటు (ఫీజిబిలిటీ) అని ఉండటంతో ఏమీ చేయడానికి లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టంతో ఆంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి చెందిదని, దీనికి కేంద్రం సహాయం చేసిందని చెప్పారు. ఉనికి కోసం ప్రతిపక్షాలు కల్లబొల్లి మాటలు చెబు తున్నాయని ఎద్దేవా చేశారు.

ఆంధ్రప్రదేశ్ పాకిస్తాన్ కాదు: పల్లె

ఆంధ్రప్రదేశ్ పాకిస్తాన్ కాదు, పక్క రాష్ట్రం కాదని, జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా అడగాలని చీఫ్ విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి విష్ణుకుమార్ రాజుకు సూచించారు. గుజరాత్‌లో ఒక నగర నిర్మాణానికి రూ.70 వేల కోట్లు, ముంబై బుల్లెట్ ట్రైన్‌కు రూ.లక్ష కోట్లు, కర్ణాటక మెట్రోకు రూ.17 వేల కోట్లు, బుందేల్‌ఖండ్‌కు రూ.20 వేల కోట్లు ఇచ్చిన కేంద్రం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు.


ప్రధాని తలుచుకుంటే సాధ్యమే: అచ్చెన్నాయుడు

ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోకపోతే అందరూ దోషులుగా మిగిలిపోవాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 14వ ఆర్థిక సంఘం అనుమతుల్లేవంటూ హోదా ఆపడం భావ్యం కాదన్నారు.

జైట్లీది పాతపాటే

సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో




హోదాపై అరుణ్ జైట్లీ పాత పాటే పాడారని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యపడదంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి జైట్లీ మరోసారి ప్రకటించడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాజకీయ ఆందోళనలు, ప్రజల సెంటిమెంటు ఆధారంగా నిధులు కేటాయించబోమని జైట్లీ ప్రకటించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని తెలిపారు. పార్లమెంటులో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ప్రజా ఉద్యమాలను అవమానపర్చడం గర్హనీయమన్నారు. రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీకి రూ.137 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉందని, రాయితీలు మొదటి రెండేళ్లల్లో ఇచ్చామని, వాటి పొడిగింపు సాధ్యంకాదని ప్రకటించడం రాష్ట్ర ప్రజలను నిట్ట నిలువునా మోసం చేయడమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజీనామాలు చేయడం లేదు

మంత్రి కామినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మంత్రి పదవులకు రాజీనామా చేయాలంటూ అధిష్టానం నుంచి తమకు ఎటువంటి సూచనలూ అందలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో బిజెపి మంత్రులు రాజీనామా చేస్తారంటూ మీడియాలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఈ మేరకు తన కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదల చేశారు. పొత్తు విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ, టిడిపి జాతీయ అధ్యక్షులు, సిఎం చంద్రబాబునాయుల నిర్ణయం అనంతరమే ఈ అంశంపై ముందుకెళతామని ఆయన పేర్కొన్నారు. అంతిమంగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకే నిర్ణయం ఉంటుందన్నారు.

పలువురికి శాసనసభ సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చట్ట సభల్లో సభ్యులుగా సేవలందించి మృతి చెందిన వారికి శాసనసభ బుధవారం ప్రశ్నోత్తరాల అనంతరం సంతాపం ప్రకటించింది. మాజీ శాసన సభ్యులు మాదాల జానకిరామ్, ఎంవి కృష్ణారావు, పగడాల రామయ్య, మాజీ మంత్రి ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమనాయుడుల మృతికి స్పీకర్ కోడెల శివప్రసాద్ సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సభలో సంతాప సూచకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డికి నోటీసులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

2017 మార్చిలో క్రికెట్ బెట్టింగ్, పేకాట కేసులో ముద్దాయిగా పేర్కొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పోలీసులు బుధవారం నోటీసులు అందజేశారు. స్థానిక చిల్డ్రన్‌పార్క్ వద్ద ఉన్న శ్రీధర్‌రెడ్డికి ఉదయం 7.45 గంటలకు పోలీసులు వచ్చి స్టేషన్‌కు రావాలని నోటీసులిచ్చారు. ఇద్దరు డిఎస్‌పిలు, సిఐలతోపాటు సిబ్బంది రావడంతో అక్కడ ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే ఎస్‌పి పిహెచ్‌డి.రామకృష్ణకు ఎమ్మెల్యే ఫోన్ చేసి తన నిరసన తెలియజేశారు. దీంతో గురువారం ఉదయం 9 గంటలకు విచారణకు రావాలని నోటీసులిచ్చి పోలీసులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. పోలీసుల చర్యకు ఎమ్మెల్యే అగ్రహం వ్యక్తం చేస్తూ తనను రాజకీయంగా దెబ్బతీయడానికి అక్రమ కేసులు పెడుతున్నారని, ఈ విషయంపై హైకోర్టులోనే తెల్చుకుంటానని చెప్పారు.

ప్రైవేటు కళాశాలల ఫీజుల దోపిడీ

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు శాసన సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రశ్నోత్తరాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన సభ్యులు పల్లె రఘునాథరెడ్డి, ప్రభాకర్ చౌదరి, శ్రావణ్‌కుమార్ తదితరులు ఈ ప్రైవేటు పాఠశాలల అంశంపై మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయన్నారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియేట్‌లో చేరేందుకు తమ కళాశాలల్లో ప్రవేశించాలని ప్రైవేటు విద్యాసంస్థలు ఫోన్ల ద్వారా విద్యార్థుల తల్లిందడ్రులను ప్రలోభ పెడుతున్నాయన్నారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనల ప్రకారమే నడుస్తున్నాయని, అలా కాకుండా ఉన్న 284 జూనియర్ కళాశాలలను రద్దు చేసినట్లు తెలిపారు.

మైనింగ్ క్వారీల్లో భద్రత శూన్యం : శ్రావణకుమార్

రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ క్వారీల్లో నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడుతున్నట్లు పలువురు సభ్యులు ప్రశ్నోత్తరాల్లో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలోని ఫిరంగిపురంలో నిబంధనలకు అతిక్రమించి తవ్వకాలు చేపట్టడం వల్ల ఇటీవల నలుగురు కార్మికులు మృతి చెందారన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ కాలుష్యంతో ఇటీవల 270 మందికి మూత్ర పిండాల సమస్యలు వచ్చాయన్నారు. గనులు, భూగర్భ శాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 7,300 క్వారీలు లీజుల్లో ఉన్నాయని, అందులో ప్రస్తుతం 4000 వరకే పనిచేస్తున్నాయన్నారు. ఫిరంగిపురం మృతులకు ప్రభుత్వపరంగా అందజేయాల్సిన ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలి : విష్ణుకుమార్‌రాజు

సిఎం ఆరోగ్య కేంద్రాల్లోని టెలి మెడిసిన్ పథకానికి సంబంధించి కేంద్రం 60శాతం నిధులిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ కార్యక్రమంలో ప్రధాన మంత్రిని పట్టించుకోవడం లేదని బిజెపి శాసనసభాపక్షనేత పి విష్ణుకుమార్ రాజు ధ్వజమెత్తారు. దానిని కేవలం రాష్ట్ర ప్రభుత్వం పథకం మాదిరిగానే కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్రమోడీ ఫొటోను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆరోగ్యగశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 193 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



బిజెపికీ కాంగ్రెస్ గతే : పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



హామీలు నెరవేర్చక పోతే కాంగ్రెస్‌కు పట్టిన గతే బిజెపికీ పడుతుంది. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలకే విలువ లేకపోతే ఎలా? విభజన హామీలను వెంటనే అమలు చేయాలి. ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి వేడుకున్నా పెడ చెవిన పెట్టారు. కేంద్రానికి రాష్ట్రంపై అంకిత భావం, చిత్తశుద్ధి లేదు. నిధులు కావాలంటే వెటకారంగా మాట్లాడుతున్నారు. పోలవరానికి రూ.7740 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి రూ.4321 కోట్లే ఇచ్చారు. రాజధాని కట్టే బాధ్యత తనదే నన్న మోడీ ఇప్పటికి భవనాలకు రూ.1500 కోట్లు, డ్రైనేజికి రూ.1000 కోట్లు ఇచ్చారు.

మా ఎంపిలు పోరాడతారు : అప్పలనాయుడు

ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కావాలి. గతంలోనూ హోదాపై అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ప్రత్యేక హోదా కోసం మా ఎంపిలు పార్లమెంట్‌లో పోరాటం చేస్తారు.

హోదా ఎందుకివ్వరు? : జివి ఆంజనేయులు

కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. ఎపికి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తున్నాం. విభజన బిల్లులోని 18 అంశాలను ఎందుకు అమలు చేయరని కేంద్రాన్ని నిలదీస్తున్నాం. మిత్రపక్షానికి చేసే న్యాయం ఇదేనా? ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఇదేవిధంగా వ్యవహరిస్తే బిజెపి రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ప్రత్యేకంగా కేటాయించిందేమీ లేదు : ఎస్‌విఎస్‌ఎన్ వర్మ

రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేకంగా కేటాయించిన నిధులేమీ లేవు. ఈశాన్య రాష్ట్రాలకు పారిశ్రామిక మినహాయింపులిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎపికి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతోంది. విభజన చట్టంలోని అంశాలన్నింటిని తప్పని సరిగా అమలు చేయాలి.

శాసనమండలి కబుర్లు

దళితులపై దాడులే ప్రగతికి సంకేతమా?

గవర్నర్ ప్రసంగంపై శాసనమండలిలో నిలదీసిన పిడిఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితులపై దాడులు, వెలివేతలు, వారి భూములను బలవంతంగా లాక్కోవడం అభివృద్ధికి సంకేతమా అని పిడిఎఫ్ మండలి ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగంపై బుధవారం మండలిలో ధన్యవాదాలు తెలిపే అంశంపై ఆయన మాట్లాడారు. దళితులపై ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని, దీంతో వారు రోడ్లెక్కడం తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికిది ఇది చాలా ప్రమాదకరమైన సూచికని హెచ్చరించారు. రాజకీయ స్వలాభాల కోసం ఎవరికి వారు

ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పబ్బం గడుపు కొంటున్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించు కోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమవుతుంటే గవర్నర్ ప్రసంగంలో వాటి ప్రస్తావనే లేదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎటువంటి భరోసా ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది ప్రజలు వైద్యానికి ఖర్చు భరించలేక అలమటిస్తున్నారన్నారు. వారి ఆస్తులన్నీ ప్రైవేటు వైద్యానికి తాకట్టుపెట్టినా ఆరోగ్యాలు మెరుగు పడటం లేదన్నారు. ప్రత్యేక హోదా పైన, విభజన చట్టంలోని హామీల పైనా ప్రజల్లో అనేక అనుమానా లున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారుర. నెల్లూరు జిల్లా దుగరాజపట్నం పోర్టు అంశంలో ప్రజలకు ఏమి సమాధానం చెపుతారని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది భార్యా భర్తల సంబంధంగా పేర్కొన్నారని, ఇందులో ఎవరు భార్యో, ఎవరు భర్తో చెప్పాలని అన్నారు. గతంలో అసెంబ్లీ కమిటీల పనితీరు ఎంతో మెరుగ్గా ఉండేదని, రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా విధులు నిర్వహించే వారని, ప్రస్తుతం దారుణంగా తయారైందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు విసిరేసినట్టుగా ఉన్నాయని, మంత్రులు, అధికారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఎంత కాలం ఈ ధోరణి కొనసాగిస్తారని నిలదీశారు. పోలవరం నిర్వాసితులకు ఎలా న్యాయం చేస్తారో గవర్నర్ ప్రసంగంలో పేర్కొనలేదన్నారు. అభివృద్ధికి అనునిత్యం పాటుపడేది అట్టడుగున ఉన్న చిరు ఉద్యోగులేనని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు దుర్భరంగా మారాయని, దీన్ని అభివృద్ధి అందామా అన్ని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేదని ఈ విధానంతో ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వేలాది కుటుంబాలు తరతరాలుగా పాకీ పనుల్లో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా స్వామ్య బద్ధంగా నిరసనలు చేస్తుంటే, పెట్టుబడులు ఆగిపోతున్నాయని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఇదెక్కడ న్యాయమని ప్రశ్నించారు. ప్రజల గొంతుకను నిర్బంధంగా అణగదొక్కడం ప్రజాస్వామ్యమెలా అవుతుందన్నారు.

చేపలను ఎగుమతి చేసి మంచినీటిని దిగుమతి చేసుకుంటామా? : విఠపు

అభివృద్ధికి ఎవరూ అడ్డంకి కాదని, కానీ ఆ పేరుతో చేపలు ఎగుమతి చేసి మంచి నీటిని దిగుమతి చేసుకుంటామేమోనని భయంగా ఉందని విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎద్దేవా చేశారు. రాష్ట్రం ఫిష్ బౌల్‌ను చేస్తే చేశారు కానీ, ప్రజలు బొలు పట్టుకొని అడుక్కొనే దుస్థితికి దిగజార్చ వద్దన్నారు. కర్నాటకలో లాగా రాష్ట్రంలో కూడా మూఢనమ్మకాల పై చట్టాన్ని తీసుకొని రావాలని సూచించారు. ఇదే అంశం పై స్వతంత్ర సభ్యులు కత్తి నరసింహా రెడ్డి, టిడిపి సభ్యులు చిక్కాల రామచంద్రరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్, బిజెపి సభ్యులు మాధవ్ మాట్లాడారు. కేంద్రం నుంచి ఎటువంటి నిధులూ రావడం లేదని తెలుగుదేశం పార్టీ వెబ్‌సైట్‌లో రాయడం బాధాకరమని మాధవ్ అన్నారు. సిఎంకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని చెబుతున్నారని, ఎప్పుడు ఇవ్వలేదో చెప్పాలన్నారు.

కిడ్నీ బాధితులను రక్షించండి..

పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లాలోని ఎ కొండూరు, గంపల గూడెం మండలాల్లోని గిరిజన తండాల్లో కిడ్నీ బాధితులకు రక్షణ చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు కోరారు. శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా మండలి చైర్మన్ ఎంఎ షరీఫ్ దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన తండాల్లో మందలాది మంది ఫ్లొరైడ్ అధికంగా ఉన్న నీటిని తాగడం ద్వారా వచ్చే కీళ్ళ నొప్పులకు ప్రమాదకరమైన మందులు వాడకం వల్ల చిన్న వయస్సులోనే కిడ్నీ సంబంధిమైన వ్యాధులతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం రెండేళ్లల్లో 14 మంది మరణించారని వివరించారు. కృష్ణా నదీ జలాలను సంబంధిత గ్రామాలకు పైపులైన్లు ద్వారా సరఫరా చేయాలని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని కోరారు. ఎ కొండూరు పిహెచ్‌సిలో డయాలసిస్ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేసి నెఫ్రాలజిస్టును నియమించాలని కోరారు. డయాలసిస్ కిడ్నీ బాధితులందరికీ 418 జీవో సవరించి రూ.2,500ల పెన్షన్ ఇవ్వాలని ఽరారు. డయాలసిస్ కిడ్నీ రోగ్యులకు ఇంటినుంచి ఆస్పత్రికి వెళ్లిరావడానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని, వ్యాధితో మృతిచెందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించాలని కోరారు. అర్హులైన వారందరికీ అంతోద్యయ పథకం, వితంతు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లు ఇవ్వాలని తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన: సంధ్యారాణి

శాసన మండలి సభ్యులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుందని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని టిడిపి ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి మండలి చైర్మన్ ఎంఎ షరీఫ్ దృష్టికి ప్రత్యేక ప్రస్తావన ద్వారా తీసుకొచ్చారు. ప్రొటోకాల్‌లో శాసన సభ సభ్యులకంటే మండలి సభ్యులకు ఎక్కువని, కానీ మండల కార్యాలయాల్లో, ఎంపిడివో కార్యాయలయాల్లో తగిన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

హోదాపై లాఠీ



లాఠీచార్జీ చేస్తున్న ఢిల్లీ పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

సంసద్ మార్గ్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర, ప్రభుత్వాల ప్రకటనలు చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుందన్నారు. వేలాది మంది ప్రజలు ఢిల్లీ వీధుల్లో ఆందోళనలు చేస్తోంటే, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని అధికార పార్టీ ఎంపిలు తూతూ మంత్రపు చర్చలు జరిపి మోసం చేస్తోన్నారని, వారు కూడా ఈ ఉద్యమంలోకి రావాలని కోరారు. రెండు రోజులు మూడు రోజుల ఆందోళనతో ముగిసేది కాదని, ఇది తెలుగు వారి ఆత్మ ఘోషని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం నాడు ఎన్టీఆర్ ఢిల్లీ వీధుల్లో వినిపిస్తే, ఇప్పుడు చంద్రబాబు కేంద్రం కాళ్ల వద్ద తాకట్టు పెట్టాడని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోడీ సర్కార్ మోసానికి వ్యతిరేకంగా ఐదు కోట్ల ఆంధ్రులు ఐక్యం కావాలని పిలుపు నిచ్చారు. ఆంధ్ర ప్రజలను దగా చేసిన కేంద్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన సమాధానం చెప్పాల్సి ఉందని అన్నారు. సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, వెంకటేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసర్ సదా శివ రెడ్డి, ఆది కవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ జార్జి విక్టర్, సామాజిక వేత్త పెంటపాటి పుల్లారావులు మట్లాడారు. అంతకు ముందు డివైఎఫ్ఐ నేతలు బూట్లు తుడిచి వినూత్న నిరసన తెలిపారు. ప్రజానాట్య మండలి బృందం తమ గొంతెత్తి నిరసన తెలిపింది. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా వామపక్ష నేతలు, కార్యకర్తలు, సాధన సమితి నేతలు పార్లమెంట్ ముట్టడికి యత్నించారు. ర్యాలీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోగానే, పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో నేతలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. "ప్రత్యేక హోదా..ఆంధ్రుల హక్కు, మాహక్కులు మాకివ్వండి, మోడీ సర్కార్ డౌన్..డౌన్, ఏపి ద్రోహి మోడీ సర్కార్" అంటూ పెద్దఎత్తున వామపక్ష కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. వామపక్ష నేతలను, కార్యకర్తలను పోలీసులు నెట్టే ప్రయత్నం చేశారు. నేతలు, కార్యకర్తల కూడా అదేరీతులో ప్రతిఘటించారు. దాదాపు గంట సేపు పోలీసులు, ఉద్యమ కారులు మధ్య తోపులాట జరిగింది. సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ, సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాస రావు, వెంకటేశ్వ యూనివర్శిటీ ప్రొఫెసర్ సదాశివ రెడ్డి, సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసులను లాగి కింద పడేశారు. దీంతో సహనం కోల్పోయిన వామపక్ష కార్యకర్తలు తీవ్ర ప్రతిఘనతో ఎదురుతిరిగారు. నేతల అరెస్టులను వ్యతిరేకిస్తూ, పోలీసులు దాష్టీకానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. నినాదాలు చేస్తోన్న కార్యకర్తలను పోలీసులు టార్గెట్ చేసి మరి చితకబాదారు. పోలీసులు ఎంత కొట్టినా తమ నాయకులు ఎక్కించిన వాహనాలను కదలబోనివ్వమని అడ్డుకున్నారు. వారిని పక్కకు ఈడ్చిపారేసి నేతలను స్థానిక మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడున్న కార్యకర్తలపై పోలీసులు మరోసారి దాడికి పాల్పడ్డారు. ఉద్యమకారుల్ని చెదరగొట్టేందుకు లాఠీలతో రంగ ప్రవేశం చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాదాపు కిలోమీటరు పొడువున ఆందోళన కారుల్ని చెదరగొట్టారు. అక్కడ వామపక్ష కార్యకర్తలను అరెస్టు చేసి స్థానిక పార్లమెంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన నేతలను, కార్యకర్తలను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుష్పేంద్ర గ్రెహ్వాల్, సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి తివారి, సిపిఎం ఢిల్లీ నాయకులు నత్తు ప్రసాద్, రవి, సిపిఐ రాజ్యసభ సభ్యుడు డి.రాజా, ఉత్తరాంధ్ర వేదిక నేత కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ నేతలు తదితరులు పరామర్శించారు.



ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో మధు, శ్రీనివాసరావు, ప్రభుతులు

పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. అరెస్టు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్భందం ప్రయోగిస్తోందని అన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉద్యమించడం తప్పా? అని ప్రశ్నించారు. శాంతియుతంగా ఉద్యమిస్తోన్న తమపై అప్రజాస్వామ్యంగా మోడీ సర్కార్ దాడికి పాల్పడిందని విమర్శించారు. ఏపి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యమాన్ని నిర్భందాలతో అణచివేయాలనుకోవడం సిగ్గు చేటని అన్నారు. తమ ఉద్యమం కొనసాగుతుందని, ప్రజలందరు భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు.

– పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వ శాఖల్లో 24 వేల పోస్టులే ఖాళీలు

మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి యనమల

లెక్కలు సరికాదని పిడిఎఫ్ అభ్యంతరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలన్నింటిలో 2018 ఫిబ్రవరి వరకు 24,209 పోస్టులే ఖాళీగా ఉన్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. వైసిపి ఎమ్మెల్సీలు ఆళ్ళనాని కృష్ణ శ్రీనివాస్, కొలగట్ల వీరభద్ర స్వామి, వెన్నపూస గోపాలరెడ్డి అడిగిన ప్రశ్న బుధవారం శాసనమండలిలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి యనమల మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతికి ఫైల్ నడుస్తోందని సమాధానం చెప్పారు. యనమల సమాధానంపై పిడిఎఫ్ మండలి సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పోస్టులను ఏ లెక్కలో తేల్చరో చెప్పాలని మండలి పిడిఎఫ్ పక్షనేత వి బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఉపాధ్యాయ పోస్టులే 14వేలకు పైగా ఖాళీలు ఉన్నాయని, రాష్ట్ర విభజన జరిగిన తరువాత అన్ని శాఖల్లో నియామకం జరగలేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న 24వేల పోస్టులు భర్తీ చేస్తే ఇక ఖాళీలు ఉండవా అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన అనంతరం 1.42లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇవి 1.85లక్షలకు పెరిగాయని సభ్యులు బొడ్డునాగేశ్వరరావు చెప్పారు. ఈ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారని, త్వరగా భర్తీ చేస్తే నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మంచిదని సభ్యులు రాము సూర్యారావు సూచించారు. స్వతంత్ర మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 20వేల పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ రాష్ట్రప్రభుత్వం 2016 ఏప్రిల్‌లో మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకుందని అన్నారు. ఇవి కాకుండా మరో 12వేలు అనుమతి ఇచ్చిందని, ఈ 32 వేల పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ శాఖల్లో మాత్రమే 24వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి యనలమ వివరణ ఇచ్చారు. స్థానిక సంస్థలు, ఇతర శాఖలు కలుపుకుంటే లక్ష వరకు ఖాళీలు ఉంటాయని చెప్పారు. వీలైనంత త్వరలో వీటిని నియామకం చేస్తామని వివరించారు.

సమాచారం ఇవ్వడంలో చిత్తశుద్ధి లేదు : బొడ్డు

రాష్ట్రంలో వివిధ శాఖల్లో 33,822 మంది కాంట్రాక్టు, 15,856 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని పిడిఎఫ్ సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, వి బాలసుబ్రహ్మణ్యం అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు సమాధానం చెప్పారు. మంత్రి సమాధానంపై మండలి పిడిఎఫ్ పక్షనేత బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మంత్రి బాధాకరమైన సమాధానం ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 33వేల మందే ఉన్నారని మిగిలిన ఉద్యోగులు తమకు సంబంధం లేదు అన్నట్లుగా ప్రభుత్వం లెక్క చెబుతుందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారికి ఈపిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కేంద్రం ఆదేశాలు జారీచేసిందన్నారు. ఔట్‌సోర్సింగ్ వారికి ఈపిఎఫ్, ఈఎస్ఐ అమలవుతుందని, కాంట్రాక్టు వారికి అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ విధానంలో లోపం ఉందని విమర్శించారు. చిరు ఉద్యోగులపై ప్రభుత్వం కనికరం చూపకపోవడం సరికాదని, దీనిని అంగీకరించామన్నారు. అతి విలువైన సభకు సమాచారం ఇవ్వడంలో చిత్తశుద్ధి లేదని నాగేశ్వరరావు తన నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో 3లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని వివరించారు.

నా మాటలు అరణ్యరోదన : టిడిపి ఎమ్మెల్సీ శమంతకమణి

అనంతపురం జిల్లాలో పంట పొలాలను జింకలు ధ్వంసం చేస్తున్నాయని, ఈ సమస్యపై శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చానని టిడిపి ఎమ్మెల్సీ శమంతకమణి చెప్పారు. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదని తన మాటలు శాసనమండలిలో అరణ్య రోదన లాగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోతుల బెడద వల్ల రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వీటిని అడవులకు తిరిగి పంపించడానికి తీసుకున్న చర్యలేమిటని మండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు అటవీ శాఖమంత్రిని ప్రశ్నించారు. కోతులు బెడద పోవాలంటే కొండముచ్చులను పెంచాలని టిడిపి సభ్యులు ఎంవిఎస్ మూర్తి సూచించారు.

చంద్రన్న బీమా నమోదులో ఇబ్బందులొస్తున్నాయి..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రన్న బీమా నమోదులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని జీరో అవర్‌లో ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన ప్రభుత్వాన్ని కోరారు. బీమా మిత్రలు విద్యార్థులతోనూ పాలసీలు కట్టిస్తున్నారని ఆమె తెలిపారు. వయో పరిమితి తెలియకుండా చేస్తున్నారని దీనితో నష్ట పరిహారం వచ్చే సమయానికి రాకపోవడంతో నియోజక వర్గాల్లో ప్రజలు తమను నిలదీస్తున్నట్లు ఆమె చెప్పారు. అదే విధంగా 60 ఏళ్ల లోపు వృద్ధులు మరణిస్తేనే నష్ట పరిహారం వుందని, 60 సంవత్సరాలు దాటిన వారు మరణించినా ఎంతో కొంత నష్ట పరిహారం ఇస్తే ఉపయుక్తంగా ఉంటుందని ఆమె సూచించారు. తన నియోజకవర్గంలో ఉన్న ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామని 2014లో ఇచ్చిన సిఎం హామీ ఇంత వరకు అమలు కావడం లేదని ధర్మవరం ఎమ్మెల్యే సూర్యనారాయణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించమని సంబంధిత మంత్రి దృష్టికి 20 సార్లు తీసుకెళ్లినా ఉపయోగం లేకుండా పోయిందని తెలిపారు. పడకల పెంపు సాధ్యం కాకపోతే ఆస్పత్రిలో కనీసం డాక్టర్లను పెంచే చర్యలైనా తీసుకోవాలన్నారు. విశాఖపట్నం మద్దిపాలెం, హనుమంతవాక జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని ఆ ప్రాంతంలో ఆర్‌ఓబి, ఆర్‌యుబిలు నిర్మించి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే రామకృష్ణబాబు ప్రభుత్వాన్ని కోరారు. అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలో 0.06 టిఎంసి సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు చర్యలు లేవని ఎమ్మెల్యే వీరన్న తెలిపారు. తన నియోజకవర్గంలో ఆస్పత్రిని ఆధునీకరించాలని ఎమ్మెల్యే ఆనందరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రకాశం జిల్లాలో నీటి ఎద్దడితో పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాబురావు ప్రభుత్వాన్ని కోరారు. ఫింగర్ ప్రింట్స్ సరిగా పడకపోవడంతో ఫించన్లు అందక వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దానిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజేశ్వరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అతిసార వ్యాధితో గుంటూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికే నలుగురు చనిపోయారని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కలుషితనీటి వల్లే అతిసార వ్యాధి వ్యాపించిందని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరు, హైదరాబాద్ జాతీయ రహదారిపై పెనుగొండ నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులతో రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మరణిస్తున్నారని ఫ్లైఓవర్లు వేయాలని ఎమ్మెల్యే పార్థసారధి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. చిత్తూరు జిల్లాలో గోపాల మిత్రలకు ఇస్తున్న రూ.3,500 జీతాన్ని పెంచాలని ఎమ్మెల్యే సుగుణ కోరారు. త్వరలోనే రూ.5000 పెంచుతున్నట్లు మంత్రి ఆదినారాయణరెడ్డి సమాధానం చెప్పారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని సంబంధిత మంత్రులు హామీ ఇచ్చారు.

ఫోకస్

కొండంత నిర్లక్ష్యం

- గుంటూరులో అతిసారకు మరో నలుగురు బలి
- మురుగు కాల్వల్లోనే తాగునీటి పైపు లైన్లు
- కలుషితాన్ని గుర్తించని మునిసిపల్ అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో వందలాది కుటుంబాల్లో కల్లోలం సృష్టించిన తాగునీటి కలుషితంపై అసలు కారణాలను గుర్తించడంలో నగర పాలక సంస్థ అధికారులు ఇప్పటివరకూ దృష్టి సారించలేకపోయారు. శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన అతిసార (డయేరియా) కేసులు క్రమంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించాయి. తాగునీటి పైపు లైన్ల నిర్మాణంలోనే లోపాలు ఉన్నాయని సాక్షాత్తు మునిసిపల్ పరిపాలన శాఖ డైరక్టర్ (డిఎంఎ) కె.కన్నబాబు బుధవారం నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. తాగునీటి కుళాయిలు మురుగునీటి కాల్వల్లో అనుసంధానమై ఉన్నాయని, వీటి వల్ల తాగునీరు కలుషితం అవుతుందని కన్నబాబు తన పరిశీలనలో పేర్కొన్నారు. సైడు కాల్వల్లోని పైపు లైన్లు కొంత కాలంగా కొనసాగుతున్నా అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. రూ.360 కోట్లతో నగరంలో సమగ్ర నీటి పథకం నిర్మాణం చేపట్టినా ఈ పైపు లైన్ల నిర్మాణంలో మార్పులు చేయలేదు. ఆనంద్‌పేట ప్రాంతంలో ప్రధాన తాగునీటి పైపులైను పురాతనంగా ఉన్నాయి. ఇవి తుప్పుపట్టి మురుగునీటిలో తేలియాడుతున్నాయి. ప్రధాన వీధుల్లోనే ఇవి స్పష్టంగా కన్పిస్తున్నా నగరంలోని పాత గుంటూరు ప్రాంత ఇంజినీరింగ్ అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ అధికారులు బుధవారం నాడు జరిపిన తనిఖీల్లో 225 చోట్ల మంచినీటి పైపులు మురికి కాలువల వద్ద కలుషితమవుతున్నట్లు గుర్తించారు. పొన్నూరు రోడ్డులో మరమ్మతుల పేరుతో ప్రధాన పైపు లైన్ల మార్పిడి నెలల తరబడి చేస్తున్నారు. ఒకేసారి భూగర్భ డ్రెయినేజి పథకం పనులు, తాగునీటి పథకం పనులు చేపట్టడం వల్ల లీకేజీలు పెరగడంతోపాటు తరచూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాగునీటి సరఫరాలో కలుషితం ఎక్కువగా ఉంటోందన్న విమర్శలు ఉన్నాయి. నీటి శుభ్రత, క్లోరినేషన్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కన్పిస్తోంది. కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు చేస్తున్నట్లు రికార్డులో కన్పిస్తున్నా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.


బాలకోటి రెడ్డి


సామ్రాజ్యం


బాధితులను పరామర్శిస్తున్న మంత్రులు పుల్లారావు, ఆనందబాబు, జిల్లా కలెక్టర్


వెంకట్రావు


గౌస్


అతిసార బాధితుడిని పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామరావు, నాయకులు కృష్ణ మోహన్


మురుగు కాల్వల్లో ఉన్న తాగునీటి పైపులైన్లు

గుంటూరు కార్పొరేషన్‌కు పాలకవర్గం లేక ఎనిమిదేళ్లు

నగర పాలక సంస్థల్లో ఐఎఎస్ అధికారులను కమిషనర్లుగా నియమించినా వారు ఎక్కువ కాలం పనిచేయలేకపోతున్నారు. రాజకీయ వత్తిడిలో చాలా తక్కువ కాలం ఉండి వెళ్లిపోతున్నారు. 2010 సెప్టెంబరు 30 వ తేదీన కౌన్సిల్ పదవీకాలం పూర్తయింది. ఇంత వరకూ ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత న్యాయస్థానం చెప్పినా ఇంత వరకూ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆసక్తి చూపడం లేదు. నగర పాలక సంస్థ ప్రస్తుత కమిషనర్ చల్లా అనూరాధ మాటలను అధికారులు లెక్కచేయడం లేదనే వాదన ఉంది. నగరంలో డయేరియా కేసులు భారీగా పెరిగి మృతులూ పెరుగుతున్నా మునిసిపల్ మంత్రి పి.నారాయణ ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

జిజిహెచ్‌లో పదిమంది పరిస్థితి విషమం

ప్రస్తుతం జిజీహెచ్‌లో బుధవారం సాయంత్రం 98 మంది, జ్వరాల ఆస్పత్రిలో 20 మంది చికిత్సలు పొందతున్నారని మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రకటించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న 10 మంది పరిస్థితి సీరియస్‌గా ఉందని, వీరిని ప్రయివేటు ఆస్పత్రులకు తరలిస్తామని మంత్రి తెలిపారు. మరో వైపు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన కేసులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని చెప్పడం సరికాదని, ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ వందలాది మంది చికిత్సలు పొందుతున్నారని వైసిపి నగర అధ్యక్షులు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ

ప్రజాశక్తి-మచిలీపట్నం (కృష్ణా)

కృష్ణాజిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ కారెం శివాజీ తెలిపారు. మచిలీపట్నం పురపాలక సంఘంలోని నారాయణపురం, యానాదుల కాలనీల్లో బుధవారం ఆయన పర్యటించి యానాదుల జీవన స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యానాదులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి పిల్లలు బడికి వెళ్లకుండా వెట్టిచాకిరిలో ఉన్నారని తెలిపారు. వారి స్థితిగతులు మార్చే విధంగా సత్వర చర్యలు చేపడతామన్నారు. ప్రత్యేకించి యానాదులకు రేషన్‌షాపు ఏర్పాటు చేయిస్తామని, ఓటు హక్కు కల్పిస్తామని అన్నారు. మెడికల్ క్యాంప్ నిర్వహించి వైద్య పరీక్షలు చేయించి, వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని అన్నారు. అలాగే కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశిస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా వీరికి అందవలసిన ప్రయోజనాలు అందించి వారి జీవితాల్లో మార్పులు తీసుకొ స్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు కె.నరహరివరప్రసాద్, నల్లకట్ల సుధారాణి తదితరులు ఉన్నారు.

ఆగిన విమానాలు

తిరుపతిలో సాంకేతిక లోపం

గన్నవరంలో పొగమంచు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్/గన్నవరం (కృష్ణా)

సాంకేతిక లోపం, పొగమంచు కారణాలతో తిరుపతి, గన్నవరం విమానాశ్రయాల్లో బుధవారం విమానాలు ఆలస్యంగా నడిచాయి. తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ఉదయం 8.30 గంటలకు బయల్దేరాల్సిన స్పైస్‌జెట్ విమానం సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన 60 మంది ప్రయాణికులు అక్కడే ఆందోళనకు దిగారు. సాంకేతిక ఇబ్బందులు ఉన్నపుడు ప్రత్యేక విమానం ఎందుకు ఏర్పాటు చేయలేదని సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. దీంతో చెన్నై నుంచి ఓ విమానాన్ని రప్పించారు. సాంకేతిక లోపం ఉన్న విమానాన్ని మరమ్మతులు చేయించి మధ్యాహ్నానికి సిద్ధం చేశారు. రెండు విమానాల్లోనూ ప్రయాణికులను తరలించారు. గన్నవరం విమానాశ్రయంలో ఉదయం 4 నుంచి 9 గంటల వరకు దట్టమైన మంచు కురవడంతో ఉదయం 7.30 గంటలకు రావాల్సిన విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి.

ఆటో బోల్తా ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో టొంపల కిషోర్(19) అనే యువకుడు మృతి చెందాడు.

– విజయనగరం

సంపాదకీయం

అనాగరికం

మానవ సమాజ గతిని మార్చి కొత్త పుంతలు తొక్కించిన మహనీయుల విగ్రహాలపై బిజెపి మూకలు విరుచుకు పడుతున్న తీరు మధ్య యుగాల నాటి బర్బర్ల అనాగరిక చర్యలను తలపిస్తోంది. విజయోత్సాహంతో సంబరాలు చేసుకోవడం వేరు, ఉన్మాదంతో హింసా కాండకు దిగడం వేరు! త్రిపుర ఎన్నికల్లో గెలిచిన తరువాత మధ్య యుగాల నాటి ఈ హింసోన్మాద సంస్కృతినే బిజెపి ఒక వ్యూహం ప్రకారం ముందుకు తెస్తున్న తీరు ఆందోళన కరం. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన తరువాత భారత్‌లో విదేశీ నేతల విగ్రహాలకు స్థానం లేదంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హంసరాజ్ గంగారామ్ వ్యాఖ్యానించారు. విగ్రహ కూల్చివేత వార్తలు వస్తున్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దాని గురించి స్పందించకుండా సైద్ధాంతిక విజయమంటూ మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ బాధ్యతా రాహిత్య ప్రకటనల తరువాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో కాషాయమూకలు చెలరేగిపోయాయి. తమిళనాడులో పెరియార్ విగ్రహంపై దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ముందస్తు సంసిద్ధత, పక్కా ప్రణాళిక లేకుండా దేశ వ్యాప్తంగా అభ్యుదయ, సామాజిక శక్తులకు నాయకత్వం వహించిన మూర్తులను లక్ష్యంగా చేసుకుంటున్నారంటే నమ్మలేం!

యుద్ధాల్లో గెలిచిన వారు ఇలా చెలరేగిపోవడం మధ్య యుగాల్లో జరిగేది. అప్పట్లో విజేతలు ఇలా విగ్రహాలను కూల్చి వేసేవారు. సంపదను దోచుకునేవారు. హింసాకాండకు, మహిళలపై అఘాయిత్యాలకు దిగి, బానిసలుగా తరలించేవారు. బర్బేరియన్ సంస్కృతిగా అనాగరికతకు నిదర్శనంగా ఇది చరిత్రలో నిలిచిపోయింది. ఆధునిక సమాజం ఈ తరహా హింసాకాండను నిరసించింది. ప్రజాస్వామ్యం విజేతలతోపాటు పరాజితులకు కూడా పాలనలో భాగస్వామ్యం కల్పించింది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం తమకు ఓట్లు వేసిన ప్రజలతో పాటు, ఓట్లు వేయని వారికీ బాధ్యత వహించాలి. అందరి సంక్షేమానికి కృషి చేయాలి. అయితే, మతోన్మాద మధ్య యుగాల భావజాలానికి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఈ ప్రాథమిక సూత్రాన్ని తుంగలో తొక్కుతోంది. బూజుపట్టిన మతోన్మాద, హిందూ అగ్రవర్ణ భావజాలాన్ని ప్రజలపై రుద్దడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలను ముక్కలుగా చీల్చి, ముప్పు తిప్పలు పెట్టే తమ అనాగరిక సిద్ధాంతానికి తప్ప మరోదానికి దేశంలో తావులేదని సంకేతాలనిస్తోంది. బిజెపి నిజస్వరూపాన్ని అర్థం చేసుకున్న ఒకప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నేత జ్యోతిబసు బిజెపిని అనాగరిక పార్టీగా అభివర్ణించారు. బిజెపిని ఎందుకు అంత తీవ్రంగా వ్యతిరేకిస్తారంటూ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన ఆ పార్టీది అనాగరికమైన సిద్ధాంతం, ప్రజాస్వామ్యంలో దానికి చోటులేదు అని జవాబిచ్చారు. తాజా పరిణామాలు అదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి.

విగ్రహాలను కూల్చినంత తేలికగా సిద్ధాంతాలను నిర్మూలించలేరు. కారు చీకటే ఉషోదయానికి దారి తీస్తుంది. అణచివేతే పోరాటానికి మార్గం చూపుతుంది. అత్యధిక సంఖ్యలో ఉన్న ప్రజానీకాన్ని, గుప్పెడు మంది కూడా లేని కొందరు తరతరాలుగా దోచుకుంటున్న తీరును మార్చి మహనీయుడు వెలుగులోకి తెచ్చి, పీడిత ప్రజల విముక్తికి బాటలు వేస్తే, దానిని ఆచరణలో పెట్టి భూమి మీద తొలి శ్రామిక జన రాజ్యాన్ని స్థాపించిన ఘనత లెనిన్‌ది.

ఆ దోపిడీ శక్తులకు కొమ్ముకాస్తున్నారు కాబట్టే ఆయన పేరు వింటేనే కాషాయశక్తులకు ఉలికిపాటు. ఇక విగ్రహాలను కంటితో చూసే ధైర్య మెక్కడిది? భారతీయ సమాజాన్ని శాసిస్తూ, వేయి పడగల విష నాగుగా విస్తరించిన హిందూ మతోన్మాదంపై పెరియార్, అంబేద్కర్‌లు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ప్రజలను చైతన్య పరిచారు. పాతుకుపోయిన కులవివక్షను ప్రశ్నించారు. హిందూ అగ్రవర్ణ భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తుంది కాబట్టే బిజెపి వారి విగ్రహాలనూ లక్ష్యంగా చేసుకుంది. విధ్వంసకాండ జరుగుతున్న సమయంలో ఏ మాత్రమూ పట్టనట్టు ఊరుకున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఆయన మంత్రి వర్గ సహచరులు ఇప్పుడు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు, ఆగ్రహంతో స్పందిస్తున్నట్లు వస్తున్న వార్తలను కంటితుడుపు చర్యలుగానే చూడాలి. విగ్రహ విధ్వంస కాండపై దేశ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తమైన తరువాతనే వారిలో ఈ మాత్రపు స్పందన వస్తుండటం గమనార్హం. ఈ మొక్కుబడి స్పందనతో సమాజానికి ఏర్పడిన ముప్పు తొలగిపోదు. భవిష్యత్‌లో ఈ శక్తులు మరింతగా చెలరేగే ప్రమాదమూ ఉంది. ప్రజాస్వామ్యానికి హాని చేసే ఈ తరహా కాషాయ కుట్రలపై అభ్యుదయ శక్తులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడికక్కడ ప్రజలను చైతన్యవంతం చేయాలి. పెద్దఎత్తున నిరసనల్లో భాగస్వాములు కావడం తోపాటు ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాలి.

ఇదీ విషయం



చట్ట సభలో ఆరోపణ
హస్తిన చేసింది దగా...
సవరించుకోకపోతే
జనం పెడతారట సెగ!

తనేమో మహా నిప్పు
అసెంబ్లీలో గొప్పలు...
నాలుగేళ్లు నోరు లేదు
ప్రజలకేమో తిప్పలు!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

త్రిపుర అనుభవం నేర్పుతున్న పాఠాలు



వి శ్రీనివాసరావు

మార్చి 3వ తేదీన జాతీయ స్థాయిలో రెండు ముఖ్యమైన పరిణామాలు జరిగాయి. ఒకటి: త్రిపురలో 25 సంవత్సరాల వామపక్ష పాలనకు గండి పడటం. అక్కడ బీజేపీ అధికారంలోకి రావడం. రెండు: జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ పిలుపు. ఇవి రెండూ ఒకదానికొకటి సంబంధం ఉన్నవే. మీడియాలో వీటిపై విస్తృతంగా చర్చలు సాగుతున్నాయి.

సీపీఐ(ఎం) ఎందుకు ఓడిపోయింది? ఇది ముందుగా ఊహించిందేనా? బీజేపీ ఎలా బలపడింది? ఒక్క శాతం ఓట్ల నుండి 43 శాతానికి ఒక్కసారిగా ఎలా ఎదిగింది? ఇత్యాది ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సీపీఐ(ఎం) ఓటమికి కారణాలను త్రిపుర రాష్ట్ర కమిటీ లోతుగా పరిశీలించాకే ఒక నిర్ధారణకు రావడం సాధ్యమవుతుంది. 25 సంవత్సరాలు అధికారంలో ఉన్న సమయంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. ఈశాన్య రాష్ట్రాల్లోనే త్రిపుర అగ్రగామిగా నిలిచింది. గతంలో ఉగ్రవాదంతో పేట్రేగిన త్రిపుర ప్రశాంత నిలయంగా మారింది. కాని అదే సమయంలో నూతనంగా ఆవిర్భవించిన మధ్య తరగతి కోరికలను పూర్తిగా సంతృప్తి పరచలేకపోవటం వాస్తవం. ఫలితంగా కొత్త తరంలో కొంత అసంతృప్తి వచ్చింది. ఈ కాలంలో త్రిపుర వామపక్ష ప్రభుత్వం గిరిజనుల్లో పెద్ద ఎత్తున విద్యావ్యాప్తి కార్యక్రమం చేపట్టింది. ఉన్నత విద్యకు ఎదిగిన గిరిజన యువత సంఖ్య పెరిగింది. కాని అంతగా ఉపాధి అవకాశాలు పెరగలేదు. విద్యావంతులందరికీ ఉద్యోగ కల్పన త్రిపుర లాంటి చిన్న రాష్ట్రానికి అందునా ఈ వ్యవస్థ పరిధిలో కేంద్ర సహకారం లేకుండా అంత సులభం కాదు. పైగా కేంద్రం లోని మోడీ సర్కార్ సహాయ నిరాకరణ చేసింది. సర్వశిక్ష అభియాన్ కింద పది వేల మంది కాంట్రాక్టు టీచర్లు రెగ్యులర్ కాకుండా ఉద్యోగాలు కోల్పోయారు. ఉపాధి హామీ పథకం నిధులపై కోత విధించింది. రాష్ట్రానికి రావాల్సిన నిధుల్ని తొక్కి పెట్టింది. ఫలితంగా యువతరంలో వచ్చిన అసంతృప్తిని ఐపీటీఎఫ్ అనే తీవ్రవాద సంస్థ రెచ్చగొట్టి రాజకీయంగా సొమ్ము చేసుకుంది. ఇలాంటి జాతి వ్యతిరేక పార్టీతో పొత్తు పెట్టుకొని బీజేపీ లాభపడింది. సరిహద్దు రాష్ట్రంలో తీవ్రవాద పార్టీలతో పొత్తు పెట్టుకొన్న బీజేపీ దేశభక్తి ఎలాంటిదో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల అనంతరం విజయోన్మాదంతో దాడులకు పాల్పడుతోంది. ఉక్రోషంతో లెనిన్ విగ్రహాలను సైతం కూల్చివేసింది. దీనిపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ తరహా మతోన్మాదాన్ని మరోసారి లోకానికి వెల్లడి చేస్తోంది.

ఈ ఎన్నికల్లో చాలా వరకు సీపీఐ(ఎం) తన బలాన్ని నిలుపుకుంది. ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా మాణిక్ సర్కార్‌కు పేరుంది. అయినా గత ఎన్నికలతో పోల్చుకుంటే 7 శాతం ఓట్లు కోల్పోయింది. బీజేపీ కూటమికి వచ్చిన 50 శాతం ఓట్లలో దాని అసలు బలం 2 శాతం పోను 34 శాతం కాంగ్రెస్ ఓట్లు బదలాయింపు జరిగింది. 7 శాతం ఇతరుల నుండి వచ్చాయి. కొత్త ఓటర్లలో సీపీఐ(ఎం)కు తక్కువ ఓట్లు పోలయ్యాయి. ఈ తరానికి వామపక్ష పాలన తప్ప ఇంకే పార్టీ గురించి ప్రత్యక్ష అనుభవం లేదు. మార్పు కావాలన్న వారి వాంఛ వామపక్ష వ్యతిరేకతకు కారణమై ఉంటుంది.

త్రిపురలో బీజేపీ ఎలా వేళ్లూనుకోగలిగిందన్నది ప్రశ్న. వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షంగా రెండేళ్ల క్రితం వరకు కాంగ్రెసు ఉండేది. కాని ఆ స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. మొత్తం కాంగ్రెస్ క్యాంపంతా దాదాపుగా బీజేపీగా రూపాంతరం చెందింది. దానికి కారణం కాంగ్రెస్ కన్నా బీజేపీ అయితేనే సీపీఐ(ఎం)ను ఎదుర్కోగలదన్న భావన. జాతీయ స్థాయిలో సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు సర్దుబాటు చేసుకుంటాయన్న ప్రచారం, దానికి తావిచ్చిన చర్చల వల్ల త్రిపురలో సీపీఐ(ఎం)ను ఎదుర్కోవడం కాంగ్రెస్‌కు సాధ్యం కాదన్న భావనకు వారు రావడానికి తోడ్పడింది. కాంగ్రెస్ పట్ల సీపీఐ(ఎం), సీపీఐ(ఎం) పట్ల కాంగ్రెస్ మెతక వైఖరి కలిగి ఉన్నాయన్న అభిప్రాయం బెంగాల్ ఎన్నికల తర్వాత బలపడింది. బెంగాల్‌లో సైతం బీజేపీ బలపడటానికి ఇదొక కారణం. ఈ రకంగా బీజేపీ విస్తరణకు కాంగ్రెస్ ప్రత్యక్షంగా కారణం కాగా, మీడియాలో విస్తృతంగా జరుగుతున్న చర్చ పరోక్షంగా తోడ్పడింది. కాంగ్రెస్‌ను ఎదుర్కోకుండా బీజేపీ విస్తరణను ఎదుర్కోవడం సాధ్యం కాదని ఈ అనుభవం తెలియ చేస్తున్నది.

కాంగ్రెస్ ఆర్థిక విధానాల వల్లనే బీజేపీ బలపడిందని విశాఖలో జరిగిన సీపీఐ(ఎం) మహాసభ నిర్ధారణకు వచ్చింది. అది సరైందని అనుభవం తెలియచేస్తున్నది. బీజేపీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయడం వల్ల బీజేపీ బలపడిందా? అన్న అనుమానం కొందరిలో ఉంది. సీపీఐ(ఎం) ఎన్నడూ బీజేపీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయలేదు. దాన్ని ఎలా ఎదుర్కోవాలన్న దానిపైనే చర్చ. బీజేపీ బలం దాని మతోన్మాదంలో ఉండగా, బలహీనత ఆర్థిక విధానాల్లో ఉంది. ఆర్థిక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించి రాజకీయంగా బలపడటానికి మతోన్మాదాన్ని ఒక ఆయుధంగా బీజేపీ వాడుకుంటోంది. మతోన్మాదాన్ని దెబ్బ తీయాలంటే దాని బలహీనతపై దెబ్బకొట్టాలి. అవి దాని ఆర్థిక విధానాలు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు, బీజేపీకీ తేడా లేదు. కాంగ్రెస్‌తో అవగాహనకు రావడం ద్వారా బీజేపీని ఎదుర్కోలేం. పైగా అలాంటి అవగాహన బీజేపీ మరింతగా బలపడటానికే దోహదపడుతుందని త్రిపుర, బెంగాల్ అనుభవాలు తెలియచేస్తున్నాయి.

రెండో అంశం, కేసీఆర్ చెప్తున్నట్టుగా కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయడం. ఆయన కొన్ని అంశాలను సరిగ్గానే లేవనెత్తారు. కేంద్రంలో గుణాత్మకంగా భిన్నమైన ప్రభుత్వం కావాలి. కేంద్ర పెత్తందారీ పోకడలకు వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కుల కోసం పోరాడాలి. ఈ రెండు అంశాలూ సరైనవే. అయితే గుణాత్మకంగా భిన్నమైన ప్రభుత్వం కేవలం పార్టీలు మారినంత మాత్రాన రాదు. ఆ పార్టీలు అనుసరించే విధానాలు ముఖ్యం. రాష్ట్రాలకు రావాల్సిన వనరులు తగ్గిపోవడం, అధికార నిరంకుశత్వంతో కక్ష కట్టి వ్యవహరించడం వల్ల ఆంధ్ర, తెలంగాణ వంటి అనేక రాష్ట్రాలు నష్టపోతున్నాయి. ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసింది. తమ హక్కుల కోసం ఒంటరిగా పోరాడితే సాధ్యం కాదని గుర్తించడం వరకు బాగానే ఉంది. అందరూ ఉమ్మడిగా కేంద్రంపై పోరాడాలన్న భావం కూడా సరైందే. అయితే ఈ విషయంలో నిలకడ ఉండాలి. కాని టీఆర్ఎస్, తెలుగుదేశం వంటి పార్టీలు ఊగిసలాడుతున్నాయి. చంద్రబాబు నాయడు ఇప్పటికీ కేంద్రంతో దోబూచులాడుతూనే ఉన్నారు. బీహార్‌లో నితీశ్‌కుమార్ ప్రజాతీర్పుకు ద్రోహం చేసి ఏకంగా బీజేపీకి లొంగిపోయారు. ఇలాంటి వారు తమ తక్షణ రాజకీయ స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతుంటారు. వారి దగ్గర ప్రజానుకూలమైన ప్రత్యామ్నాయం లేదు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ వ్యవసాయ సంక్షోభం పెరిగి అసంతృప్తి కూడా పెరుగుతోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వాటి పరిష్కారానికి కృషి చేయడానికి బదులు బాధ్యత నుండి తప్పుకొని ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకుంటున్నారు. కేంద్రంపై పోరాడి నిధులు రాబడితేనే సరిపోదు. రాష్ట్రాలకు, ప్రజలకు నష్టం చేసే దాని విధానాలను కూడా మార్చాలి. అది జరగాలంటే ముందు తమ విధానాలు మార్చుకోవాలి. తెలుగుదేశం, టీఆర్ఎస్‌ల ధోరణి ఆ దిశగా లేదు. అది జరక్కుండా వారనుకునే మూడో ఫ్రంట్ సఫలం కాదు.



బీజేపీ బలం దాని మతోన్మాదంలో ఉండగా, బలహీనత ఆర్థిక విధానాల్లో ఉంది. ఆర్థిక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించి రాజకీయంగా బలపడటానికి మతోన్మాదాన్ని ఒక ఆయుధంగా బీజేపీ వాడుకుంటోంది. మతోన్మాదాన్ని దెబ్బ తీయాలంటే దాని బలహీనతపై దెబ్బకొట్టాలి. అవి దాని ఆర్థిక విధానాలు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు, బీజేపీకీ తేడా లేదు. కాంగ్రెస్‌తో అవగాహనకు రావడం ద్వారా బీజేపీని ఎదుర్కోలేం.

1993-2004 మధ్య కూడా ఇలాంటి అనుభవమే ఉంది. నాడు బీజేపీని నిరోధించడానికి మూడో ఫ్రంట్ నినాదం ముందుకు వచ్చింది. ఈ కాలంలో బీజేపీని నిరోధించాలనుకునే కొద్దీ అది ఇంకా బలపడుతూనే వచ్చింది. ప్రజలు అనుభవంలో చూశాకే 2004లో ఓడించారు. 2004లో యుపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు బయట నుండి మద్దతునిచ్చాయి. కాని ఆ తర్వాత నుండి వామపక్షాల బలం తగ్గిపోతూ వచ్చింది. ప్రజలు వామపక్షాలను ఇతర పార్టీల నుండి వేరుగా చూడకపోవడమే ఇందుకు కారణం. వామపక్షాలు స్వతంత్ర గుర్తింపును, దాని పునాదిని కాపాడుకుంటేనే బీజేపీని ఎదుర్కోగలవు. వామపక్షాలు బలహీనపడేకొద్దీ బీజేపీని ఎదుర్కోవడమే అసాధ్యంగా మారుతుంది. స్వతంత్ర బలం పెరక్కుండా ఇతర శక్తులను కలుపుకోవడం కూడా కష్టమవుతుందని 2014 ఎన్నికల అనుభవం కూడా రుజువు చేస్తోంది.

కేవలం అవకాశవాద ఎన్నికల పొత్తులతో బీజేపీని ఓడించడం సాధ్యమూ కాదు. ఓడించినా ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. పైగా అవకాశవాద పార్టీలతో కలసిన అపవాదును వామపక్షాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం లేకుండా పోతుంది. తిరిగి విశాఖ మహాసభ రూపొందించిన వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం అనే దాన్ని పక్కకు పెట్టాల్సి వస్తుంది. అది ఏ విధంగానూ కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి తోడ్పడదు. పైగా మరింతగా బలహీనపడటానికే దోహద పడుతుంది. వామపక్షాలు బలహీనపడేకొద్దీ బీజేపీ మతోన్మాద వ్యతిరేక పోరాటమూ బలహీనపడుతుంది. అందువల్ల భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల్ని కూడగట్టడం ద్వారానే బీజేపీ మతోన్మాదాన్ని, దాని ప్రమాదకర విస్తరణను ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. ఈలోగా ఏవైనా కొత్త లౌకిక, ప్రజాతంత్ర శక్తులు పుట్టుకొచ్చినా అవి వామపక్షాలతో కలవాలన్నా వామపక్షాల బలం పెరిగితేనే అలాంటి నూతన శక్తుల్ని సైతం రాబట్టుకోడానికి, ప్రభావితం చేయడానికి అవకాశం ఉంటుంది.

మొత్తం మీద తాజా పరిణామాల్లో మూడు అంశాలు ముందుకు వచ్చాయి. ఒకటి- బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సహా ఒక్కటై ఓడించడం. రెండోది- కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్‌ను తెరమీదకి తేవడం. మూడు- ఇలాంటి ఫ్రంట్‌లలో సీపీఐ(ఎం), వామపక్షాలు చేరే అంశం గురించి. మొదటిది రాజకీయంగానే నష్టకరమైనది. రెండోది సాధ్యాసాధ్యాలకు సంబంధించింది. విధానాల ప్రత్యామ్నాయంలో స్థిరత్వం రాకుండా సాధ్యం కాదని అనుభవంలో నిరూపించబడింది. మూడోది, ఈ రెండింటికి భిన్నంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి కూటమిని నిర్మించడం. ఆలస్యమైనా దేశానికి మేలు చేసే ప్రత్యామ్నాయం ఇది.

మూడో ఫ్రంట్ లాంటి నినాదాలు విఫలమైన తర్వాతనే గత మహాసభలో వామపక్షాలు స్వతంత్రంగా ఎదగాలన్న విధానం వైపు సీపీఐ(ఎం) మొగ్గింది. ప్రత్యామ్నాయంగా వామపక్ష, ప్రజాతంత్ర కూటమిని ప్రతిపాదించింది. దాన్ని నిర్మించాలంటే వివిధ వర్గాల, తరగతుల ప్రజల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలి. తద్వారా ప్రజానుకూలమైన ప్రత్యామ్నాయం నిర్మాణమవుతుంది. అలాంటి ఫ్రంట్ మాత్రమే ఎన్నికలను సైతం ఎదుర్కోగలుగుతుంది.

(రచయిత సీపీఐ(ఎం) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు)

కవిత

ఇదో జోకు

నవ్వొస్తుంది
నువ్వు ... విగ్రహోత్పాతకుడివంటే
పడిపడి నవ్వాలనిపిస్తోంది
కంటిలో మొలకెత్తిన సూర్యుడి విగ్రహం తప్ప,
చూపు లేని వాడు
పొద్దుటి పని, రాత్రి కల ... అన్నీ విగ్రహాలే
అయినవాడు
విగ్రహాన్ని కూలదోశాడంట...
ఓరోరోరయ్యా... బెమ్మంగోరి కాలజ్ఞానంలో
గిలికుందేంది



అవ్వున్రాయ్...
కుల దైవం, ఇలవేల్పుల సంకులంలో
కనుచూపు పొడవునా కిక్కిరిసిన రాళ్ళే
ఏ రాయి పేరైనా, రాయి రాయేరా నాయనా
సరే ... నువ్వో రాయిని నుగ్గు చేసావా
గుండె రాయికన్నా కఠిన పాషాణంలా ఉంది
ఓ బుల్డోజరు నడిపేయ్... లోపలేమన్న ఊట
మిగిలుంటే ఊరుద్దేమో

విజయదివసులంటే కూల్చివేతలే నీకు
విగ్రహాలను నమ్ముకున్నోడు మరో విగ్రహాన్ని
కూల్చడమే గెలుపనుకుంటాడు
మనిషితనం అంటే
పెన్సిలుతో గీసిన బొమ్మనుకున్నావా
"లబ్బర్లు" చెరిపేయడానికి


అరుణోదయం రాతిబొమ్మల్లో ఉండదురోరయ్యా
నీకిష్టం లేనివి కూల్చి, ఇష్టమొచ్చినవి పెట్టుకో
నెత్తిన వాలిన ఈగను తోలుకోలేని బొమ్మల
కొలువు మాకక్కర్లేదు
హిమశిఖరం కూడా మరుగుజ్జయి వంగి దండం
పెట్టే
గుండె ఉన్నోళ్ళకు... ఈ బొమ్మలు కావాలా?
నువ్వు సంబరాల్జేస్కో
నాలుగు రాళ్ళు ఇంటికి మోసుకెళ్ళు...
నీక్కావలసిన విగ్రహానికి పనికొస్తాయి.
మాదేముంది
రాళ్ళు కూలితే దుమ్ములా పైకెగసే వాళ్ళం
కాస్త ఎండ వేడి తాగి
మళ్ళీ మిణుగురుల్లా చీకట్లపై వాలుతాం
పరుగెత్తాలంటే పడిలేవడం తెలిసినోళ్ళం
చినుకుల్లా రాలి, మొలకల్లా లేస్తాం

చివరాఖరుకో మాట
ఆ విగ్రహం కూల్చేటప్పుడు కాస్త చూసుకో
జారి నీ మీద పడితే
పాపం మీ అమ్మ నీ మీదెన్ని ఆశలెట్టుకుందో...

- వాహెద్


సందర్భం

చరిత్ర తిరగరాయడమే లక్ష్యం!



ఎస్ పుణ్యవతి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



చరిత్రలో వర్గ పోరాటాలకు ఎంత గొప్ప స్థానం ఉందో, పోరాటాల్లో మహిళ పాత్రకి కూడా అంతే స్థానం వుంది. మగువ తెగువ చూపకుండా ఏ ఒక్క సామాజిక విప్లవం జయప్రదం కాలేదంటాడు కారల్ మార్క్స్. ఫ్రెంచి విప్లవం మన కళ్ళెదుటి సాక్ష్యం. రెక్కాడితే గాని డొక్కాడని పేద శ్రామిక మహిళలు తిరగబడి పోరాడారు. ప్రజల తిరుగుబాట్ల ఫలితంగా రాచరికం కుప్పకూలింది. రాజు తల తెగిపడింది. స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం నినాదాలకు ఫ్రెంచి విప్లవం నాంది పలికింది. అందులో స్త్రీల పాత్ర అమోఘం. అంతకన్నా గొప్పది అక్టోబరు విప్లవం. బానిసల తిరుగుబాట్లతో బానిస యుగం అంతరించింది. ఫ్రెంచి విప్లవంలో భూస్వామ్యం రద్దయి ఆధునిక పెట్టుబడిదారీ యుగం ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ వర్గంతో పాటే కార్మిక వర్గం ఉనికిలోకొచ్చింది. దివాళా ఎత్తిన రైతాంగం, స్త్రీలతో సహా ఫ్యాక్టరీల్లో పనికి కుదిరారు. కార్మిక వర్గ సైన్యంలో చేరారు. కష్టాలు పడలేక తిరగబడ్డారు. సంఘాలు పెట్టుకొని సంఘటితమయ్యారు.

పెరుగుతున్న మహిళా కార్మికుల కోసం, వారి పోరాటాలు ఉధృతం చెయ్యడం కోసం సోషలిస్టు మహిళా నేతలు ముందుంటారు. క్లారాజెట్కిన్ నేతృత్వంలో 1910లో జమకూడి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి / మార్చి నెలల్లో ఒక రోజు అన్ని దేశాల్లో మహిళా శ్రామికుల కోర్కెల దినం జరపాలని తీర్మానించారు. కనీస వేతనాలు, పని గంటల తగ్గింపులు, ఓటు హక్కు వారి డిమాండ్లుగా ఉన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు కమ్ముకొంటున్న రోజులవి. యుద్ధం వద్దు- శాంతి కావాలని డిమాండు చేశారు.

రష్యాలో కూడా కొల్లంతాయ్ నేతృత్వంలో మహిళా ఉద్యమం సాగుతూ వచ్చింది. 1917లో మొదటి ప్రపంచ యుద్ధం సాగుతోంది. చక్రవర్తి నిషిద్ధాజ్ఞలను ధిక్కరించి మహిళలు ప్రదర్శనలు చేశారు. రష్యన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23, కొత్త క్యాలెండర్ ప్రకారం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. వేల సంఖ్యలో మహిళలు వీధుల్లోకొచ్చారు. రొట్టె కోసం దుకాణాలపై దాడులు చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా శాంతిని కోరుతూ 'సైనికులారా! మీ తుపాకులు కింద పడేయండి! మాలో చేరండి' అంటూ పిలుపిచ్చారు. సైన్యం కూడా తిరగబడింది. శతాబ్దాల చరిత్ర గల రోమనోవ వంశం కుప్పకూలింది. అదే ఫిబ్రవరి విప్లవంగా రష్యన్ విప్లవ చరిత్రలో నిలిచిపోయింది. అక్టోబరు విప్లవానికి నాంది పలికింది. చరిత్ర పునరావృతమవుతుందా! అన్నట్లుంది ప్రస్తుత పరిస్థితి. మోడీ ప్రభుత్వ విధానాలు, దాని వెనక నుండి నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాల దాడి మహిళలతో సహా మొత్తం ప్రజలను ఆందోళనలోకి నెడుతోంది. పోరుబాట పట్టేలా చేస్తోంది. ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

ప్రణాళికా సంఘం రద్దు చేశారు. ఆ స్థానంలో నీతి ఆయోగ్ ప్రతిష్ఠించారు. దాని విష ఫలితాల్లో దళిత, గిరిజన సంక్షేమానికి అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం వంటి స్కీములకు కూడా నిధులు తగ్గించేశారు. పేద తల్లులు, పిల్లల నోట్లో మట్టి కొట్టారు. తల్లులు, చెల్లెళ్లు అంటూ ఆకాశానికెత్తుతూనే స్కీము వర్కర్ల చేత చాలీ చాలని జీతాలలో గాడిద చాకిరీ చేయించుకుంటున్నారు. మరో వైపు రైతులను భూముల నుండి వెళ్లగొట్టి లక్షల ఎకరాలు గుంజుకుంటున్నారు. కార్మికులు ఎంత నైపుణ్యం గల వారైనా సరే, కనీస వేతనాలివ్వరు. రాజధాని ఢిల్లీతో సహా రూ. ఐదారు వేలకు మించి జీతం లేదు.

మోడీ, ఆయన్ను నడిపే సంఘీయుల సూక్తులు మహాద్భుతంగా వుంటాయి. ఆడవాళ్లు బయటికొచ్చి పని చెయ్యరాదట! ఇంటి పట్టునే ఉండి మొగుణ్ణి, పిల్లల్ని చూసుకోవాలట. సనాతన ధర్మం చెప్పిందట. మొగుడికి సరిపడా జీతమిచ్చి, భార్యా పిల్లల్ని అపురూపంగా చూసుకోగలిగితే బయటికి పోయి చాకిరీ చెయ్యాల్సిన ఖర్మ, యజమానులు, తోటి కార్మికుల వేధింపులు, అవమానాలు, అఘాయిత్యాలు భరించాల్సిన ఖర్మ ఎవరికి పట్టింది. బ్రాండెక్సు కార్మికురాలు ఏం పాపం చేసిందని? అంటూ జాలి కురిపించారు. అసలు రాజకీయమేమంటే ఆడది అబల అని చెప్పి ఆడదాని ఆత్మ విశ్వాసాన్ని దెబ్బగొట్టి మరింత తక్కువ కూలి ఇచ్చి, చాకిరీ చేయించుకోవాలనే కుట్ర దీన్లో దాగి వుంది.

వ్యవసాయంలో కుటుంబ పోషణ సాధ్యం కాక, పని దొరకక, ఇప్పటికే స్త్రీలు అసంఘటిత కార్మికుల జాబితాలో చేరిపోయారు. మన రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్నదదే.

గతంతో పోల్చితే వ్యవసాయేతర కార్మికుల సంఖ్య వేతనం మీద ఆధారపడే ఫ్యాక్టరీ కార్మికులు కావచ్చు, ఇళ్లల్లో వుండి దుస్తులు ఇతర పరిశ్రమల్లో పని చేసే గృహ కార్మికులు కావచ్చు, నిర్మాణరంగం ఇంకా ఇతర సేవా రంగాలలోకి మహిళా కార్మికుల సంఖ్య పెరిగింది. రాష్ట్రంలో జీడి పప్పు పరిశ్రమ, రొయ్యల పరిశ్రమ, స్పిన్నింగ్, టెక్స్‌టైల్, గార్మెంటు వంటి పలు రంగాల్లోనూ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా తదితర స్కీము వర్కర్లు, విద్య, వైద్య రంగాల్లో లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరు కాక చింతపండు, అగర్‌బత్తి, జీన్స్ ప్యాంట్లు వంటి గార్మెంట్లలో కూడా లక్ష వరకు వున్నారు. పని కోసమే గావచ్చు, ఒకసారి కార్మికులు ఒక గొడుగు కింద పని చెయ్యడం ప్రారంభించాక సంఘాలు పెట్టుకోక మానరు. పోరాటాల్లోకి దిగక మానరు. బతుకు మీద జరిగే దాడిని తిప్పి కొడతారు. ఆధార్‌కార్డు అనుసంధానం పేరుతో లక్షల సంఖ్యలో రేషను కార్డులను ప్రభుత్వం రద్దు చేసింది. అదేమంటే వేలిముద్రలు పడలేదంటారు. ధరలు పెరుగుతాయి. ప్రభుత్వం నుండి సహకారం శూన్యం.

హింస పెరుగుతోంది. 'భారత్ మాతాకీ జై' నినాదం ఇవ్వకుంటే నేరం. కాని మాతలకీ రక్షణ లేదు. బిడ్డలకీ రక్షణ లేదు. దేశమంతా హోలీ రంగుల్లో మునకలేస్తుంటే రాజధాని ఢిల్లీలో, కాలేజీ విద్యార్థినులపై బెలూన్లలో వీర్యం నింపి ఆడపిల్లలపైకి గురి చూసి కొట్టారు. ఏడవ తరగతి పిల్లవాడు నాల్గవ తరగతి పిల్ల మీద అత్యాచారం చేశాడు. నెలల బిడ్డ మీద దాడి జరిగినా ప్రభుత్వానికి చీము, నెత్తురు ఉన్నట్టా, లేనట్టా! ఉన్నదో లేదో తెలియాలి. రాణి పద్మావతి 'సతి మంటల'పై ఉన్న శ్రద్ధ స్త్రీల రక్షణకి ఎందుకు లేదు. మహిళా రిజర్వేషను బిల్లు అటక దిగనంటోందేం!

చరిత్ర పునరావృతమవుతోంది. స్త్రీలు బాధితులు మాత్రమే గాదు. అవసరమైతే చీపురు పుచ్చుకుని చెంగు కుచ్చిళ్లు దోపి తిరగబడగలరు. స్త్రీ అంటే రవి వర్మ చిత్రాల్లోని సౌందర్య రాశి మాత్రమే కాదు. బతుకు మీద దాడి జరిగితే దాన్ని తిప్పికొట్టే భద్రకాళి కూడా. అదే జరుగుతోంది.

ఇప్పుడదే జరుగుతోంది. హింసకు వ్యతిరేకంగా వర్మిక కుందు తిరగబడింది. గుర్మెహర్ కౌర్ నిలబడింది. బెనారస్ హిందూ యూనివర్శిటీ అమ్మాయిలు లాఠీ దెబ్బలను కూడా లెక్క చేయలేదు. నేడు రాష్ట్రంలో మహిళలు తిరగబడుతున్నారు. ఆడదాన్ని అంగడి సరుకుగా చిత్రించే రామ్ గోపాల్ వర్మను అరెస్టు చేస్తే గాని శాంతించమని, హింసను అరికట్టాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు.

'ఏ అద్భుత శక్తి వారిని నడిపిందో' బ్రాండిక్సు మహిళా కార్మికులు సంఘటితమయ్యారు. జీతాల కోసం పోరాడారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని రప్పించారు. వేతనాలు సాధించారు. బెంగుళూరులో వస్త్ర పరిశ్రమ కార్మికులు లక్షల సంఖ్యలో రోడ్డుమీదకొచ్చారు. బీజేపీ ప్రభుత్వ మెడలు వంచారు. కార్మికులను దోచుకొనే పెన్షన్ పథకాన్ని తిప్పికొట్టారు. అంగన్‌వాడీ పేరు చెబితేనే బాబుగారికి పెరపెరలు. లాఠీలు, టియర్‌గ్యాస్‌లు, చివరికి గుర్రాలు, అధికార పార్టీ బెదిరింపులు, లొంగదీతలు... ఏవీ అంగన్‌వాడీ, స్కీము వర్కర్ల మిలిటెన్సీని తగ్గించలేకపోయాయి. ఇది నిన్నటిమాట.

నాటి సారా ఉద్యమంతో కాంగ్రెసు ప్రభుత్వం గద్దె దిగింది. ఎన్‌టిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇది మొన్నటి కథ.

భారత మహిళలు పువ్వులు కాదు నిప్పురవ్వలు, పోరాడతారు. బతుకు మీద దాడిని తిప్పికొడతారు. అధికార పీఠాలనే మార్చగల సత్తా మహిళలకు ఉంది. అదే మార్చి 8 దిశా నిర్దేశం!



సమాజంలో మార్పు అనేది అనివార్యం. అప్పట్లో గృహిణిగా మాత్రమే ఉన్న మహిళ ఇప్పుడు అన్నిరంగాల్లోనూ తన ప్రతిభను కనబరుస్తోంది. ఒకప్పుడు కనీసం పౌరురాలిగానూ గుర్తింపులేని స్త్రీకి ప్రస్తుతం దేశ పార్లమెంటునూ సమర్ధవంతంగా నడపగలిగే స్థాయి వచ్చింది. కానీ అదే పార్లమెంట్‌లో... సమాజాన్ని మార్చగలిగే పాలసీల రూపకల్పనలో... ఆమెకు నిర్ణయాధికారం ఉండటంలేదు. 'ఇప్పటికీ.. స్త్రీ స్వేచ్ఛ అనేది రెక్కలు లేని పక్షి రూపంలో ఉంది...' అంటోంది నేటిమహిళ. సమాజం అభ్యుదయం దిశగా పయనించాలంటే.. ఇంకెంతో మార్పు రావాలంటోంది మహిళా యువతరంగం.





మార్పుకోసం పదండి ముందుకు

'నేను ఈ మధ్య ఉన్నత చదువుల కోసం ఎమ్.బి.ఏ.కి సంబంధించిన పరీక్ష ఒకటి రాశాను. అందులో మంచి మార్కులొచ్చాయి. ఢిల్లీలో... ఉత్తర భారతదేశంలో మంచి కాలేజీల్లో సీటు వచ్చే అవకాశముంది. కానీ నేను అమ్మాయిని కావడంతో అంతదూరం పంపడానికి ఇంట్లో ఒప్పుకోవడం లేదు. నేను ఎంత కష్టపడి చదివినా, మంచి మార్కులొచ్చినా ఉపయోగం లేకుండా అయ్యింది. ఇక చేసేది లేక, ఇక్కడే చేరాల్సి వస్తుంది. తల్లిదండ్రులు నా భద్రతను దృష్టిలో పెట్టుకొని, దూర ప్రాంతానికి పంపడంలేదు. వాళ్లది తప్పు అనలేని పరిస్థితి. దీనికి కారణం ఎవరు? ఈ సమాజంలో పురుషుల ఆలోచనా తీరు ఎప్పటికి మారుతుంది? నాకు చాలా బాధగా ఉంది' అంటుంది బ్యాచిలర్స్ చదువుతున్న విద్యార్థిని భార్గవి.

పురుషాధిక్య సమాజముందని నేటి యువతులు పూర్తిగా అంగీకరించట్లేదు కానీ సమాజంలో పురుషుల ఆధిక్యత ఇంకా కొనసాగుతూనే ఉందని అంటున్నారు. ఉద్యోగాల్లో పైఅధికారుల ఆధిక్యత, కుటుంబంలో భర్త డామినేషన్ చాలా మంది అనుభవిస్తున్నారనే విషయం అందరూ ఒప్పుకోవాల్సిందే. స్వేచ్ఛగా బతకాలనుకునే మహిళల్ని భయానికి గురిచేస్తూ, వారిని శారీరకంగా హింసిస్తున్నారు. ఇలా మహిళల్ని వేధించేవారు ముందు వాళ్ల తల్లి, సోదరీలను గుర్తుపెట్టుకుంటే ఇతర స్త్రీలపైన ఇలాంటి అఘాయిత్యాలు చేయరు. అలా లేదు కాబట్టే సిటీ బస్సుల్లో పురుషుల వేధింపులను తప్పించుకోవడానికి ఒక అడ్డుగోడలా పార్టిషన్ పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పుడే స్త్రీలు సురక్షితంగా ప్రయాణించగలరనే భావన వచ్చింది. అలాగని పురుషులంతా చెడ్డవారు కాదుగానీ ఎక్కువమంది స్త్రీలను తక్కువగా చూస్తారు.. వాళ్లు మారాలి. అనేది నేటితరం యువతులు మాట.

కుటుంబంతోనే మొదలవ్వాలి

పెళ్లి చేసుకుని అమ్మాయిని ఇంటికి తీసుకురాగానే ఆమెపైన అన్ని హక్కులూ తమవేనని భావిస్తారు చాలామంది. అందుకే సమాజంలో గృహహింస ఎక్కువగా ఉంది. అందర్నీ విడిచిపెట్టి భర్త ఇంటికొచ్చిన భార్య వైపు నుంచి ఆలోచించినప్పుడు పురుషులు చేస్తున్న తప్పు కనిపిస్తుంది. ఇక్కడ మార్పు వస్తే పెళ్లి చేసుకునే ప్రతీ ఆడపిల్ల సంతోషంగా ఉంటుంది. కొందరు భార్యని అపురూపంగా చూసుకునేవారూ లేకపోలేదు. 'నా భర్త నేను చదవనూ అని చెప్పినా నన్ను చదివిస్తున్నారు. పెళ్లికి ముందుగానీ, తర్వాతగానీ నేను పురుషాహంకారాన్ని చూడలేదు. కానీ ఎక్కడా లేదనీ చెప్పలేము. పెళ్లైన తర్వాత భర్త సహకారం లేకపోతే స్త్రీ బాధపడుతూనే ఉంటుంది. చదువుకున్న అబ్బాయిలూ భార్యని తక్కువగా చూడటం బాధ కల్గించే విషయమే కదా!' అంటారు మాధవి. పురుషుల ఆలోచనల్లో మార్పు రావాలి. వాళ్ల చుట్టూ నాలుగు గోడలు నిర్మించుకుని, ఆ ప్రపంచంలోనే బతుకుతున్నారు. ఇలా ఆలోచనలు సంకుచితంగా ఉన్నప్పుడు సమాజంలో మార్పు, సమానత్వం ఎప్పటికి వస్తుంది? 'మా ఇంట్లో నేను పురుషాధిక్యతను చూస్తుంటాను. మా అమ్మ ఇబ్బందులు నేను ప్రత్యక్షంగా చూస్తున్నాను'. మనది గొప్ప సంస్కృతి అని చెబుతుంటాం. కానీ స్త్రీని గౌరవించలేని సంస్కృతి గొప్ప ఎలా అవుతుంది? మార్పు ఇంటి నుంచే ప్రారంభమవ్వాలి. ఎందుకంటే ఇంట్లో పురుషులు ప్రవర్తించినట్లే బయటా అందరూ అలాగే ఉంటారనే అభిప్రాయం ఏర్పడుతుంది. అందుకే కుటుంబం స్థాయిలోనే పురుషులు స్త్రీలను గౌరవించాలి' అనే సుష్మా మాటలు నిజమేగా మరి.

విద్యా, ఉద్యోగాల్లో!

'కాలేజీలో స్టూడెంట్స్ అందర్నీ లెక్చరర్లు ఒకేలా చూస్తారు. కానీ కొందరు మాత్రం అబ్బాయిలకే ఎక్కువ ప్రతిభ ఉన్నట్లు భావిస్తారు. అది చాలా బాధగా ఉంటుంది. పాఠాలు చెప్పే లెక్చరర్లే అలా చేస్తుంటే సమాజం ఎప్పటికి మారుతుంది? లింగవివక్ష స్కూలింగ్ నుంచే మొదలై, అన్ని స్థాయిల్లోనూ కొనసాగుతుంది' అంటూ పావని విద్యాలయాల్లో వివక్ష గురించి ఆవేదన వ్యక్తం చేశారు.

'అమ్మాయిలు ఇంటర్వ్యూలకు వెళ్లినా అబ్బాయిలకే ఉద్యోగమిస్తారు. ఎందుకంటే, అబ్బాయిలు మాత్రమే ఏ ప్రాంతానికైనా వెళ్లి పనిచేయగలరనే అపోహలో ఉండటం వల్ల. క్యాంపస్ సెలక్షన్లలోనూ కొన్నిసార్లు ఇదే జరుగుతుంది. అమ్మాయిలకి ఎంత కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నాసరే వేరే ప్రాంతానికి వెళ్లి పనిచేయగలరా? అని సంస్థల అధికారులు అడుగుతారు. ఆ ప్రశ్న కేవలం అమ్మాయిలు ఎక్కడికీ వెళ్లరనే ఉద్దేశంతోనే అడిగేదే కదా?!' అనే మౌనిక నిట్టూర్చుతుంది. తల్లిదండ్రులు తమ భవిష్యత్తులో కొడుకులు మాత్రమే చూసుకుంటారనే అభిప్రాయాన్ని విడిచిపెట్టి, కూతుర్లూ చూసుకోగలరని అనుకోవాలి. కుటుంబంలో అబ్బాయిల్ని చదివించినంతగా అమ్మాయిల్ని చదివించాలని అనుకోరు. కారణం అబ్బాయి చదివి, సంపాదించి, అమ్మానాన్నని చూసుకుంటాడనే అభిప్రాయం. 'అమ్మాయి బయటకి వెళ్లేదేగా దానికంత ఖర్చు చేయడం ఎందుకని? తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఇది చాలా తప్పని సమాజం తెలుసుకోవాలి. ఇప్పుడు ఆడపిల్లలందరూ చదువుకుంటున్నారు గనుక అమ్మాయిలూ తల్లిదండ్రుల్ని చూసుకోగలరు. అలా ఆలోచించలేనప్పుడు ప్రగతే ఉండదు. సమానత్వం ఎప్పటికీ సాధ్యంకాదు. దాని గురించి మాట్లాడుకోని ఉపయోగం లేదు. ఎందుకంటే సమాజం ఆలోచనల్లో మార్పు రాదు. పురుషులే ఎక్కువ సంపాదించాలి, స్త్రీలు తక్కువ సంపాదించాలి అనే భావన ఎప్పటికీ అలాగే ఉంటుంది. దీనంతటికీ తల్లిదండ్రులే కారణమవుతున్నారు' అంటారు అలేఖ్య.

మార్పులో మేమూ.. భాగమే

'నేను వ్యక్తిగతంగా ఎలాంటి వివక్షనూ ఎదుర్కోలేదు. బహుశా దానికి కారణం మా కుటుంబంలో అందరూ చదువుకున్న వారవ్వడం కావచ్చు. నాకు ఒక అక్క ఉంది. ఇంట్లో మేమిద్దరం అమ్మాయిలమే అయినా అబ్బాయి లేడే అనే అభిప్రాయం మా తల్లిదండ్రులకు ఎప్పుడూ రాలేదు. మమ్మల్ని చాలా గొప్పగా పెంచారు. ఎంతైనా చదివించి, ఉన్నత స్థాయిలో మమ్మల్ని చూడాలనే అనుకుంటారు. మా ఇంట్లో అమ్మ నిర్ణయం ప్రకారమే అన్నీ జరుగుతాయి. దానికి కారణం మా నాన్న ఆమెకి ఇచ్చిన స్వేచ్ఛ. ఆయన్ని చూసి గర్వపడతాను. అయితే పురుషులంతా మహిళలకు స్వేచ్ఛను ఇవ్వడంలేదనేది నిజం. దానికి కారణం పురుషాహంకారమే. మేమే అధికమనే భావన. అలాకాకుండా స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని అనుకున్నప్పుడు అంతా బాగుంటుంది' అనే రోహిత మాటతో ఏకభవిస్తూ 'మా ఫ్యామిలీలోగానీ, బయటగానీ నేను ఎక్కడా పురుషాధిక్యతని చూడలేదు. మా కుటుంబంలో మా బ్రదర్‌ని, సిస్టర్‌ని, నన్నూ... ముగ్గుర్నీ మాస్టర్స్ చేయిస్తున్నారు. కాబట్టి ఇంట్లో అయితే అసమానత లేదు. కానీ సమాజంలో అసమానత ఉన్న మాట నిజం. అది పోవాలంటే అమ్మాయిలు కేవలం చదువుకోవడం మాత్రమేకాదు. పెళ్లయినా ఉద్యోగం చేయాలి. దానివల్ల ఇతరులపై ఆధారపడటం ఉండదు. అయితే పనుల్లోనూ స్త్రీలు మాత్రమే చేసేవి, పురుషులే చేసేవి అనే బేధం లేకుండా అందరూ అన్ని పనులూ చేయగలరనే భావన ఉండాలి' అంటారు సుస్మిత.

ఎవరిపైన అపనమ్మకం?

'అబ్బాయిల్ని ఎక్కడికైనా పంపుతారు కానీ ఆడపిల్లల్ని మాత్రం పక్కవీధికీ పంపడానికి వెనకాడతారు. అమ్మాయిపైన నమ్మకం లేకపోవడమా? బయట పురుషులపైన నమ్మకం లేకపోవడమా? తల్లిదండ్రులు పిల్లల్ని పెంచే విధానమే ఈ అసమానత్వానికి కారణం' అనే ఖ్యాతి ఆలోచన నిజమేనా? అమ్మాయి బయటకి వెళుతుందంటే, ఎందుకు? ఎవరి దగ్గరకి? ఎప్పుడొస్తావు? ఎలా వెళుతున్నావు? ఇలా ప్రశ్నల వర్షం వస్తుంది. అబ్బాయి విషయంలో అంత పట్టించుకోరు. అందుకే ముందు ప్రజల్లో అవగాహన రావాలి. అబ్బాయిల్ని పెంచే విధానంలో మార్పు రావాలి. అబ్బాయి ఏడుస్తుంటే, 'ఎందుకురా అమ్మాయిలా అలా ఏడుస్తావు?' అంటారు. అంటే వాళ్లల్లో కర్కశత్వాన్ని నూరిపోయడమేగా?! ప్రతీ విషయంలో అమ్మాయిల్తో పోలుస్తూ, అమ్మాయిల కంటే ఉన్నతంగా ఉండాలనే భావన వారిలో కల్పిస్తారు. 'అబ్బాయిలు ఏడ్వకూడదు...' అని ఒక టీవి ప్రకటన ఉంటుంది. అందులో అందరూ 'అబ్బాయిలు ఏడ్వకూడదనే' చెబుతారు. దానికి బదులు **'అబ్బాయిలు ఏడిపించకూడదు'** అని ఎందుకు చెప్పరు?

అంతేకాదు, వేసుకునే బట్టల్లోనూ వివక్ష చూపిస్తారు. కాస్త మోడ్రన్ డ్రస్‌లు వేసుకుంటే ఆమెను 'స్లట్' 'వ్యభిచారి' అని కామెంట్ చేస్తారు. బట్టల్ని బట్టి ఆడపిల్ల వ్యక్తిత్వాన్ని ఇలా అంచనా వేయడం చాలా ఘోరం. ఒక అబ్బాయి రోడ్డున వెళ్తుంటే అమ్మాయిలు కామెంట్ చేయరు. కానీ అబ్బాయిలు చేసే ఈవ్‌టీజింగ్‌తో చాలామంది అమ్మాయిలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులే అబ్బాయిల్ని సమర్ధిస్తుంటారు. సమాజం అబ్బాయిల్ని పెంచే పద్ధతి మారితే సమానత్వం తప్పనిసరిగా వస్తుంది. ముందుగా టీనేజర్స్‌లో మార్పు రావాలి. వాళ్లల్లో అవగాహన పెరగాలి.

మా పెళ్లికే తొందరెందుకు?

'ఒక్కో కుటుంబంలో ఒక్కోరకమైన పరిస్థితులు ఉంటాయి. మా ఇంట్లో అందర్నీ సమానంగానే చూస్తారు. నా పేరెంట్స్ నన్ను ఎమ్ఎస్ కోసం బయటకి పంపాలని అనుకుంటున్నారు. మా అన్నయ్య ఇక్కడే జాబ్ చేస్తున్నాడు. అయితే నా సెక్యూరిటీ గురించిన ఆలోచనలు వాళ్లకి లేకపోలేదు. నాకు 24 ఏళ్లు.. ఇంకా మీ అమ్మాయి చదువుతూనే ఉందా?.. అని తెలిసినోళ్లంతా అంటుంటారు. అందుకే తల్లిదండ్రులు తప్పనిసరిగా పెళ్లి చేసేయాలని తొందరపడతారు' అంటారు హారిక. అయితే అబ్బాయిల విషయంలో అలా కాదు. ఉద్యోగం వచ్చిన తర్వాతే పెళ్లి. అమ్మాయిలకు మాత్రం ఉద్యోగం చేయాలని ఉండదా? దాన్ని పట్టించుకునేవారే లేరు సమాజంలో. హారిక స్నేహితులు చాలామంది పెళ్లి చేసేస్తారనే భయంతోనే ఉన్నత చదువులు చదువుతామని పేరెంట్స్‌తో గొడవ పడుతున్నారు. మహిళలు గృహిణిగా ఉన్నప్పుడు పురుషాధిక్యత ఎక్కువగా ఉంటుంది. అదే ఉద్యోగం చేస్తున్న మహి ళలపై అంత స్థాయిలో డామి నేషన్ ఉండదం టున్నారు. ఎందుకంటే పనిచేసే మహిళలకి ఎంతో కొంత ఆర్థిక స్వేచ్ఛ ఉంటుంది కనుక.

సామర్థ్యం తక్కువ కాదు

'పనిచేసే చోట సాధారణంగా మహిళలకు తక్కువ పనిగంటలు ఉండటం, పురుషులకు ఎక్కువ పనిగంటలు కల్పించడంలో మహిళల సామర్థ్యాన్ని తక్కువ చేస్తారు. దానికి 'స్త్రీలకు విశ్రాంతి అవసరం.. మీరు ఎక్కువ పనిచేయలేరు' అనే కారణాలు చూపిస్తారు. ఇది మానసికంగా మహిళల్లో తక్కువపనే చేయగలమనే భావన కలిగించి, కుంగదీయటమే అవుతుంది' అంటారు లలిత.

విద్యాసంస్థల్లో 'ఎన్‌సిసిలో అబ్బాయిలు ఎక్కువగా ఉంటారు. ఎన్ఎస్ఎస్‌లో అమ్మాయిలు ఎక్కువ. స్త్రీలంటే శారీరక శ్రమ చేయలేరని ఉద్దేశంతో ఎన్‌సిసిలో ప్రాముఖ్యత ఇవ్వరు. కుటుంబంలో అమ్మాయిలు ఇంట్లో అవీ ఇవీ శుభ్రం చేస్తూ, ఇంట్లోనే కూర్చోవాలి. అబ్బాయిలు బయటకెళ్లి ఉద్యోగాలు చేయాలి. అలా స్పోర్ట్స్‌లోనూ ఇదే పరిస్థితి. అందుకే ఎన్ఎస్ఎస్‌లోనే అమ్మాయిలు ఉంటారు' అనే హవీల సంశయం నిజమని అనిపించకపోదు. 'శారీరక సామర్థ్యం అబ్బాయిల్లోనే ఎక్కువ అంటారు. ఒక మహిళ బిడ్డకు జన్మనిచ్చేటప్పుడు శరీరంలో ఎముకలన్నీ విరిగిపోయినంత నొప్పి వస్తుంది. అంత నొప్పిని భరించే స్త్రీ శారీరక శ్రమ చేయలేదా? అని సుమ అడిగిన ప్రశ్నలోనే సమాధానం కనిపిస్తుంది. 'పురుషులతో సమానంగా పనిచేసినా స్త్రీలకి తక్కువ వేతనం ఇస్తారు. పనిని బట్టి వేతనం ఉండాలిగానీ స్త్రీ-పురుష బేధాన్ని బట్టి ఉండకూడదు' అంటుంది ప్రవల్లిక.

నోరెక్కువ అనడం కరెక్టా?

సింధు మాటల ప్రకారం 'సమానత్వం రావాలంటే ముందు గ్రామ స్థాయిలో అవగాహన పెరగాలి. నగరాల్లో ఎంతో కొంత మహిళకు స్వేచ్ఛ ఉంది. గ్రామాల్లోనూ కాస్త చదువుకున్న కుటుంబాల్లోనే మహిళకు గుర్తింపు ఉంటుంది. అయితే అన్ని కుటుంబాల్లోనూ కొన్ని విషయాల్లో మహిళలకి నిర్ణయాధికారం ఉండొచ్చు. కానీ అది ఇంటికి సంబంధించిన కొన్ని విషయాల్లో మాత్రమే'. మహిళలకి వాయిస్ లేకపోవడమే పురుషులకు అడ్వాంటేజ్. ఆడోళ్లు మాట్లాడితేనేమో 'ఈమెకి నోరెక్కువ' అంటారు. తక్కువ మాట్లాడితేనేమో అణిచి వేయడానికి ప్రయత్నిస్తారు. అన్ని రంగాల్లోకి మహిళలొస్తే పురుషులకి పోటీగా వస్తారేమోననే భయమూ ఉంటుంది. అందుకే పురుషుల ఆధిక్యత తగ్గిపోకుండా ఉండాలంటే స్త్రీలను ఇంటికే పరిమితం చేయాలనే ప్రయత్నం ఇంకా కొనసాగుతూనే ఉంది.

'మేము ఇలాంటి వివక్షలూ, అసమానతలూ ఎదుర్కొంటున్నాం. కనుక మా తర్వాత తరాలు ఇలాంటి ఇబ్బందులు పడకుండా మేమే చూడాలి. మా పిల్లల్ని మేము పెంచే పద్ధతిలో మార్పు ఉండాలి' అనే దివ్యలాంటి అమ్మాయిల గొంతుకలోని ఆశయాలను అందరూ సాధించాలి.

- ప్రవీణ్ వెలువోలు



ప్రతిఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని అంతా జరుపుకుంటున్నారు. ప్రభుత్వాలు, మహిళాసంఘాలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ఈరోజున చాలా కార్యక్రమాలు నిర్వహిస్తాయి. అయితే మహిళాదినోత్సవ వాస్తవ లక్ష్యం ఇందుకు భిన్నమైనది.

International Women's Day

లింగవివక్షను అధిగమించడం, స్త్రీ పురుష సమానత్వానికి ఉద్యమించడం, ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కులకోసం జరుగుతున్న పోరాటాలు, మహిళలు సాధించిన విజయాలు, నిస్సహాయస్థితిలో ఉన్న తోటి మహిళలకు అందించిన తోడ్పాటు వంటి వాటితో మమేకమై ఉంటుంది. ఈ ఏడాది 2018లో దీనికి లక్ష్యం

అంతర్జాతీయ మహిళాదినోత్సవం 2018 లక్ష్యం



(థీమ్)గా 'ప్రెస్ ఫర్ ప్రోగ్రెస్' అనే నినాదాన్నిస్తున్నారు. ఈ నినాదం అర్థమేమిటంటే ...మహిళలు సామూహికంగా తమ హక్కుల కోసం ఎలుగెత్తి చాటడం. లైంగిక వివక్ష, లైంగిక వేధింపులు వంటి వాటి నుంచి ఐక్యంగా బయటపడడం కోసం ఉద్యమించడం. అయితే ఇదంతా రాత్రికి రాత్రే సాధ్యమయ్యేది కాదు. కానీ మహిళల హక్కులకోసం న్యాయపరమైన మద్దతు, క్రియాశీలక చైతన్యం, సామాజిక అవగాహన పెరుగుతున్నవేళ లక్ష్యసాధనకు మరింత చేరువయ్యే అవకాశాలున్నాయనే ఆశాభావం వారిలో వ్యక్తమౌతోంది.

★

తొలి మహిళా రైల్వేస్టేషన్.. చంద్రగిరి

చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి రైల్వేస్టేషన్ రాష్ట్రంలో తొలి మహిళా రైల్వేస్టేషన్‌గా ఇప్పుడు సంచలనాన్ని సృష్టిస్తున్న వార్త. అదేంటి..? అదెలా..? అనుకుంటున్నారా..? అవును ఈ రైల్వేస్టేషన్‌లోని కార్యకలాపాల నిర్వహణ మొత్తం మహిళలకే అప్పగించారు. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో దేశంలో తొలుత ముంబయిలోని మాతుంగ రైల్వేస్టేషన్లను మహిళావిభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇది గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. ఇప్పుడు మన రాష్ట్రంలో చంద్రగిరిలో ఏర్పాటు చేశారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ ఈ స్టేషన్‌ను అధికారికంగా ఈ నెల ఆరో తేదీన ప్రారంభించారు. ఇది ఆరంభం





మాత్రమే.. మున్ముందు రాష్ట్రంలోని ఆరు డివిజన్లలో ఒక్కో స్టేషన్ చొప్పున మరో ఆరు మహిళాస్టేషన్‌లు ఏర్పాటు కాబోతున్నాయి. చంద్రగిరిలో మొదట దీనికి అంకురార్పణ జరిగింది. "అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని, కేంద్రప్రభుత్వం చంద్రగిరిని మహిళా రైల్వేస్టేషన్‌గా ప్రకటించింది. రాష్ట్రంలోని ఫిరంగిపురం రైల్వేస్టేషన్, హైదరాబాద్‌లోని బేగంపేట రైల్వేస్టేషన్‌ను సైతం మహిళా విభాగంతోనే ఈ నెల 8వ తేదీన ప్రారంభించనున్నాం. దేశంలో మహిళా రైల్వేస్టేషన్లుగా తొలుత ముంబయిలోని మాతుంగ రైల్వేస్టేషన్ గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. ఇప్పుడు మన రాష్ట్రంలోని చంద్రగిరి రైల్వేస్టేషన్ తిరుపతికి సమీపంలోని అతి చిన్నది కావడం వల్ల అతితక్కువ మంది సిబ్బందితో మహిళా విభాగంగా తీర్చిదిద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో మరో ఆరు డివిజన్లలోనూ ఒక్కో స్టేషన్ చొప్పున ఏర్పాటు చేస్తాం" అని వినోద్‌కుమార్ వివరించారు.

★

మీకోసం

దోశ పిండి బాగా పులిసినట్టు అనిపిస్తే దానిలో కొద్దిగా మైదా, చక్కెర కలిపితే పులుపు తగ్గుతుంది.



జీవన సౌరభం

స్త్రీ అంటే సౌందర్యం కాదు.. సమాజ గమనంలో సగభాగం..

సెన్సెక్స్ ↓ 284
33,133

నిఫ్టీ ↓ 95
10,154

రూపాయి ↑ 07 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.89

స్వరాజ్ కొత్త ట్రాక్టర్లు..

మహీంద్రా గ్రూపునకు చెందిన స్వరాజ్ ట్రాక్టర్స్ నూతన శ్రేణీలో 60 హెచ్‌పి, 75 హెచ్‌పి సామర్థ్యంతో స్వరాజ్ 963 ఎఫ్ఇ మోడళ్లను ఆవిష్కరించింది. ఈ ట్రాక్టర్ ప్రారంభ ధర రూ.7.40 లక్షలుగా నిర్ణయించినట్లు మహీంద్రా ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సెక్టార్ అధ్యక్షుడు రాజేష్ జెజురికర్ పేర్కొన్నారు.



జెనివాలో టాటా 'ఇ-విజన్'

టాటా మోటార్స్ కొత్తగా రూపొందించిన విద్యుత్ కాన్సెప్ట్ కారు 'ఇ-విజన్ సెడన్ కాన్సెప్ట్' మోడల్‌ను జెనివాలో ఆవిష్కరించింది. ఇది ఏడు సెకన్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకుంటుందని ఆ కంపెనీ పేర్కొంది. దీన్ని రతన్ టాటా, టాటా గ్రూపు ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, టాటా మోటార్స్ సిఇఒ గుంటెర్ బట్‌చెక్ ఆవిష్కరించారు.



ఫోన్ పోయినా నెంబర్లు భద్రం

ఎంటైర్ యాప్స్ ఫౌండర్ వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

మొబైల్ ఫోన్ బ్యాటరీ డెడ్ అయినా లేదా ఫోన్ ఎక్కడైనా మరిచిపోయినా అందులోని కాంటక్టు ఫోన్ నెంబర్లు తెలుసుకునే విధంగా ఎంటైర్ యాప్స్ ఒక వినూత్న 'మ్యూచువల్ కాలర్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంటైర్ యాప్స్ వ్యవస్థాపకులు మునిపల్లె సాంబశివ రావు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా వేరే ఏ మొబైల్ ఫోన్లో అయినా యాప్ ద్వారా లాగిన్ అయి తమ ఫోన్‌లోని నెంబర్లు చూడవచ్చున్నారు. అదే విధంగా కంప్యూటర్‌లోనూ ఈ డేటా పొందవచ్చున్నారు. దీంతో ఫోన్ పని చేయకపోయినా, పారేసుకున్న కాంటాక్ట్ వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ మరో వినూత్న ఫీచర్‌ను కలిగి ఉందన్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్ కాల్ వస్తే ఇరువురికి ఉమ్మడిగా ఉన్న కాంటాక్టుల సంఖ్యలోని ఇతర ఇద్దరు వివరాలు ఫోన్ తెరపై కనబడుతాయన్నారు. దీంతో అపరిచితులు ఫలానా తాలూకు అని తెలుసుకునే వీలుందన్నారు.

నోట్ల దెబ్బతో బిలియనీర్

యువ కుబేరుడిగా పేటియం అధినేత



న్యూఢిల్లీ : ప్రధానీ నరేంద్ర మోడీ నోట్ల రద్దు నిర్ణయం పేటియం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మను భారత యువ బిలియనీర్‌గా మార్చింది. ఫోర్బ్స్ జాబితా ప్రకారం 39 ఏళ్ల శేఖర్ శర్మ 1.7 బిలియన్ డాలర్లతో 1,394వ ర్యాంక్‌లో నిలిచారు. ఇక భారత్ నుంచి 40 ఏళ్లలోపు వయసున్న బిలియనీర్ ఆయన ఒక్కరే. దేశంలో అత్యంత వద్ధ కుబేరునిగా ఎమెరిటస్ అల్కేమ్ లాబొరేటరీస్ ఛైర్మన్ సంప్రదాసింగ్ ఉన్నారు. అయన వయస్సు 92 సంవత్సరాలు. 2011లో పేటియంను ప్రారంభించిన శర్మ, పేటీఎం మాల్, ఈకామర్స్ బిజినెస్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లను రూపొందించారు. నోట్ల రద్దు సమయంలో 25 కోట్ల మంది ఈ యాప్‌ను రిజిస్టర్ చేసుకోగా, రోజుకు 70 లక్షల లావాదేవీలు జరిగాయి. పేటియంలో శర్మకు 16 శాతం వాటా ఉంది. ఫోర్బ్స్ అంచనా ప్రకారం ప్రస్తుతం పేటియం విలువ 9.4 బిలియన్ డాలర్లుగా ఉంది.

నేల చూపులే..

- సెన్సెక్స్ 284 పాయింట్ల పతనం
- మూడు నెలల కనిష్టానికి క్షీణత



ముంబయి : వరుస అమ్మకాల ఒత్తిడితో దేశీయ స్టాక్ మార్కెట్లు మూడు నెలల కనిష్టానికి దిగజారాయి. వివిధ పరిణామాల మధ్య వరుసగా రెండో రోజూ భారీ నష్టాలు ఎదుర్కొన్నాయి. ప్రధానంగా పిఎన్‌బి స్కామ్ విచారణ, ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బ తీశాయి. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న అనిశ్చితి, అనుమానాల వల్ల ఆ రంగం షేర్లు భారీగా నష్టపోయాయి. ఈ పరిణామాల మధ్య బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 284.11 పాయింట్లు లేదా 0.85 శాతం పతనమై 33,033కు దిగజారింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ మొత్తంగా 1,129 పాయింట్లు కోల్పోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50లో 36 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొగా, 14 స్టాక్స్ మాత్రం స్వల్ప లాభాల్లో ముగిశాయి. నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ దాదాపు 4 శాతం విలువ కోల్పోయింది. ఆంధ్రా బ్యాంకు 7 శాతం, కెనరా బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు, ఎస్‌బిఐ సూచీలు వరుసగా 6.55 శాతం, 5.23 శాతం, 3.84 శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.32 శాతం, 2.16 శాతం చొప్పున పడిపోయాయి. సెన్సెక్స్-30లో అదానీ పోర్ట్సు 6.53 శాతం, ఎస్‌బిఐఎన్ 3.84 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.85 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.53 శాతం, ఒఎన్‌జిసి 2.32 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.12 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. కాగా ఐటిసి 1.05 శాతం, మారుతి సుజుకి 0.70 శాతం, బజాజ్ ఆటో 0.64 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.47 శాతం, కొటాక్ బ్యాంకు 0.42 శాతం, టాటా మోటార్స్ 0.40 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

భారీ విస్తరణలో పోస్టు పేమెంట్స్ బ్యాంకు

- ఏప్రిల్ కల్లా 650 శాఖలు
- తొలుత జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు
- 5000 ఎటిఎం కేంద్రాలు కూడా..
- మంత్రి జయంత్ సిన్హా వెల్లడి



న్యూఢిల్లీ : ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు (ఐపిపిబి) భారీగా శాఖలు ఏర్పాటు చేయనుంది. వచ్చే నెలాఖరు కల్లా దేశ వ్యాప్తంగా 650 శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా పార్లమెంట్‌కు తెలిపారు. ఏప్రిల్ 2018 కల్లా దేశంలోని అన్ని ప్రధాన జిల్లా కేంద్రాల్లో ఈ శాఖలను అందుబాటులోకి తేనున్నట్లు లోకసభకు మంత్రి లిఖితపూర్వకంగా తెలిపారు. పోస్టల్ శాఖ పేమెంట్ బ్యాంకుల ఏర్పాటుకు 2017 జనవరి 20న రిజర్వు బ్యాంకు ఆమోదం లభించింది. పైలట్ ప్రాజెక్టు గతేడాది జనవరి 30న రాయ్‌పూర్, రాంచీలో రెండు శాఖలను ఏర్పాటు చేసింది.

ఈ 650 శాఖల్లో సివిల్, విద్యుత్, ఫర్నీచర్, టెక్నలాజీ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇవి తుది దశలో 1.55 లక్షల తపాల కార్యాలయాలను పర్యవేక్షించడంతో పాటుగా వాటిని కంట్రోల్ చేయనున్నాయని తెలిపారు. అదే విధంగా 528 మంది మేనేజర్ల నియామకానికి కసరత్తు జరుగుతుందన్నారు. కొత్తగా ఐపిపిబి శాఖల ఏర్పాటు అనంతరం ఐదేళ్లలోనే 8 కోట్ల మంది ఖాతాదారులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా వచ్చే కొద్ది ఏళ్లలో వీరిని డిజిటల్ పేమెంట్స్ రంగంలోకి తీసుకురావాలని నిర్దేశించుకున్నట్లు తెలిపారు.

ఐపిపిబి కోసం సమీకృత సిస్టమ్ (ఎస్ఐ) కోసం ఇటిటి సర్వీసెస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌తో ఒప్పందం జరిగిందన్నారు. ఈ అడ్వాన్సుడ్ టెక్నలాజీ కోసం 2017 ఆగస్టు 14న అంగీకరం జరిగిందన్నారు. ఐపిపిబి శాఖల ఏర్పాటుతో పాటు 5,000 ఎటిఎం కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ఐపిపిబి డిఒపి ఎటిఎం కేంద్రాలు కలిగి ఉందన్నారు. వీటిని ఇతర బ్యాంకుల నెట్‌వర్క్‌తోనూ అనుసంధానించినట్లు తెలిపారు.

నేటి నుంచి వింగ్స్ ఇండియా ప్రదర్శన

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్‌లో మార్చి 8-11వ తేదిల్లో వింగ్స్ ఇండియా 2018 ప్రదర్శన జరగనుంది. ఫిక్కీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ దీన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. తొలి రోజు గురువారం పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు బేగంపేట్ ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శనను లాంచనంగా ప్రారంభించను న్నారు. ఇక్కడ ప్రపంచంలోని 125 విమాన యాన తయారీ, సేవల కంపె నీలు తమ ఉత్ప త్తులు, విమానాలను ప్రదర్శనకు ఉంచను న్నాయి. వివిధ అంశాలపై సెమినార్లు, అవార్డుల ప్రదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఖార్డ్‌కు మైక్రోసాఫ్ట్ సహకారం

హైదరాబాద్ : మైక్రోసాఫ్ట్ ఇండియా సహకారంతో ఖార్డ్ ఎన్‌జిఒ మహిళ సాధికారత కోసం కృషి చేస్తున్నట్లు ఖార్డ్ తెలిపింది. బుధవారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించగా ఇందులో మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ అనుపమ దత్, ఖార్డ్ వ్యవస్థాపకుల సుమన్ మల్లాడి, డైరెక్టర్ మంజు లత పాల్గొన్నారు. ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఖార్డ్ సంస్థ 29 ప్రాజెక్టులను చేపట్టగా, ఆంధ్రప్రదేశ్, తెలంగా ణలోని 7 జిల్లాల్లో వివిధ సహకారం అందించి నట్లు ఖార్డ్ ప్రతినిధులు పేర్కొన్నారు. 120 మంది పూర్తి స్థాయి 800 మంది గ్లోబల్ వాలంటీర్లతో దాదాపు 15వేల మంది చిన్నారు లకు విద్యతో పాటు 3వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

సవరణ

ఈ నెల 7న 'కొచ్చర్‌కు నోటీసులు' వార్త ఉప శీర్షికలో 'యస్ బ్యాంకు చీఫ్‌కు కూడా' అని పొరపాటున ప్రచురితమైంది. దానిని 'మరో దిగ్గజ ప్రైవేట్ బ్యాంకు చీఫ్'కు కూడా అని చదువుకోగలరు.

\- ఎడిటర్

SOCIAL PAPER-I

S.S.C. MODEL PAPER

(Geography and Economics)

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

PART - A

Time : 2h 15mts Max. Marks : 30

Instructions :

1. 15 minutes allocated to read the question paper. 2.30hrs allocated to write answers.

2. Part - A must be answered in a separate answer sheet.

3. Students can take Part-A (Question Paper) with them.

4. Map and Part -B (Bit Paper) should tag to the answer sheet and given them to the invigilator.

Section - I 4x1=4M

Instructions :1. Write answers to the FOUR questions in one or two sentences.

2. Each question carries ONE mark.

1. What is the time in India when it is 9 AM in London?
2. What is Chipko Andolan ? Where did it start ?
3. What is Aerotropolis ?
4. What is the main aim of Narmada Bachavo Andolan?

Section - II 5x2=10M


Instructions :1. Write answers to the Five questions.

2. Each question carries Two marks.

5. What are the factors that helped Himachal Pradesh in achieving a better literacy rate?
6. Look at the below table. Explain why sex ratio is unequal in different regions.

Area	Haryana	Punjab	AP	Kerala	USA
Sex ratio	870	880	970	1040	1050

7. How are the Eastern Coastal Plains and Western Coastal Plain similar or different ?
8. In the below map, from which points the average temperature lines are moving. Mention two reasons for such movements of average temperature lines.



9. Draw the outline map of Andhra Pradesh and locate "Amaravathi" & Bay of Bengal

Section -III 4x4=16M

Instructions: 1. Write answers to the FOUR questions.

2.Each question has internal choice.

3.Each question carries FOUR marks.

10. A) What is global warming? Suggest some measures to minimize the influence of the global warming ? (or)

B) Compare and contrast the migration from rural to urban areas and rural to rural areas.

11. Read the following Paragraph and answer the given question :

A)"In the past 50 years, there has been a further shift from industry to service sector for developed countries. The service sector has become the most important in terms of total production. Most of the working people have also shifted and are now employed in the service sector and most of the production activities are those of services and not manufactured goods. This is the general pattern observed for developed countries".


Q : Is there a similar pattern observed for India or is it different? Write your opinion

(or)

B) Early humans hunted and gathered their food. That is why they were called huntergatherers. They were nomadic i.e., they kept moving from place to place. This was in search of food – gathering food from plants and trees, and hunting animals for meat, hide (animal skin), and other uses. They started making and using tools – initially made of stone. With these tools, they were able to hunt more effectively and efficiently.

Q: Compare and contrast nomadic and Sedentary life Styles.


12. A) Observe the following graph and answer the questions given below.



a) What is fertility rate ?
b) Why the fertility rate declined between 1961 to 2011 ?
c) According to the data given in the graph. In which decade the fertility rate declined rapidly?
d) What is the rate of fertility that declined between 1961 to 2011 ?

(or)

B) Observe the following graph and answer the questions given below.



a) What percent of rice is purchased from ration shops in total consumption of rice in India ?
b) In which state people are purchasing food grains prominently from ration shops.?
c) In which states public distribution system is distributing food grains nominally ?
d) In which state public distributing system is performing well ?

13 A) Locate the following in India Outline Map:

1) The place situated on the three seas.
2) Indian Standard meredion
3) The river that flows in Thar Desert
4) Capital city of India

(or)

B) The southern part of the Peninsular plateau is bordered by narrow coasted strips along the **Arabian Sea** on the west and the **Bay of Bengal** on the east. The **Western Coast** starts from the **Rann of Kutch** and ends at Kanyakumari. It is narrower than east coast.

Locate the places underlined in the paragraph given above on the outline map of India.

PART - B

Time : 30mts. Max. Marks : 10

Instructions:1. Write the CAPITAL LETTERS showing the correct answer for the following questions in the brackets provided against each question.

2. Each question carries 1/2 marks.

3. Answer all the questions.

4. Answers are to be written in the question paper only.

5. Marks will not be awarded in case of any over writing and rewriting or erased answers.

Section - IV 20x1/2=10M

Instructions:1. Answer all questions.

2. Each question carries 1/2 mark.

14. Which is Correct one? ( )
A) Konkana Coast - Andhra Pradesh
B) Malabar Coast - Maharashtra
C) Circar Coast - Kerala
D) Coramandal - Tamilnadu

15. Which of the following does not belong to unorganized Sector? ( )
A) Public Sector
B) Small Scale Industry
C) Agricultural Labourers
D) Building Construction

16. The Thar Desert is located on the leeward side of ( )
A) Aravalies B) Vindhya Range
C) Satpura D) Sahyadri

17. German Word Trade Means ( )
A) Commerce B) Track
C) Monsoon D) Jet Streams

18. Which of the following is not a hill Station?
A) Shimla B) Gulmarg( )
C) Nainital D) Delhi

19. The Emigration Act of India is passed in ... . Year ( )
A) 1973 B) 1983 C) 1971 D) 1981

20. The population in a Square Kilometer area is called ( )
A) Population
B) Population Density
C) Decrease in Population
D) Over Population

21. While averages are useful for comparision they also hide .... ( )
A) Disparties B) Quality
C) Development D) None of the above

22. The Percentage as unorganised workers in India ( )
A) 92 B) 90 C) 88 D) 80

23. Silent Spring is written by ( )
A) Rachel Carson B) Sunderlal Bahuguna
C) Salim Ali D) Tennyson

24. Production of commodity, mostly through the natural process, is an activity in ....sector
A) Primary B) Secondary ( )
C) Teriary D)Information technology

25. From the following which statemnet is correct regarding globalization ( )
A) Technology is developing rapidly
B) Small scale trademen will get benefited
C) Not suitable for the developed countries
D) All are correct

26. Mid-day Meals Scheme was firstly introduced is the .... state ( )
A) Andhra Pradesh B) Tamilnadu
C) Kerala D) Karnataka

27. The recommended food intake per day is rural areas ( )
A) 2100 calories B) 2300 calories
C) 2400 calories D) 2500 calories

28. Suppose you went to a wedding party. There you noticed a huge food waste. In that situation what can you do? ( )
A) You take home the waste food
B) You make throw the waste food out
C) You try to give the waste-food to the poor and Needy
D) You complain the Govt. on this matter.

29. Match the following : ( )


A)	B)
1) The Ganga	a) Sutlej
2) The Brahmaputra	b)Tungabhadra
3) The Indus	c) Lohit
4) The Krishna	d) Kosi

A) 1-d, 2-c, 3-a, 4-b
B) 1-d, 2-a, 3-b, 4-c
C) 1-d, 2-b, 3-c, 4-a
D) 1-d, 2-c, 3-b, 4-a

30. To conserve the Water resources for future generations : ( )
A) Water resources to be treated as private property
B) Deep borewells to be dug
C) Water intensive crops to be grown
D) Water resources have to be treated as a common pool resource.

31. Quantity of food grains Antyodaya Card Holders are entitled ( )
A) 30 kgs/month B) 35 kgs/month
C) 40 kgs/month D) 50 kgs/month

Observe the following India map and answer the Question no. 32 & 33



32. In the given India Map "H" shows which place ( )
A) Odissa
B) Madhya Pradesh
C) Uttar Pradesh
D) Rajasthan.

33. In the given India map, "C" shows which place ( )
A) Kerala B) Gujarat
C) Tamilnadu D) Karnataka

ప్రభుత్వ వైఖరి మారాలని వెటర్నరీ విద్యార్థుల హోమం

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా)

గ్రామీణ పశువైద్యశాలలను అప్‌గ్రేడ్ చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి మారాలని కోరుతూ కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వెటర్నరీ కళాశాలలో బుధవారం విద్యార్థులు హోమం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి పోరాట కమిటీ నాయకులు యశ్వంత్‌నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి వెటర్నరీ విద్యార్థులంటే చిన్నచూపు ఉందన్నారు. ఏడు రోజులుగా తరగతులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నా అధికారులుగాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించలేదన్నారు. గ్రామీణ పశువైద్యశాలలను అప్‌గ్రేడ్ చేస్తే వైద్యుల పోస్టులు అందుబాటులోకి వస్తాయన్నారు.

వినూత్నం కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వెటర్నరీ కళాశాలలో బుధవారం హోమం చేస్తున్న గ్రామీణ పశు వైద్యశాల విద్యార్థులు



అమలు కాని రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రత్యేక హోదా రాష్ట్ర ప్రజల హక్కు అని, ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. 'ప్రత్యేక హోదా సాదిద్దాం, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ సాదిద్దాం' అనే అంశంపై విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం సదస్సు నిర్వహించారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్య వక్త హాజరై మాట్లాడారు. ప్రత్యేక హోదాకు ఎలాంటి చట్టాలూ అవసరం లేదని, ఇప్పటి వరకు దేశంలో ప్రత్యేక హోదా కల్పించిన రాష్ట్రాలకు ఎలాంటి చట్టమూ చేయలేదని గుర్తు చేశారు. ప్రణాళిక సంఘం సిఫార్సు, ఎన్‌డిసి ఆమోదం, కేంద్ర క్యాబినెట్ ఆమోదం ఉంటే ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక హోదా కల్పించవచ్చన్నారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడమూ పచ్చి మోసమన్నారు. నెహ్రూ లాంటి ప్రధాన మంత్రి భవిష్యత్తును ఆలోచించి పారిశ్రామికీకరణ, విద్య, వైద్య, వంటి రంగాలను ప్రోత్సహించారన్నారు.

ఎస్‌కెయు పిజి సెట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-ఎస్కేయూ (అనంతపురం)

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రవేశం కోసం వైస్ ఛాన్సలర్ కె.రాజగోపాల్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అడ్మిషన్ల సంచాలకులు ఆచార్య తిమ్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి విశ్వవిద్యాలయం, వాటి పరిధిలోని పీజీ కళాశాలల్లో ఎంఎ, ఎంకాం, ఎంఎస్‌సి, ఎంఇడి, ఎంపిఇడి కోర్సులకు మార్చి 12 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు చెప్పారు. లేట్ ఫీజు, తత్కాల్ ద్వారా ఏప్రిల్ 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. డిగ్రీ పూర్తిచేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న విదార్థులందరూ అర్హులేనని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నాసా (అమెరికా అంతరిక్ష సంస్థ)
2. మార్చి 5న ముంబైలో
3. పంకజ్ అద్వానీ-మనన్ చంద్ర
4. 3 గ్రహాలు
5. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ (112 బిలియన్ డాలర్లు)

మతోన్మాదుల దాడిపై పెల్లుబికిన ఆగ్రహం



నెల్లూరులో భారీ ర్యాలీగా బయలుదేరిన వామపక్ష నాయకులు



విశాఖలో గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దిష్టిబొమ్మలు దహనం

ప్రజాశక్తి-యంత్రాంగం

త్రిపురలో సిపిఎం కార్యాలయాలను దగ్ధం చేసి, లెనిన్ విగ్రహాన్ని కూల్చిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాల చర్యలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. అత్యంత ప్రశాంతమైన త్రిపురలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాల అరాచకాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి వైఖరి నశించాలని నాయకులు నినదించారు. మతోన్మాదుల చర్యలను నిరసిస్తూ విశాఖపట్నంలో ప్రదర్శన చేపట్టారు. సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు ఎజె.స్టాలిన్, డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. విజయనగరం జిల్లాలో పలు చోట్ల సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. విజయనగరం జిల్లా కేంద్రంతోపాటు, బొబ్బిలి, కొత్తవలస, పూసపాటిరేగ, సాలూరులో రాస్తారోకో చేశారు. ఏలూరులో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కృష్ణాజిల్లాలో పలు చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నూజివీడులో చినగాంధీ బొమ్మ సెంటర్‌లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తిరువూరులో స్థానిక బైపాస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు బస్టాండ్ మీదుగా బైక్ ర్యాలీ చేశారు. బందరు కోనేరు సెంటరులో నిరసన ప్రదర్శన చేశారు. కంచికచర్లలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గన్నవరంలో వామపక్షాల నాయకులు నిరసన చేపట్టారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మంగళగిరిలో నిరసన ర్యాలీ చేపట్టారు. తెనాలి రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ మిద్దె సెంటర్, సాదు సోడా సెంటర్, మెయిన్ బజారు మీదుగా గాలిగోపురం, అంబేద్కర్ సెంటర్ వరకూ సాగింది. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు మాట్లాడారు. పెదకాకానిలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. త్రిపురలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు ప్రపంచ కార్మిక నేత లెనిన్ విగ్రహాన్ని కూలదోసి, సిపిఎం కార్యాలయాలు, కార్యకర్తలపై దాడులకు తెగబడడాన్ని నిరసిస్తూ నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ స్థానిక సుందరయ్య విగ్రహం నుంచి విఆర్‌సి సెంటర్ వరకూ కొనసాగింది. ర్యాలీలో సిపిఎంతో పాటు సిపిఐ, సిపిఐఎంఎల్, న్యూడెమోక్రసీ, పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'మతోన్మాదుల దుశ్చర్యలను ఖండించండి, ఖబడ్దార్ బిజెపి గూండాల్లారా' అంటూ నినదించారు. కర్నూలులో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు సాగాయి. సిపిఎం ఆధ్వర్యంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దిష్టిబొమ్మలను దహనం చేయగా నంద్యాలలో రాస్తారోకోలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, కంట్రోల్ కమిషన్ సభ్యులు టి.షడ్రక్ పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన తెలిపారు.

హోదా కోసం నిరసనల హోరు

- శ్రీకాకుళంలో ఏడుగురు వామపక్ష నేతల అరెస్టు



విజయవాడలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని కేంద్రం ప్రకటించడాన్నీ, ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులపై, ప్రజలపై లాఠీ చేయడాన్నీ నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు జరిగాయి. వామపక్షాలు, పలు సంస్థలు, ఆధ్వర్యాన ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాకుళంలో ఏడుగురు వామపక్ష నేతలను పోలీసులు అరెస్టు చేశారు. రామలక్ష్మణ కూడలిలో గల సిపిఐ కార్యాలయం కార్యాలయం నుంచి సూర్యమహల్ కూడలి వరకూ ర్యాలీగా బయలుదేరిన సిపిఎం, సిపిఐ నాయకులను పోలీసులు అడ్డగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి, సిపిఐ నాయకులు బి.శ్రీరామ్మూర్తితోపాటు ఏడుగురిని అరెస్టు చేసి శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిపిఎం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రకాశంచౌక్‌లో మండుటెండలో రోడ్డుపై పడుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలను నడిరోడ్డుపై పడేశారని నినదిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడారు. నరసాపురంలో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. ఆంధ్రాయూనివర్సిటీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తెలుగుతల్లి విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. సిపిఎం ఆధ్వర్యాన విజయవాడ బీసెంట్ రోడ్డులోని అన్సారీపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి డి.విష్ణువర్ధన్ పాల్గొన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో అఖిలపక్షం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు.

సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. భట్టిప్రోలులో వైసిపి, సిపిఎం ఆధ్వర్యాన దీక్షలు చేపట్టారు. కొల్లూరులో వైసిపి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యాన దీక్షలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా రేణిగుంట, తిరుపతి బిటిఆర్ కాలనీలలో మోడీ, జైట్లీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. సిపిఎం ఆధ్వర్యాన తిరుపతి బిటిఆర్ కాలనీలోనూ, సిపిఎం, సిపిఐ, వైసిపి ఆధ్వర్యాన రేణిగుంటలోనూ, సిపిఎం, వైసిపి ఆధ్వర్యాన శ్రీకాళహస్తి, పుత్తూరులోనూ ఆందోళనలు నిర్వహించారు. కర్నూలులో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వాలంటే లాఠీలతో జవాబు చెప్పారంటూ సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తీవ్రంగా ఖండించారు. వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యాన విశాఖ జిల్లా భీమిలి పాత బస్టాండ్ వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్.ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్టు, నిర్బంధం

- 'చలో విజయవాడ'ను అడ్డుకున్న పోలీసులు
- చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఉద్రిక్తత

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడకు బయల్దేరుతున్న ఆశాలను రైల్వే స్టేషన్‌లో పోలీసులు అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆశా వర్కర్ల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చలో విజయవాడకు వెళ్ళేందుకు బుధవారం పెద్ద సంఖ్యలో చిత్తూరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి ఆశాలు చిత్తూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వన్‌టౌన్ సిఐ శ్రీధర్, ఎస్ఐ ఖాజావలీలు పెద్ద సంఖ్యలో మహిళా కానిస్టేబుల్స్‌తో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆశా వర్కర్ల కదలికలను పరిశీలించారు. రైల్వే ట్రాక్‌పైకి శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రాగానే ఆశాల చుట్టూ పోలీసులు వలయంగా ఏర్పడి రైలెక్కకుండా అడ్డుకున్నారు. దీంతో ఒక్క సారిగా చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తీరును నిరసిస్తూ సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లు నినాదాలు చేస్తూ రైల్వేస్టేషన్‌లోనే ఆందోళన చేపట్టారు.

ఆశా వర్కర్లను చలో విజయవాడకు వెళ్ళనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడంపై సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, ఉపాధ్యక్షులు చల్లా వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా చలో విజయవాడను విజయవంతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు నేతలు, ఆశాల అరెస్టు అన్యాయమని యూనియన్ నాయకురాలు భువనేశ్వరి ఓ ప్రకటనలో ఖండించారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో 70 మందిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే మదనపల్లిలో ఏడుగురిని అరెస్టు చేశారు.

ప్రత్యేక హోదా ఎపి ప్రజల ఆకాంక్ష

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్ష అని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు, గిరిజన యూనివర్సిటీ తదితర అంశాల అమలుకు చేపట్టిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జీపుజాతా బుధవారం ముగిసింది. విశాఖలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక చైర్మన్ ఆచార్య కెవి.రమణ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో అజశర్మ మాట్లాడారు. మార్చి 1న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లోని ప్రధాన ప్రాంతాలలో పర్యటించిందన్నారు. 75 కూడళ్లలో సభలు, సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రత్యేక హోదాపై ఎన్నికలు ముందు అనేక హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ ఎగనామం పెట్టడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో హోదాను తాకట్టు పెట్టడంపైనా అసంతృప్తి ఉందన్నారు. దీనితోపాటు విభజన చట్టంలోని అంశాలనూ కేంద్రం అమలు చేయకపోవడం, రాష్ట్రం కేంద్రంపై ఒత్తిడి తేవడంలో వైఫల్యం, ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా సంజీవని కాదని స్వయంగా ప్రకటించడం, అర్ధరాత్రి ప్యాకేజీని ఆహ్వానించడం వంటి చర్యలన్నీ రాష్ట్రానికి తీరని హాని చేశాయని ప్రజలు గుర్తించారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిసి రాష్ట్రానికి ద్రోహం చేశాయనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో వేదిక కోశాధికారి బి.గణేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.విజయ గౌరి, యువజన విభాగం నుంచి యుఎస్ఎన్.రాజు, విద్యార్థి విభాగం నుంచి కె.ప్రియాంక పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చేసిన వారిని శిక్షించాలని దూడలకు వినతి

ప్రజాశక్తి-అరకు రూరల్ (విశాఖపట్నం)


సిఎం దత్తత పంచాయతీ విశాఖ జిల్లా అరకులోయ మండలం పెదలబుడు టౌన్‌షిప్‌లో శరభగుడ నివాసి కొర్రా రిబిక నిర్మించిన ఇంటిని కూల్చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, శిక్షించాలని గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యాన స్థానిక గిరిజనులు, బాధితులు తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను చూసిన ఆర్ఐ, విఆర్ఒ, కొంతమంది రెవెన్యూ సిబ్బంది కార్యాలయం నుంచి పరారయ్యారు. దీంతో దూడలకు వినతిపత్రం ఇచ్చి, ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ కొర్రా రిబిక భర్త రౌతుకు 2008లో ఎల్‌పిసి కింద ఇచ్చిన డి పట్టా భూమిలో రూ.10 లక్షలతో ఇళ్లు కట్టుకుంటే, రెవెన్యూ యంత్రాంగం కూల్చేయడం అన్యాయమన్నారు. ఇది 1/70 చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని చెప్పారు. బాధితులకు జరిగిన నష్టంపై జిల్లా కలెక్టర్, ఎస్‌టి, ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆందోళనలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్, మండల కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుంటూరు/విజయవాడ

మహిళల హక్కులు, ఉద్యమాలను ప్రతిబింబించటంలో ప్రజాశక్తికి ప్రత్యేక స్థానం ఉందని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను గుంటూరు అర్బన్ డిఎస్‌పి కెజివి సరిత బుధవారం ఆవిష్కరించారు. గుంటూరు ఇన్నర్ రింగురోడ్డులోని ప్రగతినగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ బి.సుధాకిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళల కోసం డాక్టర్ రమేష్ ఆసుపత్రి, యశస్వీ ఆసుపత్రుల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రారంభించారు. అలాగే ఇసిజి శిబిరాన్ని డాక్టర్ ప్రసన్న యశస్వి, గైనిక్ శిబిరాన్ని డాక్టర్ లక్ష్మీకాంతం ప్రారంభిం చారు. స్థానిక ప్రగతినగర్‌తోపాటు చుట్టుపక్కల కాలనీలకు చెందిన వందలాది మంది ప్రజలూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ శిబిరం కొనసాగింది. వైద్య పరీక్షల అనంతరం ప్రజలకు ఉచితంగా మందుల పంపిణీ జరిగింది. గుండె, స్త్రీ వైద్యం, దంత వైద్య శిబిరాలు, జనరల్ మెడిసిన్ పరీక్షలు నిర్వహించి, మందులు కూడా పంపిణీ చేయటంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.



గుంటూరులో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో మందులు తీసుకుంటున్న స్థానికులు

విజయవాడలో

మహిళల సమస్యలపై, వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు, వారిలో ఉద్యమ స్ఫూర్తిని నింపేందుకు ప్రజాశక్తి ప్రచురించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక సంచికను బుధవారం కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ విజయకృష్ణన్ ఆవిష్కరించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆమె ఈ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఓ వేడుకలా, ఉత్సవంలా కొందరు నిర్వహిస్తున్నారని, కానీ ఇది వేడుకలు, ఉత్సవాలు చేసుకునే సమయం కాదని, ఈ దినోత్సవ స్ఫూరితో మహిళా సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉచిత కుటుంబ న్యాయ సలహా కేంద్రం కౌన్సిలర్ ఒ.శాంతి, ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్ మేనేజర్ జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మహిళల సమస్యలపై, వారు పోరాటం సాగించాల్సిన విధానంపై మహిళలు ప్రత్యేక గీతాలను ఆలపించారు. రవి బృందం ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది.

డిసిడబ్ల్యు ఛైర్మన్‌ను అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ: బుధవారం నాడు తాను ప్రధాని కార్యాలయానికి వెళ్తున్న సమయంలో తనను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారని ఢిల్లీ మహిళా కమిషన్ (డిసిడబ్ల్యు) ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ చెప్పారు. మహిళా కమిషన్ చేపట్టిన 'రేప్ రోకో'(అత్యాచారాలను నిరోధించండి) అన్న ఉద్యమంలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి తమకు అందిన లేఖలను ప్రధాని కార్యాలయంలో అందచేసేందుకు వెళ్తున్నపుడు పోలీసులు తనను అడ్డుకున్నారని ఆమె వివరించారు. అయితే కొద్ది సేపటి తరువాత ఆమెను విడిచిపెట్టిన పోలీసులు ప్రధాని కార్యాలయం వరకూ ఆమెను అనుసరించారు. మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలన్న డిమాండ్‌తో మహిళా కమిషన్ గత జనవరిలో 'రేప్‌రోకో' ఉద్యమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.



కొత్త భవనం । న్యూఢిల్లీలో కొత్తగా నిర్మించిన కేంద్ర సమాచార కమిషన్ భవన సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం నమూనాను పరిశీలిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రాధా కృష్ణ మధూర్ కూడా పాల్గొన్నారు.

యుపిలో మరో దళితుడి సజీవదహనం

జైపూర్ : రాజస్థాన్‌లో వారం వ్యవధిలోనే ఇద్దరు దళిత వ్యక్తుల హత్యలు జరిగాయి. రాజస్థాన్‌లో ఆల్వార్ జిల్లాలో బిమాండీలో నీరవ్ జతవ్ అనే దళిత యువకుడిని కొట్టి చంపిన సంగతి మరిచిపోకముందే మరో దారుణం చోటుచేసుకుంది. రాజస్థాన్ పూల్ భాగ్‌లో హత్యకు గురైన దళితుడిని అజయ్ జతవ్ అని గుర్తించామని పోలీసులు తెలిపారు. మార్చి 3న భివండీలో హోలీ పండుగలో జరిగిన ఘర్షణల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు అజయ్‌ను సజీవ దహనం చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ అతను ఘర్షణల్లో లేడని ప్రాథమిక విచారణలో వెల్లడైందని అదనపు పోలీస్ సూపరింటెండెంట్ పుష్పేంద్ర సోలంకి తెలిపారు. అజయ్ కుటుంబ సభ్యులు పేర్కొన్న 8మందిపై కేసు నమోదు చేసినా వారిని అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. పోలీస్ బందోబస్తు మధ్య దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ హత్యకు నిరసనగా స్థానికులు రాస్తారోకో చేశారు. తన సోదరుడిని ఒక వ్యక్తి షాపు నుండి తీసుకొని వెళ్ళి హత్య చేశారని అజయ్ సోదరుడు హరి కృష్ణ పోలీసులకు తెలిపాడు. అజయ్, నీరవ్ స్నేహితులనీ, అతనిని చంపిన రోజే తన సోదరుడిని కూడా చంపి ఉంటారని ఆరోపించారు.

23న రాజ్యసభ ఎన్నికలు : ఇసి ప్రకటన

న్యూఢిల్లీ: రాజ్యసభలో ఖాళీ అవుతున్న 58 స్థానాలకు ఈ నెల 23న పోలింగ్ జరుగుతుందని ఎన్నికల కమిషన్ బుధవారం ప్రకటించింది. ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఈ పోలింగ్ జరుగుతుందని కమిషన్ ఒక ప్రకటనలో వివరించింది. నామినేషన్ల దాఖలు చేయటానికి ఈ నెల 12 వ తేదీ, ఉపసంహరణకు 15వ తేదీని తుదిగడువుగా నిర్ణయించినట్లు తెలిపింది. యుపి నుండి పది, బీహార్, మహారాష్ట్ర నుండి ఆరు స్థానాల వంతున, మధ్యప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాల నుండి ఐదు స్థానాల వంతున, గుజరాత్ కర్నాటక రాష్ట్రాల నుండి నాలుగు స్థానాల వంతున, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి మూడేసి స్థానాలకు, జార్ఖండ్ నుండి రెండు, హర్యానా, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుండి ఒక్కో స్థానం వంతున మొత్తం 58 స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

సంపూర్ణ రుణమాఫీ కోసం రైతుల 'లాంగ్‌మార్చ్'

నాశిక్: వ్యవసాయరుణాలను పూర్తిగా రద్దు చేయాలన్న డిమాండ్‌తో అఖిల భారత కిసాన్‌సభ మహారాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాశిక్ నుండి ముంబయి వరకూ రైతుల 'లాంగ్ మార్చ్' మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. దాదాపు 25 వేల మంది రైతులు పాల్గొంటున్న ప్రారంభమైన ఈ 'లాంగ్‌మార్చ్'కి మంగళవారం రాత్రి ముంబయి ఆగ్రా జాతీయ రహదారిపై విరామం ఇచ్చి, తిరిగి బుధవారం ఉదయం కొనసాగించారు. ఈ నెల 12న ముంబయి చేరుకున్న తరువాత రైతుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ విధాన సభను ముట్టడిస్తామని కిసాన్ సభ ప్రతినిధి సునీల్ మాలుసరే చెప్పారు. వ్యవసాయ రుణాలు, విద్యుత్ బిల్లులను పూర్తిగా మాఫీ చేయటంతోపాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దీనితో పాటు సూపర్‌హైవే, బుల్లెట్ ట్రైన్ వంటి అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో సాగుభూములను బలవంతంగా సేకరించటాన్ని విరమించాలని తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రైతు వ్యతిరేక విధానాలకు వెంటనే తెరదించాలని ఆయన డిమాండ్ చేశారు.

నీట్‌కు ఆధార్ తప్పనిసరి కాదు

సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ : నీట్‌తో సహా ఏ జాతీయ ప్రవేశపరీక్షకైనా ఆధార్ వివరాలు తప్పనిసరిగా సమర్పించాల్సిన అవసరమేమీ లేదని సుప్రీం కోర్టు బుధవారం స్పష్టం చేసింది. ఈ ఏడాది నీట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఆధార్‌ను తప్పనిసరి చేయడానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ రూలింగ్ ఇచ్చింది. ఈ పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు ఫిబ్రవరి 27న కొట్టివేయడంతో పిటిషనర్ అబిద్ అలీ పటేల్ సుప్రీంకోర్టుకు వెళ్ళారు. నీట్‌కు దరఖాస్తు చేయడానికి అభ్యర్థులకు శుక్రవారం వరకు సమయం వుంది. అస్సాం, జమ్మూ కాశ్మీర్, మేఘాలయలకు చెందిన వారు మినహా మిగిలిన దరఖాస్తుదారులు ఆధార్ వివరాలు అందచేయాలని గతంలో కోరారు. అయితే నీట్‌ను నిర్వహించే సిబిఎస్‌ఇకి ఆధార్ తప్పనిసరి అని తామేమీ చెప్పలేదని యుఐఎడి బుధవారం సుప్రీం కోర్టుకు తెలియచేసింది. ఇతర ఐడి రుజువులు అందచేస్తే సరిపోతుందని అటార్నీ జనరల్ వేణుగోపాల్ తెలిపారు.

ఈ మూడు రైల్వే స్టేషన్లలోనూ మహిళా సిబ్బందే..

మహిళా దినోత్సవం కానుక

హైదరాబాద్ : ప్రపంచ మహిళా దినోత్సం సందర్భంగా దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జోన్‌లోని మూడు రైల్వే స్టేషన్లను గురువారం నుంచి పూర్తిగా మహిళా సిబ్బందితో నిర్వహించనున్నారు. మహిళా ఉద్యోగులకు ప్రోత్సాహం ఇచ్చే ఉద్దేశ్యంతో దీన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌సిఆర్ అధికారులు తెలిపారు. గుంతకల్ డివిజన్‌లోని చంద్రగిరి రైల్వే స్టేషన్, సికింద్రాబాద్ డివిజన్‌లోని బేగంపేట్, గుంటూరు డివిజన్‌లోని ఫిరంగపురం రైల్వే స్టేషన్లను గురువారం నుంచి మహిళా సిబ్బంది నిర్వహించనున్నారు. రైలు రాకపోకలు, టిక్కెట్లు, భద్రత వంటి అన్ని రోజువారీ కార్యక్రమాలను మహిళే సిబ్బందే నిర్వహిస్తారని ఎస్‌సిఆర్ ప్రజా సంబంధాల ముఖ్య అధికారి ఎం ఉమాశంకర్ కుమార్ తెలిపారు. చంద్రగిరి స్టేషన్‌లో నలుగురు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లను, ముగ్గురు పాయింట్స్ మహిళలను నియమిస్తారు. బేగంపేట్‌లో ఎనిమిది మంది మహిళా కమర్షియల్ క్లర్కులు, నలుగురు ఎంక్వైరీ-రిజర్వేషన్ క్లర్కులు, ఆరుగురు కానిస్టేబుళ్లను, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమిస్తారు. ఇక ఫిరంగిపురంలో ముగ్గురు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లను, ఆరుగురు పాయింట్స్ మహిళలను, ఇద్దరు కానిస్టేబుళ్లను నియమిస్తారు.



అగ్ని ప్రమాదానికి గురైన నౌక

సహాయక చర్యలు చేపట్టిన ఇండియన్ కోస్ట్ గార్డ్

ముంబయి : లక్ష ద్వీప్‌కు సమీపంలోని అరేబియా మహా సముద్రంలో 27 మంది సిబ్బందితో కూడిన నౌక గత రాత్రి అగ్ని ప్రమాదానికి గురైందని ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) బుధవారం తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కూడా ఉన్నారు. వారిలో నలుగురు సభ్యులు కనిపించడం లేదని మిగిలిన వారిని రక్షించామని ఐసిజి తెలిపింది. సింగపూర్ నుండి సూయజ్‌కు వెళ్తున్న 330 మీటర్ల పొడవున్న మెర్స్కహోనం నౌకలోని ప్రధాన భాగంలో మంటలు అలుముకొని 25 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడ్డాయి. దీనిపై సమాచారం అందిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్ సహాయక చర్యలు చేపట్టింది. ఎంవి ఎఐఎస్ సిసిరో అనే వాణిజ్య నౌక అక్కడికి చేరుకుని 23 మందిని రక్షించిందని ఐసిజి తెలిపింది. ఈ ఘటన విషయం తెలుసుకున్న ముంబయిలోని మారిటైం రెస్క్యూ కో ఆర్డినేషన్ సెంటర్(ఎంఆర్‌సిసి) వెంటనే అన్ని వాణిజ్య నౌకలకు కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ద ఇంటర్నేషనల్ సెఫ్టీ నెట్(ఐఎస్ఎన్) ద్వారా అప్రమత్తం చేసిందని తెలిపింది.

అవకాశవాద రాజకీయాలు

మమత తృతీయ ఫ్రంట్ ప్రయత్నాలపై సిపిఎం

కోల్‌కతా : తృతీయ ఫ్రంట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇచ్చిన ప్రకటన, ట్వీట్లను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎంపి మహ్మద్ సలీం విమర్శించారు. మొదటనుండి తృతీయ ఫ్రంట్ ఆలోచననే అలక్ష్యం చేస్తూ వచ్చిన మమత అందులో ఎలా భాగస్వామి అవుతారని ఆయన ప్రశ్నించారు. వి.పి.సింగ్, ఐ.కె.గుజ్రాల్, దేవెగౌడ హయాంలో తృతీయ ఫ్రంట్ ఆలోచనలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలంలో మమతా బెనర్జీ వాటిని అపహాస్యం చేయడమో లేదా వ్యతిరేకంగా ప్రచారమో చేసేవారని, బిజెపి, కాంగ్రెస్‌ల్లో ఏదో ఒకటి లేకుండా భారతదేశ రాజకీయాలకు భవిష్యత్ లేదని చెప్పేవారని గుర్తు చేశారు. ఆ సమయాల్లో ఆమె అటు కాంగ్రెస్‌లో వుండడమో లేదా బిజెపి వైపు వుండడమో జరిగిందన్నారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని తెలిసి తృతీయ ఫ్రంట్‌ను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సలీం విమర్శించారు. ఇది పచ్చి అవకాశవాద రాజకీయమని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి 2016లో ఖరగ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు బదిలీ జరగకపోతే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌ఘోష్ గెలిచేవారు కాదని సలీం గుర్తు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, బిజెపి మధ్య ఎప్పుడూ రహస్య అవగాహన వుంటూ వచ్చిందని అన్నారు. లెనిన్ విగ్రహంపై దాడి, ఇతర విగ్రహాలపై దాడులు వంటి చర్యలన్నింటినీ చాలా పకడ్బందీగానే బిజెపి తెరపైకి తెస్తోందని అన్నారు. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీల కుంభకోణాలు ప్రజల మనస్సులోంచి పోవడానికే ఈ విగ్రహ దాడుల వార్తలు వస్తున్నాయని అన్నారు. లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడం ఆ వ్యక్తికి జరిగిన అగౌరవం కాదని, ఆ సిద్ధాంతాలకు సంబంధించిన అంశమని సలీం పేర్కొన్నారు. కార్మిక వర్గం సిద్ధాంతాలను బలవంతంగా పారద్రోలడానికి జరుగుతున్న



ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించాలని ఆయన పిలుపిచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంత మాత్రమూ విశ్వసనీయమైన మిత్రపక్షం కాదని, ఆ పార్టీ సిద్ధాంతాలు కూడా బిజెపి సిద్ధాంతాల వంటివేనని సలీం వ్యాఖ్యానించారు.

అస్పృశ్యత నివేదికకు బయటపెట్టేందుకు అంగీకరించిన గుజరాత్ సర్కార్

గాంధీనగర్: రాష్ట్రంలో అస్పృశ్యత నివారణకు తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ చెప్పారు. ఈ అంశంపై 2013లో సెప్ట్ యూనివర్శిటీ నిర్వహించిన సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టటానికి ఆయన నిరాకరించారు. ఈ నివేదిక ఒక అధికారిక కమిషన్ రూపొందించినది కానందున దీనిని సభలో ప్రవేశపెట్టలేమని ఆయన బుధవారం శాసనసభలో చెప్పారు. సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ ఐదేళ్ల క్రితంనాటి ఈ సర్వే నివేదికలో చేసిన సిఫార్సుల మేరకు తమ ప్రభుత్వం అస్పృశ్యత నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నదని చెప్పారు. అంతకు ముందు సభ ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యుడు ప్రవీణ్ మారు మాట్లాడుతూ అస్పృశ్యతపై సర్వే నిర్వహించిన సెప్ట్ యూనివర్శిటీ నివేదిక ప్రభుత్వానికి అందినదీ లేనిదీ తెలియచేయాలని, నివేదిక అందితే దీనిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో వివరించాలని కోరారు.

పార్లమెంట్‌లో ఏపి ఎంపిల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విభజన హామీల అమలు కోసం పార్లమెంట్‌లో ఏపి ఎంపిల ఆందోళన కొనసాగింది. పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు ఆందోళన చేయగా, గేట్ నెంబర్ 1 వద్ద వైసిపి ఎంపిలు ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. టిడిపి ఎంపిలు మాట్లాడుతూ విభజన హామీలు నెరవేర్చకపోయినా మిత్రపక్షం కాబట్టే ఇన్నాళ్లూ వూరుకున్నామని, ఇక సహించేది లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు సహనం ఎక్కువ కాబట్టే ఇంకా వేచి చూస్తున్నారని, ఆయన కుండ ఎప్పుడు బద్దలు కొడతారా? అని ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకే తమ పోరాటం ఉంటుందని తేల్చిచెప్పారు. మిత్రపక్షంగా ఉండి ఆందోళనలు చేస్తున్నా బిజెపి తమను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం ఇంకా ఏదో చేస్తుందన్న నమ్మకం తమకు లేదని అనంతపురం ఎంపి జెసి దివాకర్‌రెడ్డి అన్నారు. ఎంత పోరాటం చేసినా పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ఏపికి వెంటనే ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటులో వైసిపి ఎంపిలు ఆందోళనలు కొనసాగించారు. మరోవైపు ఏపికి ప్రత్యేక హోదాపై వైసిపి ఎంపి మిథున్ రెడ్డి బుధవారం లోక్‌సభలో వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. సభలో 184 నిబంధన కింద నోటీసు ఇచ్చారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని రాసి ఉన్న ప్లకార్డులతో స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఏపి ఎంపిలు వెల్‌లో ఆందోళన చేపట్టారు.

రైతు వేషంలో పార్లమెంటుకు..

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ చిత్తూరు ఎంపి శివ ప్రసాద్ వినూత్న నిరసన చేపట్టారు. రైతు వేషధారణలో పార్లమెంటుకు వచ్చిన ఆయన్ని ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపిలు పలకరించారు. మోడీ గారు ఎక్కడుంటారండీ.. అంటూ ఆయన పలువురు ఎంపిలను అమాయకంగా అడుగుతూ నిరసన తెలిపారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మట్టి, నీరు ఇచ్చారని..ఇప్పుడవి ఆయనకే తిరిగిచ్చేస్తామని చెప్పారు. శివప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ "నాలుగేళ్ల క్రితం అమరావతి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ప్రధాని మోడీ వేల కోట్ల రూపాయలు ప్రకటిస్తామరేమో అని ఆశపడ్డాం. కానీ ఆయన మట్టి, నీరు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మిత్రపక్షంగా ఉన్నాం కదా ఏమైనా మేలు చేయకపోరా? అని ఎదురు చూశాం. కానీ కేంద్రం మమ్మల్ని పట్టించుకోవడం లేదు. అందుకే ఆయనిచ్చిన మట్టి, నీరు ఆయనకే తిరిగిచ్చేస్తాం. ఒకవేళ ఆయన తీసుకోకపోతే పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద పెట్టేస్తాం" అని తెలిపారు.

హోదా సాధన సమితి నేతలపై టిడిపి ఎంపి మురళీ మోహన్ దురుసు

ప్రత్యేక హోదా సాధన సమితి నేతలపై టిడిపి ఎంపి మురళీ మోహన్ దురుసుగా ప్రవర్తించారని సమితి నేతలు పేర్కొన్నారు. ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలంటూ దేశ రాజధానిలో నేతలు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు టిడిపి ఎంపి మురళీ మోహన్ నివాసానికి వెళ్లారు. తాము చేస్తున్న పోరాటాలకు, ఆందోళనలకు మద్దతు తెలియచేయాలని, ఎంపి పదవికి రాజీనామా చేసి ఆందోళనలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దురుసుగా ప్రవర్తించారని సమితి నేతలు ఆరోపించారు.

మోడీ హయాంలో రూ. 54 వేల కోట్ల బ్యాంకు కుంభకోణాలు

కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి దేశంలో రూ. 54,317 కోట్ల బ్యాంకు కుంభకోణాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై ప్రధాని మోడీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. మోడీ పాలనలో నేరస్తులు 'మోసం చేయడం, పారిపోవడం' అనే కొత్త మంత్రాన్ని నేర్చుకున్నారని వ్యాఖ్యానించింది. బ్యాంకు మోసాలు, బ్యాంకు దోపిడి, సామాన్య ప్రజల్ని దోచుకోవడం వంటి వార్తలు ప్రతి రోజూ వెలుగులోకి వస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జీ రణదీప్ సుర్జేవాలా తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక కేవలం ముంబయిలోనే రూ. 19,317 కోట్ల కుంభకోణాలు జరిగాయని తెలిపారు. 2015లో రూ.5,560.66 కోట్లు, 2016లో రూ. 4,273.87 కోట్లు, 2017లో రూ.9,838.66 కోట్లు కుంభకోణాలు జరిగాయని తెలిపారు. ఈ కుంభకోణాల్లో నిందితులుగా ఉన్న 184 మంది దేశం నుంచి ఇప్పటికే తప్పించుకున్నారని ఆయన విమర్శించారు. మోడీ-ఫడ్నవిస్ ప్రభు త్వాలు వారికి సహకరించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

కేరళ అసెంబ్లీలోకి గ్రెనేడ్ షెల్‌తో కాంగ్రెస్ ఎమ్మెల్యే

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యే గ్రెనేడ్ షెల్‌తో ప్రవేశించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రాష్ట్ర మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే తిరువంచూర్ రాధాకృష్ణన్.. గతవారం జరిగిన ఓ ఆందోళనలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టేందుకు పోలీసుల ప్రయోగించిన గ్రెనేడ్ షెల్‌తో అసెంబ్లీలోకి వచ్చారు. హోంశాఖ పై రాష్ట్ర అసెంబ్లీలో చర్చ జరుగుతున్న సమయంలో ఆయన దానిని ప్రవేశపెట్టారు. కాలం చెల్లిన ఇలాంటి గ్రెనేడ్‌లను పోలీసులు ఉపయోగించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ ఘటనతో రాష్ట్ర అసెంబ్లీలో తీవ్ర దుమారం చెలరేగింది. ఆయుధాలతో అసెంబ్లీలోకి ప్రవేశించడం సమర్థనీయం కాదని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రెనేడ్ నిజమైనదైతే భద్రతకు ముప్పు వాటిల్లేదని సీఎం పినరయి విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గ్రెనేడ్‌ను సమర్పించారని అధికారులు తెలిపారు. అసెంబ్లీ ప్రవర్తనా నియమావళిని ఎమ్మెల్యే ఉల్లంఘించాడన్న అంశాన్ని పరిశీలిస్తానని స్పీకర్ పి. శ్రీరామకృష్ణన్ ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

11 నెలల్లో 70 రైలు ప్రమాదాలు

న్యూఢిల్లీ : గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి మధ్యకాలంలో దేశం మొత్తంమీద 70 రైలు ప్రమాదాలు జరిగినట్లు బుధవారం పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంలో రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహైన్ ఈ విషయాన్ని తెలిపారు. భద్రతకు రైల్వే శాఖ అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గత కొన్నేళ్లుగా రైల్వే ప్రమాదాలు తగ్గాయని ఆయన చెప్పారు.

2014 ఏప్రిల్-2015 మార్చి మధ్యకాలంలో 135 రైలు ప్రమాదాలు జరగ్గా, 2015-16లో 107, 2016-17లో 104 ప్రమాదాలు జరిగాయన్నారు. 2017 ఏప్రిల్ నుంచి 2018 ఫిబ్రవరి వరకూ 70 ప్రమాదాలు జరిగాయని అన్నారు.

కతువా అత్యాచార కేసులో ఆధారాలు నాశనం చేయడానికి పోలీసుల యత్నం

శ్రీనగర్ : కతువాలో 8 ఏళ్ల బాలిక అత్యాచారం, హత్య కేసులో ఆధారాలను నాశనం చేయడానికి స్థానిక పోలీసులు ప్రయత్నం చేశారని జమ్మూ కాశ్మీర్ క్రైమ్ బ్రాంచ్ వెల్లడించింది.

ఈ కేసు విచారణను క్రైం బ్రాంచ్ స్వీకరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర డిజిపి ఎస్‌పి వైద్‌కు రాసిన లేఖలో 'ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపే ముందు మృతురాలి దుస్తులపై ఉన్న రక్తం, బురద మరకలను కథువా పోలీసులు శుభ్రం చేశారని' తెలిపారు. ఈ ఏడాది జనవరి 10న 8 ఏళ్ల బాలికను కిడ్నాప్‌ను చేసి హత్యాచారం చేసిన విషయం తెలిసిందే.మృతురాలి కుటుంబం నుంచి ఫిర్యాదు వచ్చిన తరువాత కూడా గ్రామంలో పోలీసులు ఎలాంటి విచారణ చేయలేదని క్రైం బ్రాంచ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ తెలిపారు.

ఫోర్బ్స్ జాబితాలో ఎనిమిది మంది భారత మహిళలు

న్యూఢిల్లీ : ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ అత్యంత ధనిక మహిళల జాబితా 2018లో ఎనిమిది మంది భారత స్త్రీలకు స్థానం లభించింది. మొత్తం 256 మంది బిలియనీర్లతో ఫోర్బ్స్ ఈ జాబితా తయారు చేసింది. భారత మహిళాల్లో సావిత్రి జిందాల్ తొలిస్థానంలో నిలిచింది. ఆమె ఆస్తులను 8.8 బిలియన్ల డాలర్లుగా ఫోర్బ్స్ అంచనా వేసింది. ప్రపంచ జాబితాలో ఆమె స్థానం 176. సావిత్రి జిందాల్ తరువాత స్థానంలో కిరణ్ మజుందార్ (3.6 బిలియన్ డాలర్లు), స్మితా క్రిష్ణ (2.9 బిలియన్ డాలర్లు), లీనా తివారీ (2.4 బిలియన్ డాలర్లు), వినోద్-అనిల్ రాయ్ గుప్తా (2.2 బిలియన్ డాలర్లు), అను అగా (1.4 బిలియన్ డాలర్లు), షీలా గౌతమ్ (1.1 బిలియన్ డాలర్లు), మధు కౌర్ (1.1 బిలియన్ డాలర్లు) ఉన్నారు.కాగా, ఈ ప్రపంచ జాబితాలో అలిస్ వాల్టన్ (వాల్‌మార్ట్ వ్యవస్థాపకుడు స్యామ్ వాల్టన్ కుమార్తె) అగ్రస్థానంలో నిలిచారు. ఆమె ఆస్తులను 46 బిలియన్ డాలర్లుగా ఫోర్బ్స్ అంచనా వేసింది.

కొనసాగుతున్న విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

తెలియని వ్యక్తులు కూల్చివేయటంపై ఆప్రాంతంలో నివశిస్తున్న దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక రహదారిపై రాసారోకో నిర్వహించారు. కాగా కూల్చివేసిన విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇవ్వటంతో వారు తమ ఆందోళనను విరమించుకున్నారు.

దృష్టి మళ్లించేందుకే..: కమలహాసన్

మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో వెల్లూరులోని తిరుపత్తూర్ కార్పొరేషన్ కార్యాలయంలో వున్న పెరియార్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. అక్కడ వున్న సిసి కెమెరా చిత్రాల ఆధారంగా స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పెరియార్ విగ్రహ విధ్వంసంపై సినీ నటుడు, మక్కళ్ నీదిమెయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ తీవ్రంగా స్పందించారు. తమిళనాడులో పెరియార్ విగ్రహం విధ్వంసం వెనుక కావేరీ వివాదం నుండి ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడ వున్నట్లు కన్పిస్తోందన్నారు. కావేరీ వాటర్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్నది వాస్తవమని, దాని నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఎత్తుగడలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ ఉచ్చులో చిక్కుకోవద్దని ఆయన ప్రజలను, మీడియాను కోరారు. విగ్రహాల కూల్చివేత ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంటే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తమిళనాడులోని వెల్లూరులో పెరియార్ విగ్రహం కూల్చివేతకు ప్రయత్నించిన ఆరోపణలపై అరెస్టయిన బిజెపి కార్యకర్త ఆర్ ముత్తు రామన్‌ను పార్టీ రాష్ట్ర కమిటీ బహిష్కరించింది. త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేత తరువాత వంతు పెరియార్‌దేనంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేసిన బిజెపి నేత హెచ్ రాజాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం కార్యకర్తలు ఆందోళన చేశారు.

బిజెపి నేతపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఎంకె నేత కనిమోళి డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా పెరియార్‌పై బిజెపి నేత రాజా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఉదయం 7గంటల సమయంలో మైలాపూర్‌లోని నల్లతంబి రోడ్డులో కొందరు యువకులు ఆ దారిన వెళ్తున్న వారిపై దాడి చేసి వారి శరీరాలపై వున్న జంధ్యాలను తెంచి పారేశారు. వీరంతా పెరియార్ అనుకూల నినాదాలు చేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అయితే ఈ ఘటనపై తమకెవరూ ఫిర్యాదు చేయలేదని, సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలికి వెళ్లామని పోలీసులు చెబుతున్నారు. కాగా కొల్‌కత్తాలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు కొందరు విద్యార్థులు ప్రయత్నించారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

విగ్రహాల ధ్వంసంపై ప్రధాని ఆగ్రహం



న్యూఢిల్లీ : త్రిపురలో లెనిన్ విగ్రహం, తమిళనాడులో పెరియార్, విగ్రహాల ధ్వంసంపై ప్రధాని నరేంద్రమోడీ బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సంఘటనలపై విచారణ జరపాలని హోం శాఖను ఆదేశించారు. విగ్రహాల ధ్వంసం జరిగిన రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఈ ఘటనల పట్ల బాధ్యత వహించాలని హెచ్చరించారు. త్రిపురలో బిజెపి గెలిచిన అనంతరం రెండు లెనిన్ విగ్రహాలను ధ్వంసం చేయగా, తమిళనాడులో పెరియర్ రామస్వామి, బుధవారం పశ్చిమబెంగాల్‌లోని బిజెపి నేత శ్యాం ప్రసాద్ ముఖర్జీతో పాటు గతంలో ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చి వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ, ముంబయిల్లో విగ్రహాల చుట్టూ భద్రతను ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

కర్నాటక లోకాయుక్తకు కత్తిపోట్లు, సాయుధుడి అరెస్ట్

బెంగళూరు: కర్నాటక లోకాయుక్త జస్టిస్ పి విశ్వనాథ శెట్టిపై ఒక వ్యక్తి దాడి చేసిన ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం ఆయన కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఈ సాయుధుడు లోకాయుక్తపై కత్తితో దాడి చేసి గాయపర్చారని, అతడిని పోలీసులు అరెస్ట్ చేశారని హోం మంత్రి రామలింగారెడ్డి వివరించారు. గాయపడిన న్యాయమూర్తికి వైద్య చికిత్స అందించామని, ఆయన ప్రమాదం నుండి బయటపడ్డారని చెప్పారు.

నాగాలాండ్‌లో బిజెపి-ఎన్‌డిపిపి కూటమికి "షాక్' మద్దతు ఉపసంహరించుకొన్న ఎన్‌పిపి

కోహిమా : నాగాలాండ్ రాజకీయంలో మరొక నాటకీయ పరిణామం చోటు చేసుకుంది. బిజెపి-ఎన్‌డిపిపి కూటమికి నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి) మద్దతును ఉపసంహరించుకొంది. ఎన్‌పిపి రాష్ట్ర అధ్యక్షుడు అటో ఎఫ్తోమి సంతకంతో గవర్నర్‌కు లేఖ అందింది. గవర్నరుకు ఇచ్చిన లేఖలో ఇంతకు ముందు మద్దతిస్తున్నట్లు ఇచ్చిన లేఖను పట్టించుకోవద్దని కోరారు.

అటెండెన్స్‌పై జెఎన్‌యులో రెఫరెండం

న్యూఢిల్లీ : అటెండెన్స్ విషయమై జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) విద్యార్థి సంఘం బుధవారం రిఫరెండం నిర్వహించింది. జనవరి నుండి జెఎన్‌యులో విద్యార్థి సంఘాలు, రాజకీయ వర్గాలు పలు నిరసనలు, ఆందోళనలు నిర్వహించాయి. విద్యార్థులందరికీ కనీసం 75శాతం అటెండెన్స్ తప్పనిసరి చేస్తూ జెఎన్‌యు పాలనాయంత్రాంగం నిబంధనలు రూపొందించింది. ఉదయం 9గంటల నుండి రాత్రి 8గంటల వరకు రిఫరెండాన్ని రెండు దశల్లో నిర్వహించారు. గతంలో నిర్వహించిన ఆందోళనలు కేవలం కొద్దిమంది విద్యార్థులు చేసినవే తప్ప మెజారిటీ విద్యార్థుల మద్దతు వారికి లేదని పాలనా యంత్రాంగం పేర్కొనడంతో విద్యార్థి సంఘం ఈ రిఫరెండం నిర్వహించే బాధ్యతను తీసుకుంది.

పపువా న్యూగినియాలో భూకంపం

18 మంది మృతి

సిడ్నీ : పపువా న్యూ గినియాలోని పర్వత ప్రాంతమైన సదరన్ హైలాండ్స్‌లో బుధవారం తెల్లవారు జామున భూకంపం సంభవించి 18మంది మరణించారు. రిచ్‌టర్ స్కేలుపై దీని తీవ్రత 6.7గా నమోదైంది. తొమ్మిది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో శక్తివంతమైన భూకంపం సంభవించి 55మంది మరణించారు. ఆ తర్వాత వచ్చిన ప్రకంపనల్లో తాజాగా సంభవించింది అత్యంత తీవ్రమైన ప్రకంపనగా భావిస్తున్నారు. ఇప్పటివరకు 18మంది మరణించారని వార్తలందాయని, ఇతరత్రా నష్టాల వివరాలు ఇంకా తెలియాల్సి వుందని హెలా ప్రావిన్స్ అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. అదంతా పర్వత ప్రాంతం కావడంతో సహాయక సిబ్బందికి అక్కడకు వెళ్ళడానికి చాలా ఇబ్బందిగా వుందని, దాదాపు లక్షా 50వేల మందికి పైగా ప్రజలకు సాయం అందించాల్సి వుందని చెప్పారు.



పర్యవేక్షణ
శ్రీలంకలో జరుగుతున్న మతఘర్షణలను నివారించటం కోసం ప్రభుత్వం ఎమర్జెన్సీని విధించగా శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

ఇటలీలో రాజకీయ అనిశ్చితి

రోమ్: ఇటలీ పార్లమెంట్ ఎన్నికల్లో హంగ్ పార్లమెంట్ ఏర్పడటంతో ఇప్పటికే అక్కడ కొనసాగుతున్న రాజకీయ అస్థిరత మరింత పెరిగే ప్రమాదం వుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఫైవ్‌స్టార్ మూవ్‌మెంట్ పార్టీ (ఎం5ఎస్) 32 శాతం ఓట్లతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. అయితే మూడు మితవాద పార్టీలతో ఏర్పడిన కూటమి మొత్తం 37 శాతం మేర ఓట్లు సాధించి ఎక్కువ స్థానాలు గెల్చుకుంది. ఈ కూటమిలో భాగస్వామిగా వున్న యాంటీ ఇమిగ్రెంట్ లీగ్ పార్టీ బలీయమైన శక్తిగా ఎదిగింది. (గతంలో 2013 ఎన్నికల్లో 4 శాతం ఓట్లు సాధించిన ఈ పార్టీ ఇప్పుడు 17 శాతం మేర తమ ఓటు బ్యాంకును పెంచుకుంది). ఈ ఎన్నికల్లో పోటీ పడిన మూడో ప్రధాన కూటమి సెంటర్ లెఫ్ట్ కోయలిషన్ 22 శాతం ఓట్ల వద్దే నిలిచిపోయింది. దీనితో ఈ కూటమి ప్రధాన ప్రతిపక్షంగా ఏర్పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇటు ఎం5ఎస్‌కు కానీ, అటు మిత వాద కూటమికి కానీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ లభించకపోవటంతో, అవసరమైన మెజార్టీకోసం ఇతర రాజకీయ పక్షాలతో చర్చలు ప్రారంభమయ్యాయి. ఇటలీలో ప్రజాదరణ కలిగిన రెండు ప్రధాన శక్తులూ ఎన్నికల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించటంతో ప్రభుత్వ ఏర్పాటులో ఈ రెండు కూటములూ కీలక పాత్ర పోషించాల్సి వుంటుంది. అయితే ఇందుకు వీటి మధ్య చర్చలు జరగాలి. ఇందుకు మరికొన్ని వారాలు పట్టే అవకాశం వుంది. అయితే ఎవరికీ మెజార్టీ లభించక హంగ్ పార్లమెంట్ ఏర్పడినప్పటికీ, ప్రధాన కూటముల మధ్య ప్రారంభమైన చర్చలు ఒక కొలిక్కి వచ్చే వరకూ దేశంలో రాజకీయ అస్థిరత కొనసాగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఏర్పాటు విషయంలో అధ్యక్షుడు సెర్జియో మాటరెల్లా ఇప్పట్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం లేదని వారు చెబుతున్నారు.

త్వరలో ట్రంప్ ఆర్థిక సలహాదారు రాజీనామా

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆర్థిక సంబంధాల సలహాదారు, వైట్‌హౌస్‌లో వాల్‌స్ట్రీట్ తరపున వాణి వినిపించే గేరీ కోన్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిం చారు. ఉక్కు, అల్యూమినియంపై భారీగా దిగుమతి సుంకాలు విధించాలన్న ట్రంప్ ఆలోచనలపై పోరాడి ఓడిపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్ అయిన కోన్ ఎప్పుడు వైదొల గేది మరికొద్ది వారాల్లో ఖరారు కానుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న తరుణంలో, స్టాక్ మార్కెట్లు తీవ్రంగా ఒడిదు డుకులు ఎదుర్కొం టున్న సమయంలో గేరీ కోన్ రాజీనామా చేయడం అధ్యక్షుని సలహా బృం దానికి పెద్ద ఎదురు దెబ్బ కాగలదు. కోన్‌ను మార్చడంపై త్వరలో ఒక నిర్ణయాన్ని తీసుకుం టానని ట్రంప్ మంగళవారం పొద్దుపోయిన తర్వాత ట్వీట్ చేశారు. వైట్‌హౌస్ జాతీయ వాణిజ్య మండలి డైరెక్టర్ అయిన పీటర్ నెవరో, కన్జర్వేటివ్ వ్యాఖ్యా త లేరీ కుడ్లోలు ఈ పదవికి బరిలో వున్నారని పాలనాయంత్రాంగ అధికారులు తెలిపారు.

13నగరాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు

ఎడ్మాంటన్, కెనడా : ప్రపంచవ్యాప్తంగా 13 నగరాల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వచ్చే దశాబ్ద కాలంలో ఈ నగరాల్లో రెండు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుతుందని వారు చెబుతున్నారు. కొలంబియా యూనివర్శిటీలోని అర్బన్ క్లైమేట్ ఛేంజ్ రీసెర్చ్ నెట్‌వర్క్ ఈ మేరకు ఒక నివేదిక రూపొందించింది. ఆ నివేదిక ప్రకారం బెల్జియం నగరమైన లెవెన్‌లో అన్నింటికన్నా ఎక్కువగా ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలు వున్నాయి. ఇది ఆందోళన కలిగించే పరిణామమని అధ్యయన నిర్వాహకుల్లో ఒకరైన విలియం సోలెస్కీ వ్యాఖ్యానించారు.

వ్యవస్థీకృత ముప్పులను ఎదుర్కొనే సత్తా మాకుంది!

చైనా ఆర్థిక మంత్రి జియావ్‌జీ



బీజింగ్: వ్యవస్థాపరమైన ముప్పులను ముందుగా అంచనా వేసి వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనే సత్తా చైనాకు వుందని ఆ దేశ ఆర్థిక మంత్రి జియావ్ జీ స్పష్టం చేశారు. చైనా పార్లమెంట్ వార్షిక సమావేశాల నేపథ్యంలో బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చైనా రుణభారం పూర్తిగా అదుపులోనే వుందని, ఇదే పరిస్థితి ఇకపై కూడా కొనసాగుతుందని వివరించారు. తమ దేశ రుణాలు–జిడిపి నిష్పత్తి గత ఏడాది చివరి నాటికి 36.2 శాతానికి తగ్గిందని, అంతకు ముందు ఏడాదిలో ఇది 36.7 శాతం మేర వుండేదని వివరించారు. ఇది ప్రపంచ స్థాయి పరిమితి కన్నా 60 శాతం తక్కువగానే వుందని ఆయన గుర్తు చేశారు. అంతేకాక ప్రపంచంలోని ప్రధాన, వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోల్చినప్పటికీ ఇది తక్కువగానే వుందన్నారు. రానున్న కాలంలో 'ఈ పరిస్థితిలో ఎటువంటి గణనీయమైన మార్పు వుంటుంద'ని తాను భావించటం లేదన్నారు. గత ఏడాది చివరి నాటికి చైనా కేంద్ర, స్థానిక ప్రభుత్వాల రుణభారం మొత్తం 29.95 లక్షల కోట్ల యువాన్లు (4.75 లక్షల కోట్ల డాలర్లు) వుందని, ఇందులో స్థానిక ప్రభుత్వాల వాటా 16.47 లక్షల కోట్ల యువాన్ల మేర వుందని ఆయన వివరించారు. రుణ నియంత్రణపై చైనా అత్యధిక శ్రద్ధ చూపుతోందని, ఆర్థిక కార్యకలాపాలలో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఆయన చెప్పారు. చైనా పార్లమెంట్ కొత్త బడ్జెట్‌ను ఆమోదించటంతో పాటు అనేక అనుబంధ చర్యలను కూడా అమలులోకి తెచ్చారు. కోటా మేనేజ్‌మెంట్, బడ్జెట్ మేనేజ్‌మెంట్, ముప్పు పరిస్థితులపై ముందస్తు హెచ్చరిక, అత్యవసర స్పందన, అనుదిన నిర్వహణ వంటి వాటి కోసం ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. స్థానిక ప్రభుత్వాల ఆర్థిక అవకతవకలకుసంబంధించి గత ఏడాది దాదాపు 100 మందిని బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకున్నామని, ఆర్థిక ముప్పును సమర్ధవంతంగా ఎదుర్కొనే ప్రయత్నాలను మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన వివరించారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం చైనా పార్టీ వ్యవస్థ

రాజకీయాల్లో వినూత్న పోటీ వ్యవస్థల్లోని లొసుగులను సవరిస్తుందని ఇక్కడ భేటీ అయిన కమ్యూనిస్టేతర పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. చైనాలో కొనసాగుతున్న బహుళ పార్టీ వ్యవస్థ, వాటి మధ్య కొనసాగుతున్న రాజకీయ సంప్రదింపుల పర్వం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. చైనాలో కొనసాగుతున్న పార్టీ వ్యవస్థ ప్రపంచ దేశాల్లో పార్టీ రాజకీయాలకు చైనా తరహా పరిష్కారాన్ని చూపుతున్నదని చైనా డెమొక్రాటిక్ లీగ్ సెంట్రల్ కమిటీ ఛైర్మన్ డింగ్ జోంగ్లి చెప్పారు. ఇక్కడ జరుగుతున్న కమ్యూనిస్టేతర పార్టీ నేతల బేటీ నేపథ్యంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయ పార్టీ వ్యవస్థల్లో ఇది వినూత్నమైనదని, ఏకపార్టీ పాలనకు లేదా పశ్చిమ దేశాలలో వున్న బహుళ పార్టీ వ్యవస్థలకు భిన్నమైనదని అన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఇక్కడ కొనసాగుతున్న రాజకీయ పార్టీల వ్యవస్థలో వివిధ పార్టీల మధ్య సహకారం, సంప్రదింపులకు ప్రాధాన్యత వుంటుందన్నారు. చైనా చరిత్రకు, సంప్రదాయానికి, వాస్తవ పరిస్థితులకు ఈ వ్యవస్థ చక్కగా సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

'అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి'

ఉభయ కొరియాలకు చైనా విజ్ఞప్తి

చారిత్రాత్మకమైన శిఖరాగ్ర సదస్సును నిర్వహించేందుకు ఉత్తర, దక్షిణ కొరియాలు అంగీకరించటాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చైనా ప్రకటించింది. కొరియా ద్వీపకల్పాన్ని అణు నిరాయుధీకరణచేసే విషయంలో ఇప్పుడు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైనా ఉభయ కొరియాలకు విజ్ఞప్తి చేసింది. ఉ.కొరియా రాజధాని పాంగ్యాంగ్‌లో ఆ దేశాధినేత కిమ్‌జోంగ్ ఉన్‌తో ద.కొరియా ప్రతినిధి వర్గం భేటీ కావటం సానుకూల పరిణామమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో ప్రశంసించింది. ఏప్రిల్ ద్వితీయార్థంలో ఉభయ కొరియాల అధ్యక్షుల మధ్య శిఖరాగ్ర సదస్సు నిర్వహించాలని ఈ భేటీలో అవగాహన కుదిరినట్లు ద.కొరియా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

యాంత్రీకరణపై కార్మికుల ఆగ్రహం

డ్రైవర్ లేని కార్లపై కాలిఫోర్నియాలో దాడులు

కాలిఫోర్నియా : పని ప్రదేశాల్లో యాంత్రీకరణ పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు ఆ యంత్రాలను, యాంత్రీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రోబో కార్లపై కార్మికులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ వాటి విధ్వంసానికి కూడా దిగుతున్నారని కాలిఫోర్నియాలో ఈ ఏడాది దాఖలైన క్రాష్ నివేదికలు పేర్కొంటున్నాయి. డ్రైవర్ లేకుండా నడిచే కార్లపై దాడి జరిగిన సంఘటనలు ఈ ఏడాదిలో ఇప్పటికి ఆరు చోటు చేసుకున్నాయి. జనవరిలో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక దాడి సంఘటన జరిగింది. జనరల్ మోటార్స్ క్రూయిజ్ డ్రైవర్‌లెస్ కారు విభాగం నిర్వహిస్తున్న ఒక వాహనం గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తోంది. 'నడవరాదు' అనే సంకేతం కనిపిస్తున్నా దాన్ని ఉల్లంఘించి వచ్చిన ఒక వ్యక్తి కోపంగా అరుస్తూ వచ్చి ఆ వాహనంపై దాడి చేశాడని నివేదిక పేర్కొంది. కాలిఫోర్నియా మోటారు వాహనాల విభాగం ఈ నివేదికను రూపొందించింది. అదే నెల్లో జరిగిన మరో సంఘటనలో టాక్సీ డ్రైవర్ తన వాహనంతో వేగంగా వచ్చి క్రూయిజ్ ఎవిని ఢీ కొన్నాడని, ముందు కిటికీని కూడా బద్దలు కొట్టాడని ఆ నివేదిక పేర్కొంది. ఇటు వంటి ఆరు సంఘటనలు జరగాయని, వాటిలో మూడు ఆటోమేటిక్‌గా నడిచే వాహనాలని తెలిపింది. భద్రంగా వాహనాన్ని నడిపే సుశిక్షితుడైన డ్రైవర్ వుంటేనే ఆటోమేటిక్ వాహనాలను వారికి అప్పగిస్తామనే నిబంధనలు ఇప్పటివరకు వున్నాయి. ఏప్రిల్2 నుండి పరిస్థితి మారనుంది. కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. భద్రత నిమిత్తం కారులో వ్యక్తి లేకపోయినా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు రోడ్లపైకి రావడానికి అనుమతిస్తారు.

దక్షిణ జపాన్‌లో బద్దలైన అగ్నిపర్వతం

వెదజల్లుతున్న లావా, బూడిద

వాషింగ్టన్ : దక్షిణ జపాన్‌లో అగ్నిపర్వతం పొగలు కక్కుతోంది. పెద్ద మొత్తంలో బూడిద వెదజల్లుతుండడంతో ఆ ప్రాంతానికి 20మైళ్ళ దూరంలో గల విమానాశ్రయంలో విమానాల రాకపోకలు నిలిపివేశారు. రోజుకు 80 విమానాలు రద్దయ్యాయి. బూడిద 7,500 అడుగుల ఎత్తు ఎగిసిపడుతోంది. 2011 తర్వాత షిన్మొడెకె అగ్నిపర్వతం ఇంతలా క్రియాశీలంగా మారడం ఇప్పుడేనని భావిస్తున్నారు. గత వారం నుండి కొద్ది కొద్దిగా రగులుతున్న అగ్నిపర్వతం నుండి పొగ, బూడిదలు వెలువడుతునే వున్నాయని, పగుళ్ళ నుండి లావా ప్రవహిస్తోందని స్థానిక మీడియా తెలిపింది. జపాన్‌లోని దక్షిణ ప్రాంత దీవి అయిన క్యుషులో తాజాగా అగ్నిపర్వతం నుండి వెలువడుతున్న బూడిద ప్రమాదకర స్థాయిలో వుందని మీడియా పేర్కొంది. 4660 అడుగుల ఎత్తు వున్న అగ్నిపర్వతం నుండి దట్టంగా వెలువడుతున్న బూడిదతో పర్వత సానువుల్లో గల నగరంలోని కార్లన్నీ బూడిదతో కప్పబడిపోయాయని అధికారులు తెలిపారు. ముఖానికి ముసుగులతో, గొడుగులతో ప్రజలు బయట తిరగాల్సి వస్తోంది. పర్వతానికి సమీప ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

మొదటి పేజీ తరువాయి

1.91 లక్షల కోట్లు ?

రుణాలను రెట్టింపు పెంచాలని, కాపుల సంక్షేమానికి గత ఏడాది ఇచ్చినట్లుగానే ఇసారి కూడా నిధులు కేటాయించాలని నిర్ణయించారు. వ్యవసాయ రంగంలో రుణ మాఫీకి గత ఏడాది బడ్జెట్‌లో రూ. 3600 కోట్లు కేటాయించగా, ఈసారి నాలుగైదు వందల కోట్లు పెంచాలని యోచిస్తున్నారు. మహిళల కోసం కూడా భారీగా నిధులు కేటాయించాలని నిర్ణయించారు. ప్రధానంగా డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలను మరింత ఎక్కువగా ఇవ్వనున్నారు. దీని కోసం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, గ్రామాల్లో మహిళల కోసం రూ.1500 కోట్ల వరకు కేటాయించనున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటా అన్న క్యాంటీన్ల గురించి చెబుతున్నా, ఇప్పటివరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఈసారి బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. స్మార్ట్ సిటీలకు రాష్ట్ర వాటాగా భరించాల్సిన మొత్తాన్ని కూడా దాదాపు రెట్టింపు చేయాలని యోచిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి మాత్రం నిధులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గత బడ్జెట్‌లో ఇందుకు రూ. 575 కోట్లు కేటాయించగా, ఈసారి కొంత తగ్గించనున్నట్లు కనిపిస్తోంది. రాజధానిలో భూ సమీకరణ కోసం గతంలో కేటాయించిన నిధులను కూడా కొంతవరకు తగ్గించనున్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ఉపాధ్యాయులకు శిక్షణ వంటి కార్యక్రమాలు అమలుచేసే రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ పథకం కోసం భారీగా నిధులు పెంచాలని నిర్ణయించారు. కొత్తగా మోడల్ స్కూళ్ల ఏర్పాటు, పదో తరగతి వరకు విద్యార్థులకు ఆహారంలో కోడి గుడ్ల సరఫరా, విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ, అన్ని ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు సహా, ఇకపై ఇంటర్మీడియేట్ విద్యార్థుల వరకు మధ్యాహ్న పౌష్టికాహారం సరఫరా, పాలిటెక్నిక్‌లలో సౌకర్యాల పెంపు వంటి చర్యలకు నిధులను కొత్తగా కేటాయించనున్నారు. పోలవరం ప్రాజెక్టును ఎలాగైనా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని భావిస్తున్నప్పటికీ కేంద్రం అవసరమైన నిధులను కేటాయించకపోవడంతో నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే భారీగా నిధులు కేటాయించాలని యోచిస్తోంది. గత ఏడాది రూ. 7084 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది రూ. 10వేల కోట్ల వరకు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇతర శాఖల్లో కూడా భారీగానే నిధులు పెంచాలని యోచిస్తున్నారు.

అతిసారకు మరో ఆరుగురు బలి

సరఫరా నిలిపివేసి వారు ఇప్పటికే నిల్వ చేసుకున్న నీటిని పారబోసి కొత్తగా ట్యాంకర్ల ద్వారా క్లోరినేషన్‌తో కూడిన నీరు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ అధికారులను ఆదేశించారు. వాంతులు విరోచనాలతో బాధపడే వారి సంఖ్య నగరంలో వేల సంఖ్యలో నమోదవుతుండటంతో అధికారుల్లో కలకలం బయలుదేరింది. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులలో ఈ తరహా కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. మొదట్లో ఈ అంశాన్ని చాలా తేలిగ్గా తీసుకున్న అధికారులు రోజురోజుకూ మృతులు పెరుగుతుండటంతో అప్రమత్తమయ్యారు.

మంత్రుల పరామర్శ

గుంటూరులో తాగునీటి కలుషితంతో అతిసార బారిన పడిన వారిని గుంటూరు సమగ్ర ఆస్పత్రి (జిజిహెచ్)లో రాష్ట్ర మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజునాయుడుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. అతిసారతో ఇప్పటి వరకు అయిదుగురు మరణించారని, పదేళ్ల దాటిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, ఆలోపైతే రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించారు.

పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తోందన్నారు. చికిత్స పొందుతున్న 98 మందిలో పది మంది పరిస్థితి విషమంగా ఉన్న దృష్ట్యా సౌకర్యాలన్నీ ఉన్న ప్రయివేటు ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఘటనపై ఓ కమిటీ వేస్తున్నామని, అధికారుల నిర్లక్ష్యం వెల్లడైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా బాధితులను సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, టి.కృష్ణమోహన్ పరామర్శించారు. వారికి నాణ్యమైన వైద్యం అందించాలని జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను కోరారు. మీడియాతో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'జలసిరి'పై రైతుల అనాసక్తి

- 2500 పంపు సెట్ల ప్రభుత్వ లక్ష్యం
- వేసింది 254 పంపు సెట్లు
- అన్నదాతల్లో అవగాహన లోపం



ప్రజాశక్తి–కర్నూలు ప్రతినిధి

ఎన్‌టిఆర్ జలసిరి అమలుపై రైతుల్లో అవగాహన లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసీ తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో రైతులు ఈ పథకంపై అనాసక్తి చూపుతున్నారు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో 2500 బోర్లు వేయించి, వాటికి సౌర విద్యుత్ పంపు సెట్లు బిగించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే పథకం అమలుపై సరైన అవగాహన లేక రైతులు ముందుకు రావడం లేదు. దీంతో ఇప్పటి వరకూ కేవలం 254 పంపు సెట్లు మాత్రమే వేయించడం గమనార్హం. కర్నూలు జిల్లాలో ఈ పథకం కింద అర్హుల ఎంపిక నుంచి మోటార్ల అమరిక వరకూ ప్రతి దశలోనూ జాప్యం జరుగుతోంది.

ఇప్పటి వరకూ 1000 కంటే తక్కు వగా దరఖాస్తులు రాగా వీటిలో అర్హులుగా గుర్తించినవి 500 కంటే ఎక్కువ లేవు. నీటి లభ్యత ఉన్నట్లు గుర్తించినవి కేవలం 432 పంపు సెట్లు మాత్రమే. లబ్దిదారుల ఎంపికకు పలుమార్లు మార్గదర్శకాలు మార్చడం, జియాలజిస్టుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. అర్హుల ఎంపికలో నాయకుల జోక్యం, అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. చాలా గ్రామాల్లో నీరు సమృద్ధిగా ఉన్నా బోర్లు వేసి, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేయడం లేదు. డ్వామా, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఎపిఎంఐపి) శాఖల మధ్య సమన్వయ లోపంతో పథకం జిల్లాలో ముందుకు సాగడం లేదు.

ఉపయోగాలు ఉన్నా...

కర్నూలు జిల్లా తూర్పు ప్రాంతాలైన నంద్యాల, ఆత్మకూరు,ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరులో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. అయితే 200 అడుగుల లోతు మాత్రమే బోరు వేయాలనే నిబంధన ఉంది. వేసవిలో నీరు అందక రైతులు సందేహిస్తున్నారు. బోరు బావితోపాటు 5 హార్స్ పవర్ హెచ్‌పి సౌర విద్యుత్, పంపు సెట్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.6 వేలు, ఇతరులు రూ.25 వేలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే సమకూర్చుతాయి. వర్షాలు కురిసే సమయంలో, చలికాలంలో పగటి ఉష్ణోగ్రతలు తగ్గితే సౌర విద్యుత్ మోటార్లు పని చేయవన్న సందేహం రైతుల్లో ఉంది. దీనికి తోడు బోర్లు తవ్వడం, సౌర విద్యుత్ మోటార్లు సమకూర్చడంలో అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇటు వ్యవసాయం చూసుకోవడం తలకు మించిన భారంగా ఉంది. అందుకే రైతులు ఈ పథకంపై ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి. ఈ పథకం అమలులో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కర్నూలు పదో స్థానంలో ఉంది.

పథకంపై అవగాహన కల్పిస్తాం

ఈ పథకం జిల్లాలో చాలా ఆలస్యంగా సాగుతోంది. నేను ఇటీవలే కర్నూలుకు బదిలీపై వచ్చాను. పథకంలో అనేక నిబంధనలు ఉండడం వల్ల రైతులు ముందుకు రావడం లేదు. దీనిపై రైతుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకు ంటున్నాం. నెడ్‌క్యాప్ సిఇఒతో కలిసి ఎక్కువ మంది లబ్ధిదారులు ఈ పథకాన్ని పొందేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకట సుబ్బయ్య, డ్వామా పీడీ

జైట్లీ ఏమన్నారు..?

మొదటి పేజీ తరువాయి

హోదా ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతానికి ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రస్తుతం 90:10 శాతం చొప్పున నిధుల పంపిణీ జరుగుతోందన్నారు. ఏపి ప్రజలకు ఇష్టం లేకుండానే విభజన జరిగిందని, దాంతో వనరుల లేమితో రాష్ట్రం బాధపడుతోందన్న ఆయన, కేంద్రం వద్ద నిధులు లేవని చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని తేల్చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం తేల్చి చెప్పిందని సాకుగా చూపుతూ, ఈశాన్య రాష్ట్రాల్లో ప్రత్యేక హోదా ఇవ్వడం అనేది ఆనవాయితీగా వస్తోందని, పూర్తి స్థాయిలో వెనుకబడిన రాష్ట్రాలు అయినందునే వాటికి ప్రత్యేక హోదా ఇస్తున్నామని, 14వ ఆర్థిక సంఘం ప్రకటన చేసే నాటికే వాటికి హోదా ఉందని చెప్పారు. ఏపి కోసం ఎస్పీవి లాంటి సంస్థలను ఏర్పాటు చేయాలని సూచించినట్టు జైట్లీ తెలిపారు. తాము ఇస్తామన్న వాటితో పోలిస్తే ప్రత్యేక హోదా వల్ల ఏపికి వచ్చేది చాలా తక్కువగా ఉంటుందని, హోదాతో సమకూరే ప్రయోజనాలు ప్యాకేజీలో ఇవ్వడానికి కేంద్రం నిరాకరించలేదని వివరించారు. చట్టంలో చెప్పిన ప్రతి అంశానికీ తాము కట్టుబడి ఉన్నామని అంటూ, కేంద్రానికి 29 రాష్ట్రాల బాధ్యత ఉంటుందని, అన్ని రాష్ట్రాలు సమానమేనన్నారు.

ఏపికి ప్రత్యేక హోదా విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో బుధవారం నాడిక్కడ అరుణ్ జైట్లీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఏపికి ఇష్టం లేకుండానే విభజన జరిగింది. దీనివల్ల ఏపి నష్టపోయిందని తెలుసు..దానిపై మాకు సానుభూతి కూడా ఉంది. విభజన చట్టం ప్రకారం ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి. అయితే, రాజ్యాంగ సవరణ ద్వారా అమల్లోకి వచ్చిన 14వ ఆర్థిక సంఘం ఏ రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇవ్వొద్దని చెప్పింది. రాష్ట్రాలకు 60:40 శాతం పద్ధతిలో రాష్ట్రాలకు నిధులు కేటాయించాలని చెప్పింది. అందుకే మేం హోదా ఇవ్వడం లేదు. హోదా సాధ్యం కాక ప్యాకేజీ ఇచ్చాం. సెంటిమెంట్ ఆధారంగా నిధులు రావాలంటే రావు. ఆర్థిక సంఘం చెప్పిన ప్రకారమే డబ్బులు వస్తాయి. కేంద్రం దగ్గర నిధులు కూడా లేవు. అయినా ప్రత్యేక హోదాతో ఏమొస్తుంది? ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు 90 శాతం నిధులు కేంద్రం, 10 శాతం నిధులు రాష్ట్రాలు భరిస్తాయి. అయితే, ప్రస్తుతం ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికి లేనందున 60:40 శాతం నిధులు అమలు చేసుకోవాల్సింది. ఏపి కన్నా కూడా వెనుకబడిన రాష్ట్రాలు రాయితీలు కావాలంటే మేం ఏం చేయాలి" అని ప్రశ్నించారు. "దేశం మొత్తాన్ని ఒకే విధంగా చూడాల్సిన బాధ్యత కేంద్రానిది. ఇది రాష్ట్రాల యూనియన్. అయితే, మేం నిధులు ఇవ్వమని ఎక్కడా చెప్పలేదు. ప్రత్యేక పరిస్థితులు దష్ట్యా ప్రత్యేక హోదా లేకున్నా ఏపికి 90:10 శాతం నిధులు ఇవ్వాలని నిర్ణయించాం. వాటిని ఈఎపి ద్వారానైనా, నాబార్డు ద్వారానైనా ఇచ్చేందుకు సిద్ధం. అయితే, నాబార్డు ద్వారా అయితే ఏపికి రెవెన్యూ లోటు పెరుగుతుంది. రుణాలు తీసుకునే పరిమితి కూడా తగ్గుతుంది. ఎలా కావాలో ఏపి తేల్చుకోవాలని అడిగితే నాబార్డు ద్వారా కావాలని చెప్పింది. నా బార్డుతో చర్చించి మేం నిర్ణయం తీసుకున్నాం.

ఇందుకోసం ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే పోలవరానికి రూ.5 వేల కోట్లు ఇచ్చాం. రాజధాని నిర్మాణానికి రూ.2500 కోట్లు ఇచ్చాం. ఇక పన్ను రాయితీలను మేం ప్రవేశపెట్టిన తొలి రెండు బడ్జెట్‌ల్లోనే ఇచ్చేశాం. రెవెన్యూ లోటు, కేంద్ర పథకాలకు 90శాతం నిధులు ఇచ్చే అంశాలు తేలితే మిగిలిన సమస్యలకు పరిష్కారం ఉంటుంది. హోదాకు సరిపడ రాయితీలన్నీ కూడా ఇస్తామంటున్నాం. ఇది వరకే రెవెన్యూ లోటు కింద రూ.4 వేల కోట్లు ఇచ్చాం. ఇంకా రూ.138 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. 2014 నుంచి 2016 వరకు ఉన్న రెవెన్యూ లోటును లెక్కించాల్సి ఉంది. దానికి మరో 10 నెలలు అదనంగా కలిపి లెక్కించాల్చి ఉంది. మిగతా సంవత్సరాలకు లెక్కించాల్సి ఉంది. ఏప్రాతిపదికన రెవెన్యూ లోటు లెక్కించాలో రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించుకోవాలి" అని జైట్లీ చెప్పారు.

కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా

మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రులతోనూ, ఎంపీలతోనూ, రాష్ట్ర మంత్రులతోనూ చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో మంత్రివర్గం నుండి బయటకు రావడమే మేలన్న అభిప్రాయం ఈ చర్చల్లో వ్యక్తమైంది. చివరి ప్రయత్నంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో మాట్లాడటానికి బాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎంత సేపు ప్రయత్నించినా మోడీ అందుబాటులోకి రాలేదు. దీంతో పిఎంఒ కార్యాలయానికి తమ మంత్రులు రాజీనామా చేస్తున్న విషయాన్ని తెలియచేశారు. అనంతరం రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రివర్గం నుండి తప్పుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే మంత్రివర్గంలో భాగస్వాములయ్యామని, ఇప్పుడు రాష్ట్రం కోసమే రాజీనామాలు చేస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి పదవులు లెక్కలేదన్నారు. ప్రత్యేకహోదా విషయంలో కేంద్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని, పోలవరంతో పాటు వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చిన నిధులకు, చెబుతున్న లెక్కలకు పొంతన లేదని చెప్పారు. వైసిపికి ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కులేదని అన్నారు. ప్రధాని కార్యాలయంలో కూర్చుని తమ రాజీనామాలపై ఆరా తీస్తున్నారని ఆయన చెప్పారు.

అవినీతికి తావుండరాదు

సమీక్షలో ఎసిబి డిజి ఆర్పీ ఠాకూర్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అవినీతికి తావు లేకుండా చేయాలని ఎసిబి డిజి ఆర్పీ ఠాకూర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విజయవాడ లోని ఎసిబి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మూడు నెలల సమీక్ష సమావేశం నిర్వహించారు. 13 జిల్లాలకు చెందిన ఎసిబి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదనపు డైరక్టర్లు, జాయింట్ డైరక్టర్లు, డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, లీగల్ ఆఫీసర్లు పాల్గొన్న ఈ సమావేశంలో అవినీతి అధికారులు, లంచగొండులు, అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ మధ్యకాలంలో అధికారులు చేసిన పలు దాడులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరం ఆరంభం నుంచే ఎసిబి దూకుడుతో అక్రమార్కుల్లో భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని సంవత్సరం మొత్తం కొనసాగించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో ఆయన నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అవినీతితో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల న్నారు. 13 జిల్లాల్లో జరుగుతున్న ఎసిబి సొంత కార్యాలయ భవన నిర్మాణలపైనా సమీక్షిం చారు. ఎసిబికి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పోస్టులపైనా చర్చించారు. ఎసిబిని బలోపేతం చేసే దిశగా మరిన్ని చర్యలు తీసుకుంటామని ఠాకూర్ స్పష్టం చేశారు.

విజయవాడలో ఆడియో


సిమ్రాన్ పరింజ, నిఖిల్, సంయుక్త హెగ్డే

నిఖిల్, సిమ్రాన్ పరింజ, సంయుక్తా హెగ్డే నాయకా నాయికలుగా రూపొందిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొపిశెట్టి దర్శకుడు. ఏ టీవీ సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 16న సినిమా విడుదలవుతుంది. బుధవారం రామానాయుడు స్టూడియోలో చిత్ర విశేషాలను చిత్రబృందం తెలిపింది.

అనిల్ సుంకర మాట్లాడుతూ 'ఈనెల15న ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. తర్వాత రోజున మా సినిమా వస్తుంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నాం. సినిమాలో ఉపయోగించిన కారును ఈ కంటెస్ట్‌లో గెలిచిన వారికి ప్రథమ బహుమతిగా అందచేస్తాం. అలాగే రేపటి నుండి రెండు రాష్ట్రాల్లో టూర్‌ను నిర్వహిస్తున్నాం. ఈ నెల 10న విజయవాడలో ఆడియో వేడుకను నిర్వహిస్తున్నాం. 13న ప్రీ రిలీజ్ వేడుక ఉంటుంది. 'శివ' సినిమా చూసిన తర్వాత అలాంటి సినిమా చేయగలనా? లేదా? అనే ఆలోచన ఉండేది. దాని స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. 'శివ, హ్యాపీడేస్' తరహాలో పూర్తిస్థాయి కాలేజ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. అలాంటి నేపథ్యంలో సినిమా వచ్చి చాలా రోజులైంది కనుక, 'కిరాక్ పార్టీ' తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. శరణ్ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. చందు మొండేటి, సుధీర్ వర్మలు సినిమాకు తమ వంతు సహకారాన్ని అందించారు" అని అన్నారు.

హీరో నిఖిల్ మాట్లాడుతూ 'నా తొలి సినిమా 'హ్యాపీడేస్' తర్వాత పూర్తిస్థాయిలో మరో కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా చేయలేదు. ఇది 15వ సినిమా. ఇన్ని చిత్రాల్లో నా గుండెకు దగ్గరైన సినిమాల్లో ఇదొకటి. పేక్షకులకు చేరుకోవడానికి రేపటి నుండి రెండు రాష్ట్రాల్లో టూర్‌కి వెళుతున్నాం. యూత్‌ఫుల్ మూవీ. అందరికీ నచ్చుతుంది' అని పేర్కొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే బంద్

- నట్టికుమార్



"డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు అధిక రేట్లను వసూలు చేయడం వల్లే బంద్ అనివార్యమని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు చెబుతున్నారు. అందుకు క్యూబ్, యుఎఫ్ఓ, పిక్స్‌డి వాళ్ళకు సినిమా కంటెంట్ ఇవ్వమని నిరాకరిస్తే సరిపోతుంది. కానీ థియేటర్లు బంద్ చేయడం ఎందుకు? సర్వీస్ ప్రొవైడర్లు అమర్చిన టెక్నాలజీని మరో సంస్థ ద్వారా పొందవచ్చు. కానీ ఇండస్ట్రీలోని ఆ నలుగురు ఆ ప్రయత్నాలు చేయడంలేదు. ఇదే విషయంలో గతంలో ఛాంబర్ సెక్టార్ ఛైర్మన్‌గా నేను ఆ నలుగురితో పోరాడాను. కానీ అప్పుడు చాలా తేలిగ్గా తీసుకున్నారు. అసలు సర్వీస్ ప్రొవైడర్ల వెనుక భాగస్వాములుగా అల్లు అరవింద్, డి.సురేష్‌బాబు, సునీల్, రమేష్‌ప్రసాద్ వంటి ప్రముఖులే ఉన్నారు".

నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, పంపిణీదారుల మేలు కోసం కాకుండా కొందరు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసమే సినిమా థియేటర్ల బంద్ చేశారు అని నిర్మాత నట్టికుమార్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చిన్న సమస్య కోసం ఆరు రోజులుగా థియేటర్లు బంద్ చేయడం విడ్డూరంగా ఉంది. దీని వల్ల చిన్న నిర్మాతలు తమ సినిమాలను విడుదల చేసుకోలేక, ఎగ్జిబిటర్లు ప్రదర్శనలు చేయలేక చాలా నష్టపోయారు. థియేటర్ల మూత వల్ల క్యాంటిన్, పార్కింగ్‌తోపాటు పలువురు కార్మికులు నానా యాతన పడ్డారు. గతంలో ఎన్నో జటిల సమస్యలు ఎదురైనా ఒకటి రెండు రోజుల మినహా థియేటర్లను మూసిన దాఖలాలు లేవు. ఆ నలుగురికి చిన్న నిర్మాతల సమస్యలు పట్టవు. డిజిటల్ ప్రొవైడర్లను కొంత పర్సంటేజ్ తగ్గించండి అంటూ బేరసారాలు చేయడం ఎందుకు? వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పిస్తే సరిపోను. ప్రస్తుతం వారానికి 12 వేల రూపాయలు డిజిటల్ ప్రొవైడర్లు నిర్మాతల నుంచి వసూలు చేస్తుంటే... అందులోంచి 2వేలు తగ్గించమని కమిటీ సభ్యులు కోవడం చాలా విడ్డూరంగా ఉంది. అసలు ప్రొవైడర్లు పెట్టిన పెట్టుబడి ఎప్పుడో వచ్చేసింది. ఆ తర్వాత ఫ్రీగా తమ సాంకేతికతను సమకూర్చాలని నిబంధనలోనే ఉంది. దాన్ని బయట పెట్టకుండా ఏవేవో సాకులు చెబుతూ ఇండస్ట్రీని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ బంద్ కారణంగా ఈ వారంలో విడుదలకావాల్సిన చిన్న సినిమాలు ఆగిపోయాయి. వారికి జరిగిన నష్టం ఎవరు తెచ్చిస్తారు? త్వరలో విడుదల కాబోయే 'రంగస్థలం', 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' చిత్రాల విడుదల తేదీలను ఈ కమిటీ మార్చగలదా? అంటూ విమర్శించారు.

అజ్ఞాతవాసి నష్టాలను పూడ్చలేదు

ప్రశ్నించే హక్కు అందరికీ ఉందంటూ రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ తన సినిమా వల్ల నష్టపోయిన డిస్ట్రిబ్యూటర్ల ప్రశ్నకు ఏమని సమాధానం చెబుతారంటూ ఘాటుగా స్పందించారు నట్టికుమార్. 'అజ్ఞాతవాసి' చిత్రాన్ని ఎక్కువ రేట్లకు అమ్మారు. కానీ ఆ చిత్రం ఆడకపోవడంతో ఎంతో మంది ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు నష్టపోయారు. విశాఖ జిల్లాలో ఓ ఎగ్జిబిటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మరో జిల్లాలో మరో ఎగ్జిబిటర్ పరిస్థితి ఇదే. ప్రజలకు న్యాయం చేస్తానని ముందుకు వచ్చిన పవన్‌కు వీరు ప్రజల్లా కన్పించడం లేదా? నా వద్ద అన్నింటికీ రుజువులున్నాయి. ఎటువంటి చర్చకైనా సిద్ధమే అని సవాల్ విసిరారు.

ఎమ్మెల్యేగా నిలబడతా

ఇంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్న నేను రాబోయే ఎన్నికల్లో విశాఖపట్నంలో ఎంఎల్ఏగా నిలబడతా. ఏ పార్టీ అనేది త్వరలో వెల్లడిస్తా. తెలంగాణ సి.ఎం. కెసిఆర్ జాతీయ స్థాయిలో థర్డ్‌ఫ్రంట్ అంటూ చెప్పడంతో ఆయన పేరు మారుమోగుతోంది. ఆయన టీఆర్ఎస్ పార్టీ ఆంధ్రాలో పెడితే ఎక్కువ స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం. అందులో మొదటగా నిలబడే వ్యక్తిని నేనే అంటూ స్పష్టం చేశారు.


గురువారం 'రంగస్థలం' మూడో గీతాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఆ చిత్రం బృందం విడుదల చేసిన ఫొటో


విశాల్

నేడు 'అభిమన్యుడు' గీతం విడుదల

విశాల్ కథానాయకుడిగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అభిమన్యుడు'. సమంత కథానాయిక. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ను హరి వెంకటేశ్వర పిక్చర్స్ అధినేత జి.హరి ఫ్యాన్సీ ఆఫర్‌తో దక్కించుకున్నారు. ఎం.పురుషోత్తమన్ సమర్పణలో హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలోని తొలి పాటను యూత్ స్టార్ నితిన్ చేతులమీదుగా గురువారం విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. హై టెక్నికల్ వేల్యూస్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. యాక్షన్ కింగ్ అర్జున్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు" అన్నారు.

షకీలా బయోపిక్


రిచా చద్దా

గతంలో విద్యాబాలన్ ముఖ్యపాత్రలో 'దర్టీ పిక్చర్' వచ్చింది. అది అలనాటి నటి సిల్క్‌స్మిత జీవితం కథ. ఇప్పుడు శృంగార తార షకీలా జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు దర్శకుడు ఇంద్రజిత్ లంకేశ్. షకీలా పాత్రధారిగా రిచా చద్దా చేయబోతుంది. ఏప్రిల్‌లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. 2019 ప్రథమార్థంలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. దక్షిణ చిత్ర పరిశ్రమలో షకీలా అడల్ట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆమె ఎక్కువగా మలయాళ చిత్రాల్లో నటించారు. షకీలా తెలుగు, తమిళం, కన్నడ భాషా చిత్రాల్లో నటించారు. ఆమె తన సొంత ఆటో బయోగ్రఫీ కూడా రాసుకున్నారు. అందులో తన జీవితం, కుటుంబ సభ్యుల గురించి, స్నేహితులు, సినీ ప్రముఖులు, రాజకీయవేత్తలతో తన పరిచయం గురించి ప్రస్తావించారు. ఇవన్నీ బయోపిక్‌లో చూపిస్తారో లేదో చూడాలి.

ఇలాంటోడు 'కోటికొక్కడు'


నిత్య మీనన్, సుదీప్

'ఈగ' ఫేమ్ సుదీప్ హీరోగా నిత్య మీనన్ హీరోయిన్‌గా కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో కన్నడ, తమిళ్ భాషల్లో రూపొందిన చిత్రం 'కోటిగొబ్బ-2'. ఇటీవలే విడుదలై రూ.120 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. ఈ చిత్రాన్ని దుహర మూవీస్ పతాకంపై కల్యాణ్ ధూళిపాళ్ల 'కోటికొక్కడు' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. శుక్రవారం విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'విభిన్నమైన అంశంతో రీసెంట్‌గా 'రచయిత' సినిమా నిర్మించాను. చిన్న సినిమాగా రిలీజ్ అయిన ఆ చిత్రం చాలా మంచి పేరు తెచ్చింది. ఇప్పుడిది రెండో ఇది తప్పకుండా తెలుగు వారికి నచ్చుతుంది. 300 థియేటర్లకు పైగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని అన్నారు. ప్రముఖ దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ 'సుదీప్ నేషనల్ హీరో. ఇప్పటివరకు చాలా మంచి సినిమాలు చేశారు. అతను చేసిన బెస్ట్ సినిమాలలో 'కోటికొక్కడు' బిగ్గెస్ట్ హిట్ మూవీ. కె.ఎస్. రవికుమార్ నాకు చాలా ఇష్టమైన దర్శకుడు. రీసెంట్‌గా 'జై సింహా'తో సూపర్‌హిట్ కొట్టారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రమిది" అని అన్నారు.

మూకీ చిత్రంగా 'మెర్క్యూరీ'!


'మెర్క్యూరీ'లో ప్రభుదేవా

చాలా ఏళ్ల క్రితం కమల్ హాసన్ ప్రధాన పాత్రలో 'పుష్పక విమానం' అనే మూకీ చిత్రం వచ్చింది. దానికి సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. ఇప్పుడు మరో సినిమా రాబోతుంది. ఇది పూర్తి హార్రర్ చిత్రం. మాటలు లేకుండా భయపెట్టబోతుంది. ప్రముఖ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'మెర్క్యూరీ' అనే చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రభుదేవా కీలక పాత్ర పోషిస్తున్నారు. థ్రిల్లర్ నేపథ్యంగా సాగే ఈ చిత్రం టీజర్‌ను నాలుగు భాషలకు చెందిన నటులు దగ్గుబాటి రానా, ధనుశ్, నివిన్ పాలిన్, రక్షిత్ శెట్టి ట్విటర్ ద్వారా విడుదల చేయడం చేశారు. పెన్ మూవీస్ పతాకంపై కార్తికేయన్ సంతానం, జయంతిలాల్ గద నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తున్నారు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది ఈ సినిమా మాటలేకుండా ఎంతలా భయపెట్టబోతుందో?. ఈ చిత్రం దేశంలోని అన్ని భాషల్లో విడుదల చేయబోతున్నారు. ఏప్రిల్ 13న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నాకు స్పెషల్ చిత్రమిది

- షకీలా


షకీలా, సాయిరామ్, గణేష్, గీతాంజలి తదితరులు

'జి' స్టూడియోస్ సమర్పణలో షకీలా 250వ చిత్రంగా 'శీలవతి' రాబోతుంది. సాయిరామ్ దాసరి దర్శకత్వంలో కేరళలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. తెలుగులో రాఘవ ఎమ్. గణేష్, వీరు బాసింశెట్టి నిర్మాతలు. టీజర్‌ను బుధవారం ప్రసాద్ ల్యాబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా షకీలా మాట్లాడుతూ.. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్. ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటిస్తున్నా. తదుపరి ఏం జరుగుతుందనేది ఆసక్తికరంగా స్క్రీన్ ప్లే చేశాడు దర్శకుడు. నిర్మాతలిద్దరూ సినిమా కోసం ఏం కావాలన్నా అందించారు. మేలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం" అని అన్నారు. గీతాంజలి (ప్రూటీ) మాట్లాడుతూ "షకీలాతో రెండో చిత్రం. యంగ్ టీమ్ కలసి పని చేసిన సినిమా కనుక చాలా ఫాస్ట్‌గా ఇంట్రెస్టింగ్‌గా షూటింగ్ పూర్తి అయింది. సినిమా చాలా బాగొచ్చింది.. అందరూ సినిమాను చూసి ఆదరించాలని కోరుతున్నా" అని తెలిపారు.


ఛరిష్మా, అరుణ్‌తేజ్, శ్రీకాంత్

నీతోనే హాయ్..హాయ్

అరుణ్ తేజ్, ఛరిష్మా శ్రీకర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'నీతోనే హాయ్ హాయ్'. బియన్ రెడ్డి అభినయ దర్శకత్వం వహిస్తున్నారు. యలమంచిలి ప్రవీణ్ సమర్పణలో డా.ఎ.స్.కీర్తి, డా.జి.పార్థసారథి రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవం బుధవారం ఫిలింనగర్‌లో తజరిగింది. హీరో శ్రీకాంత్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ నివ్వగా 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం చిత్ర దర్శకుడు బి.యన్.రెడ్డి అభినయ మాట్లాడుతూ 'కథను నమ్మి నిర్మాతలు ముందుకొచ్చారు. బాగా డబ్బున్న వ్యక్తి వ్యక్తిత్వం ఎలా ఉంటుంది? మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడి మానవత్వం ఎలా ఉంటుంది? అనేది మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం. క్యూట్ లవ్ స్టోరీకి కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నేటి నుండి షెడ్యూల్ ప్రారంభమైంది. మూడు షెడ్యూల్స్‌లో సినిమాను పూర్తి చేయడానికి ప్లాన్ చేశాం. విదేశాల్లో పాటలు చిత్రీకరించాలన్న ఆలోచనలో ఉన్నామ'ని అన్నారు.



మహేష్‌తో నటించాలనుంది

- శివాని

విజయ్ దేవరకొండ, శివాని జంటగా నటించిన చిత్రం 'ఏ మంత్రం వేసావె'. శ్రీధర్ మర్రి డైరెక్ట్ చేసిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా కథానాయిక శివాని బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'మా కుటుంబానికి అసలు సినిమా బ్యాక్ గ్రౌండ్ లేదు. అమ్మ, నాన్న ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటారు. నాకు మోడలింగ్ అంటే ఇష్టం. అక్కడి నుండే సినిమాల్లోకి వచ్చాను. మోడలింగ్ చేస్తున్నప్పుడు సినిమాల్లో నటించగలనని రియలైజ్ అయ్యాను. అప్పటి నుండి సినిమా ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఇందులో నా పాత్ర చాలా బలంగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగల అమ్మాయిగా కనిపిస్తాను. అదే విధంగా పాత్రలో ఒక సెన్సిటివిటీ కూడా ఉంటుంది. ఈ సినిమా హెల్ప్ అవుతుందా? లేదా? అనే విషయాన్నీ నేను చెప్పలేను. కానీ మంచి సినిమా చేశానని మాత్రం చెప్పగలను. విజయ్ దేవరకొండ చక్కటి నటుడు. తను సెట్స్‌లో చాలా సరదాగా ఉంటాడు. అతనితో వర్క్ చేయాడాన్ని ఎంజాయ్ చేశాను. నా అభిమాన నటుడు మహేష్ బాబు. చాలా సింపుల్‌గా ఉంటారు. ఆయనతో సినిమా చేయాలని ఉంది' అని అన్నారు.

'తుమ్హారీ సులు' రీమేక్‌లో మంచు లక్ష్మి



మంచు లక్ష్మి మరో తమిళ సినిమా చేయబోతోంది. ప్రస్తుతం 'వైఫ్ ఆఫ్ రామ్' అనే ఓ కొత్తతరహా కథతో చేస్తోన్న లక్ష్మికి మరో మంచి ఆఫర్ వచ్చింది. బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన 'తుమ్హారీ సులు' అనే చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేస్తున్నారు. ఆ చిత్రంలో విద్యాబాలన్ పోషించిన పాత్రను జ్యోతిక చేయనున్నారు. నేహా ధూపియా క్యారెక్టర్‌కు మంచు లక్ష్మి ఎంపికయ్యారు. 'బాలీవుడ్‌లో వచ్చిన 'తుమ్హారీ సులు' నేను చూడలేదు. కానీ నేహా ధూపియా పాత్ర గురించి తెలుసు. ఆమె పాత్ర సినిమాలో చాలా స్టయిలిష్‌గా ఉంటుంది. అలా ఉండటానికి నాకూ ఏ ఇబ్బంది లేదు" అని మంచు లక్ష్మి చెప్పారు.

ప్రజాశక్తి 11
విజయవాడ
గురువారం 8 మార్చి 2018
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.



జానపద కళలు జనం పనిపాటల నుంచి పుట్టినవే. శ్రమజీవులను ఆటపాటతో సేదదీర్చి వారికి వి్తో ‌ ‌ త రిఅందించే ఉత్ప్రేరకాలు. గ్రామీణ ప్రజల విశ్వాసాల చుట్టూ అల్లుకున్న కథలే కళారూపాలుగా మారాయి. తెలుగునాట ప్రసిద్ధి పొందిన జానపద కళారూపాల్లో వీధి భాగవతం ఒకటి. ఇదే ఉత్తరాంధ్రకు వచ్చేసరికి తూర్పు భాగవతంగా మారిపోయింది. కూచిపూడి భాగవతం ఒకప్పుడు కొన్ని సామాజిక వర్గాలకు మాత్రమే పరిమితమై ఉండేది. దీని నుంచి రూపొందిన వీధి భాగవతం ఒక సామాజిక కళారూపంగా రూపుదిద్దుకుంది. ఆయా ప్రాంతాల్లోని అన్ని రకాల కులాల్లోని ఔత్సాహిక కళాకారులు ఇందులో భాగమయ్యారు. అలాంటి 'తూర్పు భాగవతం' కళలోని పూర్వపరాలు ఈవారం 'సంగమం'లో ...

ఉత్తరాంధ్ర జానపదం తూర్పు భాగవతం

చాలామంది పండితులకు ఎక్కువగా తెలిసింది కూచిపూడి వీధి భాగవతాలే. అయితే ఈ భాగవతాన్నే ఆదిభట్ల నారాయణదాసు, విజయనగర సంస్థానాధిపతి ఆనంద గజపతి మహారాజు లాంటి కళా పోషకుల ఆదరాభిమానాల్ని ఈ కళారూపం సంపాదించుకుంది. వారు ఎందరో ఉత్తమ భాగవత కళాకారులకు సింహతలాటాలను, ఘంటా కంకణాలనూ 'కలియుగ సత్య భామ, పండిత సత్యభామ, అభినయ సత్యభామ, గాన కోకిల, వసంత గాన కోకిల వంటి బిరుదుల్ని కూడా అందించారు.

చారిత్రక ప్రాధాన్యత

తూర్పు భాగవతానికి ఒక చారిత్రక ప్రాధాన్యత ఉంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు, ఒడిశాలోని గంజాం, కోరాపుట్ తదితర జిల్లాల్లో తూర్పు భాగవతం ఉనికిలో ఉంది. ఇది సామాన్య ప్రజానీకాన్నే కాక, పండితుల్ని, విద్వాంసుల్నీ, కవుల్నీ, గాయకుల్నీ ఆకర్షించింది. ఇది ఒక విశిష్ట నర్తన రీతిగానూ, సంగీత సాంప్రదాయంగానూ, మదంగ బాణీగానూ ఈ కళారూపం సంస్థానాధీశుల ఆదరణకు నోచుకుంది. ఆయా ప్రాంతాల్లో తిరునాళ్ళలోను, అమ్మవారి జాతర్లలో ఈ భాగవతాలు ప్రదర్శనలు జరిపి కళాకారులు ఎంతో ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. హరికథా పితామహుడు అజ్జాడ ఆది భట్ల నారాయణదాసు, విజయనగర సంస్థానాధిపతి ఆనంద గజపతి మహారాజు లాంటి కళా పోషకుల ఆదరాభిమానాల్ని ఈ కళారూపం సంపాదించుకుంది. వారు ఎందరో ఉత్తమ భాగవత కళాకారులకు సింహతలాటాలను, ఘంటా కంకణాలనూ 'కలియుగ సత్య భామ, పండిత సత్యభామ, అభినయ సత్యభామ, గాన కోకిల, వసంత గాన కోకిల వంటి బిరుదుల్ని కూడా అందించారు.

కథ పాతది-శైలి ప్రత్యేకం

తూర్పు భాగవత ప్రదర్శనల్లోని కథ పాతదే. సాధారణంగా భాగవతం అంటే కృష్ణుని కథలను గానం చేయడమే! ఈ తూర్పు భాగవతంలోని కథావస్తువు కృష్ణుడు, సత్యభామల మధ్య ఏర్పడిన ప్రణయ కలహమే. దీనికే పారిజాతాపహరణమని, భామా కలాపమని కూడా తెలుగు రాష్ట్రాల్లో వ్యవహరిస్తారు. మొదట్లో సిద్ధేంద్ర యోగి భాగవత సంబంధమైన ఈ భామాకలాప రచన చేసి ప్రచారం చేశారు. కానీ దీనిని కూచిపూడి వీధి భాగవతులు మాత్రమే అధిక ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే సిద్ధేంద్రుడు రాసిన పారిజాతాపహరణానికి, తూర్పు ప్రాంతంవారు ప్రదర్శించే భాగవతానికి చాలా తేడా ఉంది. కూచిపూడి భామాకలాపంలో కనిపించే దరువులు వీరి భాగవతాల్లో తక్కువగా ఉంటాయి.

సందర్భం చుట్టూ అల్లుకున్న కథ

తూర్పు భాగవత కలాపంలో కథా వస్తువు ఒక ముచ్చటైన సందర్భం మాత్రమే! దాని చుట్టూ కథ అల్లుకుని ఉంది. తన మందిరం నుంచి అలిగి వెళ్ళి పోయిన కృష్ణుని, సత్యభామ రాయబారం పంపించి మళ్ళీ తన ఇంటికి రప్పించుకున్న సందర్భమే ఈ కథా వస్తువు. కథ చిన్నదే అయినా ఇందులో అష్టవిధ నాయికల వర్ణనలూ, అవస్థలూ, విప్రలంభ శంగారంతో నిండి ఇది ఒక పెద్ద ప్రబంధమై పోయింది. ఒకప్పుడు ఈ భాగవతాన్ని వరుసగా తొమ్మిది రోజులు ప్రదర్శించేవారు. ఆ తర్వాత కాలానుగుణంగా మూడు రాత్రులకు కుదించారు. ప్రస్తుతం ఒక్క రాత్రే పూర్తి చేస్తున్నారు.

అనేక మార్పులకు లోనై

తూర్పు భాగవతంలోని కథని మొదట రూపొందించినది విజయనగరం ప్రాంతానికి చెందిన వంకాయల బలరామ భుక్త. ఇందులోని కథ కూచిపూడి భాగవతం కథా ఒకటే అయినా పాటలకు సంబంధించిన బాణీ, దరువులు, నడిపే విధానం, మదంగ వాయిద్య రీతుల్లోనూ వారి బాణీకి, తూర్పు భాగవత బాణీకీ చాలా తేడా ఉంది. బలరామ భుక్త తరువాత ఈ జిల్లాకు చెందిన నరసింగబల్లి వారు, కేశవపురి వారు, బొబ్బిలి వారు, దువ్వవారు, నెల్లిమర్ల వారు వంటి ఎందరో ప్రసిద్ధ నాట్య శాస్త్రవేత్తలు, ఈ తూర్పు భాగవత బాణీకి కావాల్సిన కలాప రచనలను చేశారు. అయితే ఈనాటికీ వంకాయల బలరామభుక్త రచనే ప్రచారంలో ఉందని కళాకారులు చెపుతారు.

దేశీసంగీత రచనలతో

తూర్పు భాగవత ప్రదర్శనలో దరువులు, ద్విపదలు, కంద పద్యాలు, వత్తాలు, అర్ధచంద్రికలు, ఏల పదాలు, చూర్ణికలు తదితర దేశి సంగీత రచనలు ఉపయోగిస్తుంటారు. ఈ దరువులు ఈ ఆటల్లో చాలా ప్రాముఖ్యం వహిస్తూ ఉంటాయి. భరతుడు నాట్యశాస్త్రంలో ఉదహరించిన ప్రాచీన ధవాగానం అనే విధానాన్ని ఈ నాటికీ తూర్పు భాగవతులు ప్రదర్శిస్తున్నారు. రాగాలూ, తాళాలూ, నేటి కర్ణాటక సాంప్రదాయానికి చెందిన వైనా, రాగ సంచారం, తాళ ప్రసారం మొదలైన విధానాలు ప్రాచీన సంప్రదాయ పద్ధతిని అనుసరించే ఉంటాయి.

మృదంగమే కీలకం

తూర్పు భాగవత ప్రదర్శనలో మదంగమే అత్యంత కీలకమైన వాయిద్యం. ఇది కళాకారుల్ని ఉద్ధృత తాండవ విన్యాసాలను చేయిస్తుంది. ప్రేక్షకులను ఉత్తేజం, ఉద్వేగాలతో అలరిస్తుంది. మృదంగ కళాకారులు తమ వాయిద్యంలో సముద్రం ఘోషలను, పిడుగుల మేఘ గర్జనల్ని, ఉరుముల ధ్వనుల్ని, నగారాల భేరీనాదాన్ని విన్పిస్తారు. ఆ దరువులను బట్టే నృత్యంకూడా అంత ఉద్వేగంగానూ ఉంటుంది. వారి మృదంగ వాయిద్యంలో ఎంత గంభీరమైన నాదాలుంటాయో, అంతటి సున్నితమైన, మదుమధురమైన కోకిల స్వరాలూ, చిలుక పలుకులూ వంటి వాటిని కూడా అలవోకగా పలికిస్తూ ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచేస్తారు. ఈ మృదంగ వాదనలో విశేషమేమిటంటే... ఇతర కళారూపాల్లో వాయిద్యకారులు కూర్చుని మృదంగం వాయిస్తారు. కానీ, తూర్పు భాగవతం ప్రదర్శనలో రెండు మృదంగాల్ని ఒకే కళాకారుడు ముందు వెనుక నడుముకు కట్టుకుని గంటల తరబడి ప్రదర్శన జరిగినంత సమయమూ నిలబడి వాయించటం చెప్పుకోతగిన విషయం. ఇది చాలా కష్టసాధ్యమైనది. దీనిని సంపూర్ణ ద్విపద రీతి అంటారు. తూర్పు భాగవతం కోసమే బొబ్బిలి ఆస్థానంలో నంది భరతం అనే మృదంగ జతుల గ్రంథాన్ని రూపొందించారు. ఒకే తాళంలో, సప్త తాళాలు ఇమిడి ఉండే రీతిలో, శబ్దాలను కూర్చి పలికించడం ఈ కళాకారుల ప్రతిభను వెల్లడిస్తోంది. ఈ విశిష్ట వాయిద్యంలో పాత తరం విద్వాంసులు బుగత రామయ్య, ఆయన కుమారుడు గోపన్న. ఆ తరం తరువాత కింతాడ అప్పన్న, ముట్నూరి సంగమేశ్వర శాస్త్రి, ధూపం సూర్యలింగం, గోవిందరావు లాంటి వారు ప్రముఖులుగా ప్రసిద్ధి పొందారు.

అన్ని వర్గాల కళాకారులు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో చాలా గ్రామాల్లో జరిగే అమ్మవారి జాతర్లలో ఈ తూర్పు భాగవతాన్ని ప్రదర్శించటం ఇప్పటికీ సంప్రదాయంగా ఉంది. కళాకారుల్లో అన్ని కులాలకు, వర్గాలకు చెందిన వారున్నారు. ఈ భాగవతాల్లో పాత్రలు ధరించే వారందరూ పురుషులే.



అయినా వందేళ్ల క్రితం, ఒకే ఒక స్త్రీ, భామ వేషం ధరించి, ఆనాటి ప్రజానీకాన్ని ఆశ్చర్యపరిచిందట. ఆమె తెర్లాం గ్రామానికి చెందిన కాలిగుంటి వెంకటస్వామి అనే భాగవత కళాకారుని కుమార్తె అని చెబుతారు. కొత్త తరం వారెవరూ ఈ కళని నేర్చుకోవడానికి, ప్రదర్శించడానికి ఆసక్తి చూపించడం లేదు.

ఆదరణ కరువై

శతాబ్దాల తరబడి ప్రజలను అలరించిన ఈ జానపద కళారూపం నేడు అంతరించే దశలో ఉంది. ఒకప్పుడు విజయనగరం, బొబ్బిలి, మాడుగుల, కళింకోట, మందసా, చోడవరం, చీకటికోట, ధారాకోట, సాలూరు, పార్వతీపురం తదితర సంస్థానాలు, జమీందారులూ, ప్రజలు ఈ కళను ఎంతగానో ఆదరించి పోషించారు. విద్వాంసులైన భామ వేషధారులు, మార్దంగికులు కొద్దిమంది మాత్రమే జీవించి ఉన్నారు. ఇలాగే కొంతకాలం జాగు చేస్తే ఈ కళారూపం నామమాత్రంగా కూడి లేకుండా పోతుంది. అక్కడక్కడ మిగిలి ఉన్న విద్వాంసుల బాణీని రికార్డు చేయాలి. డాక్యు మెంటరీలు తీయాలి. వేష, భూషణ అలంకారాలను భద్రపరచాల్సిన అవసరం ఉంది.

- బెందాళం క్రిష్ణారావు

పదివేల ప్రదర్శనల సాంబమూర్తి

కోమటిపల్లికి చెందిన తూర్పు భాగవతార్ బొంతలకోటి సాంబమూర్తి ఇప్పటికి ఈ కళారూపాన్ని పదివేలసార్లకు పైగా ప్రదర్శించారు. ఆయన తూర్పు భాగవతంలో సత్యభామగా, గొల్లభామగా గుర్తింపు పొందారు. హరికథా కళాకారుడిగా కూడా ఆయన ప్రసిద్ధి. తన పన్నెండో ఏట తూర్పు భాగవతాన్ని మొదటిసారి ప్రదర్శించారు. అప్పటినుంచి 10 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. పిఠాపురం, గుంటూరు, నెల్లూరు, హైదరాబాద్, సికిందరాబాద్ తదితర ప్రాంతాల్లో 54 ఏళ్ల పాటు తన ప్రతిభను చాటుకున్నారు. సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ తూర్పు భాగవతంపై పరిశోధన చేసి ప్రచురించిన పుస్తకం కవర్‌పేజీపై సాంబమూర్తి ఫొటో ముద్రించారు.



రచనలకు ఆహ్వానం

బాలల్లో ఉన్న సృజనను వెలికి తీసేందుకు, ప్రోత్సహించేందుకు అమరావతి బాలోత్సవ్ కమిటీ పని చేస్తోంది. సంస్కృతి, సాహిత్య, కళారూపాల వేదికగా జాషువా సాంస్కృతి వేదిక పని చేస్తోంది. ఈ రెండు కమిటీల ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని రచయితల రచనలను ఆహ్వానిస్తున్నాం.

1. లఘు నాటికలు (నాలుగు పేజీల్లో, 10 నిమిషాలు మించకుండా)
2. ఏక పాత్రలు (రెండు పేజీల్లో, నాలుగు నిమిషాలు మించకుండా)
3. జానపద గీతాలు (ఒక పల్లవి, నాలుగు చరణాలు)
4. అభ్యుదయ గీతాలు (ఒక పల్లవి, నాలుగు చరణాలు)

పైన తెలిపిన ప్రతి విభాగం నుంచి ఉత్తమమైన పది రచనలను ఎంపిక చేసి ఒక్కొక్క రచనకు వెయ్యి రూపాయలు పారితోషకం అందజేస్తాం. దాంతోపాటు వాటిని పుస్తకాలుగా ముద్రించి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకూ పంపిణీ చేస్తాం. రచనలు పంపవలసిన ఆఖరు తేదీ : **9-5-2018** (విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి రోజు) బహుమతి ప్రదానోత్సవం, పుస్తకావిష్కరణ సభ : **1-6-2018** (అంతర్జాతీయ బాలల దినోత్సవ రోజు)

రచనలకు ఎంచుకోవాల్సిన అంశాలు

1. పర్యావరణం, 2. బాలికల విద్య 3. మూఢ నమ్మకాలు 4. ఆరోగ్యం, 5. బాల్య వివాహాలు, 6. టీ.వీ., సెల్‌ఫోన్ల ప్రభావం, 7. ఆటలు- మానవ సంబంధాలు, 8. తెలుగుభాష, 9. వినిమయ సంస్కృతి, 10. దేశభక్తి, 11. నేటి విద్యా విధానం, 12. మత సామరస్యం, 13. బాల కార్మికులు, 14. శాస్త్ర విజ్ఞానం, 15. అంటరానితనం.

రచనలు పంపాల్సిన చిరునామా :
ఎం.బి. విజ్ఞాన కేంద్రం, జాషువా సాంస్కృతిక వేదిక
ఆకులవారి వీధి, గవర్నరు పేట, విజయవాడ-2,
సెల్ నెంబర్ : 9951540671
మెయిల్ : Amaravati. balostavam@gmail.com



ఎంసీఏ చదివి.. కోలాటం ఆడి

ప్రకాశంజిల్లా కనిగిరికి చెందిన చేజర్ల నాగార్జున ప్రసాద్ ఎంసిఏ చదివారు. తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు. అయినా, కోలాటం అంటే బాల్యం నుంచీ ఆసక్తి. నాగార్జున తాత పాపయ్య కోలాటం బాగా చేసేవారు. ఆయన్నించి తన తండ్రి, తండ్రి నుంచి తాను ఈ కళను నేర్చుకున్నట్లుగా చెప్పారు నాగార్జున. ఆ సంగతులు అతడి మాటల్లో ...

కళను బతికించాలని ...

ప్రస్తుతం పొదిలిలోని టీచర్ ట్రైనింగ్ కాలేజీలో కంప్యూటర్ టీచర్‌గా పనిచేస్తున్నాను. ఐదేళ్ల వయసు నుంచి మా నాన్న దగ్గర 'భారత కోలాటం నేర్చుకున్నారు. ఆయన చిన్నతనంలో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో కోలాటం ప్రదర్శనల వల్ల వచ్చే డబ్బుతోనే ఇల్లు గడిచేది. నాన్నకు ఉద్యోగం వచ్చిన తర్వాతే ఇంటి పరిస్థితి మారింది. అయితే, డబ్బనేది ముఖ్యం కాదని, కళను బతికించడం మన బాధ్యత అని నాన్న అనేవారు. 2005లో నాన్నతో కలిసి కోలాటం ప్రదర్శనలో మాస్టారుగా వ్యవహరించాను. ప్రేక్షకుల్లో కొంతమంది మీ అబ్బాయి కోలాటానికి పనికిరాడన్నట్టుగా మాట్లాడారు. అది నిరుత్సాహం కలిగించింది. అయితే, అమ్మ ధైర్యం చెప్పింది. ఇది మన వారసత్వ కళ. ఎవరో ఏదో అన్నారని వదిలేసేంత ఎలా? అని నచ్చజెప్పింది. ఆ తరువాత కసిగా విద్యను నేర్చుకొని ఈరోజు కోలాటం మాస్టారుగా మంచి పేరు సంపాదించుకోగలిగాను. ఎమ్‌సిఏ చదివి టీచర్‌గా పనిచేస్తున్నాగానీ.. కోలాటం మాస్టారుగా కొనసాగుతున్నందుకు గర్వంగా ఫీలవుతున్నా.

అంతరించిపోతున్న కళలకు ఊపిరి పోస్తూ.. తనకు వచ్చిన కళను ఇతరులకు నేర్పుతూ... వంశపారపర్యంగా వస్తున్న కళను బతికించాలనే తాపత్రయం అతనిది. ప్రాచీన కళలకు వినూత్న ఆలోచనలు జోడించి, తద్వారా నిరక్షరాస్యత నిర్మూలనకు నడుం బిగించాడు. యువతీయువకులకు కోలాటం నేర్పి, తద్వారా మార్పు తీసుకురావాలనే తపన పొందుతున్నాడు ఆ యువకుడు. అతడు చేజర్ల నాగార్జున ప్రసాద్.

పాటల ద్వారానే చైతన్యం

ప్రాచీన గ్రామీణ కళైన కోలాటాన్ని ప్రతి గ్రామంలోకి తీసుకెళ్ళాలనే లక్ష్యంతో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో కోలాట శిక్షణ ఇస్తున్నాను. ఎవరైనా తన గ్రామానికి వచ్చి కోలాటం నేర్పమంటే పారితోషికం విషయంలో పట్టింపుకు పోకుండా అక్కడికెళ్లి నేర్పుతున్నాను. ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, మద్యపానానికి, వరకట్నానికి వ్యతిరేకంగా, యువతరం చెడు వ్యసనాలకు బానిసలు కావద్దంటూ, వ్యవసాయాన్ని బతికించాలని కోరుతూ ... ఇలా కోలాటం పాటల బాణీలో ప్రచారం చేస్తున్నాము. ఇప్పటివరకు మా బృందాలతో సుమారు 200 ప్రదర్శనలు ఇచ్చాము. మూడువేల మందికిపైగా నా దగ్గర కోలాటం నేర్చుకున్నారు. తిరునాళ్లలో పోగ్రాం చేస్తున్నప్పుడు వేలాదిమంది తిలకించటం ఆనందాన్నిస్తుంది.



ఎన్నో అవమానాలు

ఇంత చదువుకుని కోలాటం ఎంచుకున్నానని బంధువుల్లో చులకన భావం ఉంది. అమ్మానాన్న కూడా ఈ కళను వదిలేయమని ఒక సందర్భంలో చెప్పారు. కానీ, నాకు ఇష్టం లేదు. ఇది మన జానపద కళ. మన పాత తరాలవారు ఆనందంతో ఆడిపాడిన కళ. దానిని ఇలా కొనసాగించటమే నాకు ఆనందం, ఆత్మతృప్తి.

ఆహార నియమాలు పాటించాలి

ప్రతి సంవత్సరం జనవరి నుంచి జులై వరకు కోలాటం ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ఆ సమయంలో ఆరోగ్యం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటాను. ఆ సమయంలో కూల్‌డ్రింక్స్, చాక్లెట్స్, ఐస్‌క్రీమ్స్, ఐస్‌వాటర్, బిర్యాని ఐటమ్స్‌కు దూరంగా ఉంటాను. నూనె వేసిన కూరలను కూడా తినను. కోలాటం మాస్టారుగా వ్యవహరించేవారికి స్వరం ముఖ్యం.



అలాంటి స్వరాన్ని కాపాడుకోవడానికి ఆహారనియమాలు పాటించక తప్పదు. కోలాటం శిక్షణలో ఒక్కొక్క బ్యాచ్‌కు 60,70 మంది ఉంటారు. పెద్దగా పాడితేనే అది అందరికీ చేరుతుంది. స్వరం సరిగా లేకపోతే వారికి నేర్పడం కష్టం అవుతుంది. ఏ ఊళ్లో శిక్షణ ఇచ్చినా మళ్లీ ఆరాత్రికే ఇంటికి చేరతాను. పొద్దున ఉద్యోగం మామూలే!

మధుర క్షణాలు

సినీయాక్టర్ సుత్తివేలు చేతుల మీదుగా సన్మానం జరగటం మరచిపోలేని అనుభూతి. ప్రోగ్రాం జరిగే సమయంలో ప్రేక్షకుల్లో నుంచి ఎవరైనా వచ్చి జేబుకి డబ్బు, పూలు కుట్టినప్పుడు ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. వారు ఇచ్చే డబ్బు, పూలకు విలువ కట్టలేం. వారికి నా పాట అంతగా నచ్చినందుకు ఆనందంగా ఉంటుంది. ప్రజల్లో ఇప్పటికీ ఉన్న ఆదరణను బట్టే దీనిని సంతోషంగా కొనసాగించగలుగుతున్నాను. కోలాటానికి కొత్త ఊపు, రూపూ తెస్తున్న నాగార్జున ఈ ఆటపాటల్లో మరింత రాణించాలని ఆశిద్దాం. ప్రాచీన జానపదానికి వర్తమాన కాలపు సందేశాన్ని జోడించి సాగుతున్నందుకు మనసారా అభినందిద్దాం.

- స్వర్ణలత నూకరాజు

'గ్రాండ్' విజయం

అజ్లాన్‌షా హాకీలో మలేషియాపై 5-1తో గెలుపు



కౌలాలంపూర్ : 27వ సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్‌లో భారత హాకీజట్టుకు గ్రాండ్ విజయం లభించింది. బుధవారం ఆతిథ్య మలేషియా జట్టుపై టీమిండియా 5-1 గోల్స్ తేడాతో విజయ దుందుభి మోగించింది. ఈ టోర్నీలో గెలుపుకు నోచని మన జట్టు మలేషియాపై భారీ గోల్స్ ఆధిక్యంతో గెలిచింది.

ఇప్పటికే అర్జంటీనా, ఆస్ట్రేలియా జట్లపై ఓడిపోవడంతో, ఇంగ్లండ్‌పై అందివచ్చిన అవకాశాలను చేజార్చుకొని డ్రా చేసుకోవడంతో మన జట్టుకు ఫైనల్ బెర్త్ అవకాశాలు దాదాపు మృగ్యమయ్యాయి. నేటి భారీ విజయంతో భారత హాకీజట్టు కాంస్య పతక రేసులో నిలిచింది. భారత్‌కు చెందిన షీలానంద్ లక్రా 10వ నిమిషంలో గోల్ చేసి 1-0 ఆధిక్యతలో నిలిపినప్పటికీ... అనంతరం మలేషియాకు చెందిన ఫైజల్ 33వ నిమిషంలో గోల్ చేసి 1-1తో సమంగా నిలిచాయి. అనంతరం భారత్‌కు చెందిన గుర్జాంత్ సింగ్ రెండు ఫీల్డ్‌గోల్స్ చేయడంతో 3-1 ఆధిక్యతలో నిలిచింది. చివర్లో సుమిత్‌కుమార్, రమణ్‌దీప్ సింగ్‌లు ఒక్కొక్క గోల్ చొప్పున చేయడంతో భారత్‌జట్టు తిరుగులేని 5-1 ఆధిక్యతతో విజయాన్ని సొంతం చేసుకుంది.

ఇతర మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా 4-1 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌పై గెలుపొందగా... అర్జంటీనా-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన మరోమ్యాచ్ 1-1 డ్రాగా ముగిసింది. శుక్రవారం జరిగే చివరి మ్యాచ్ ఫలితాలను బట్టి స్థానాలు ఖాయమయ్యే అవకాశముంది. ఆరోజు భారతజట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉన్న ఐర్లాండ్‌తో తలపడనుంది.

లక్ష్యం.. గెలుపు



రోహిత్ శర్మ



మహ్మదుల్లా బంగ్లా సారథి

టీ20 ట్రై సిరీస్‌లో నేడు బంగ్లాతో పోరు రాత్రి 7.00 గం॥ల నుంచి

కొలంబో : నిదహాస్ టీ20 ట్రై సిరీస్‌లో భాగంగా భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య గురువారం రెండో మ్యాచ్ జరగనుంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో అనూహ్యంగా ఓడిన టీమిండియా నేడు బంగ్లాదేశ్‌తో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. ఓపెనర్ శిఖర్ ధవన్ ధనాధన్ దూకుడు మినహా భారత ఇన్నింగ్స్‌లో మెరుపులు లేకపోవడం కొంపముంచింది. తొలిగా బ్యాటింగ్ చేసి 174 పరుగులు చేసినా పవర్‌ప్లేలో ఆతిథ్య జట్టుకు పరుగులు భారీగా సమర్పించుకోవడంతో మ్యాచ్ చేజారింది. టీమిండియా సారథి రోహిత్ శర్మ డకౌట్, రైనా రాణించకపోవడంతో జట్టు ఒత్తిడికి గురైంది. దీంతో బంగ్లాదేశ్‌పై టీమిండియా సమిష్టిగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

175 లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో లంక జట్టుకు చెందిన కుశాల్ పెరీరా (37 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 66) వీర బాదుడుకు భారత బౌలర్లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. శార్దూల్ ఠాకూర్ వేసిన ఓవర్‌లో ఏకంగా 27 పరుగులు సాధించాడు. అతడికి మిగతా వారి నుంచి పెద్దగా సహకారం లేకపోయినా అంతా తానై లంక ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కుశాల్ అవుటయ్యాక మ్యాచ్ కాస్త భారత్ వైపు మొగ్గు చూపినా తిసార పెరీరా వరుస బౌండరీలతో లంకను గట్టెక్కించి అదిరిపోయే విజయాన్ని అందించాడు. ఈ స్టేడియంలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం.

మహ్మద్ షమీపై వేటు

టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వేటు వేసింది. బుధవారం ప్రకటించిన ఒప్పంద ఆటగాళ్ల జాబితా నుంచి షమీ పేరును తొలగించింది. షమీకి దేశంలో ఎంతో మంది మహిళలతో సంబంధాలు ఉన్నాయని, అతనికి తన కంటే ముందే పాకిస్తాన్‌కు చెందిన మహిళతో వివాహం జరిగిందని షమీపై అతని భార్య హసీన్ జహాన్ ఆరోపణల నేపథ్యం... షమి వివరణ... షమీకి విడాకులిచ్చే ప్రశ్న లేదంటూ నేడు చేసిన బహి రంగ ఆరోపణ ప్రసార మాధ్యమాల్లో దుమారం రేపాయి. దీంతో ఒప్పంద ఆటగాళ్ల జాబితాలో కొనసాగించడం వల్ల విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని భావిం అతని పేరును ఒప్పంద ఆటగాళ్ల జాబితా నుంచి తొలగించినట్లు తెలిపింది.

భారతజట్టు (అంచనా) : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, సురేష్ రైనా, మనీష్ పాండే, రిషబ్ పంత్, దినేష్ కార్తీక్ (కీపర్), వాషింగ్టన్ సుందర్, ఉనద్కట్, చాహల్, ఠాకూర్, సిరాజ్/హుడా.

బంగ్లాదేశ్ జట్టు (అంచనా) : మహ్మదుల్లా (కెప్టెన్), తమీమ్ ఇక్బాల్, సౌమ్యా సర్కార్, ఇమ్రుల్ ఖయాస్, ముష్ఫికర్ రహీమ్ (కీపర్), షబ్బీర్ రహమాన్, రుబేల్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, అబు హైదర్, ఆరిఫుల్ హక్, ముస్తఫిజుర్ రహమాన్/నజముల్ ఇస్లామ్.

క్రికెటర్లకు భారీగా జీతాల పెంపు

2017 అక్టోబర్ నుంచి సెప్టెంబరు 2018 వరకు ఆటగాళ్ల ఏడాది కాంట్రాక్టులను సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్(సీఓఏ) బుధవారం ప్రకటించింది. దీనిలో భాగంగా ఈసారి నూతన గ్రేడింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. గ్రేడ్ ఏ ప్లస్ కేటగిరీ క్రింద ఉండే క్రీడాకారులకు ఏడాదికి రూ.7కోట్లు, గ్రేడ్ ఏ కింద రూ.5కోట్లు, గ్రేడ్ బీ కింద రూ.3కోట్లు, గ్రేడ్ సీ కింద రూ.1కోటి ఇవ్వనున్నట్లు తెలిపింది. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనిని గ్రేడ్ ఏలో చేర్చగా, పేసర్ మహ్మద్ షమిని ఎందులోనూ చేర్చకుండా పూర్తిగా జాబితాలో నుంచే అతని పేరును తొలిగించారు.

గ్రేడ్ ఎ+ : విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శిఖర్ ధవన్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా

గ్రేడ్ ఎ : మహేంద్ర సింగ్ ధోని, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మురళీ విజయ్, ఛతేశ్వర్ పుజారా, అజింక్యా రహానే, వృద్ధిమాన్ సాహా

గ్రేడ్ బి : కేఎల్ రాహుల్, ఉమేశ్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్, చాహల్, హార్దిక్ పాండ్యా, ఇషాంత్ శర్మ, దినేశ్ కార్తీక్

గ్రేడ్-సి : కేదార్ జాదవ్, మనీశ్ పాండే, అక్షర్ పటేల్, కరుణ్ నాయర్, సురేశ్ రైనా, పార్థివ్ పటేల్, జయంత్ యాదవ్

మహిళాజట్టు : మహిళా జట్టుకు ఇప్పటివరకూ గ్రేడ్ ఏ లో రూ.50లక్షలు, గ్రేడ్ బీలో రూ.30లక్షలు చెల్లించేవారు. ఈసారి కొత్తగా గ్రేడ్ సీ చేర్చి వారికి రూ.10 లక్షలు చెల్లించనున్నారు.

షెహజాద్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం



హరారే : ఆఫ్ఘనిస్తాన్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్, వికెట్ కీపర్ షెహజాద్ నిషేధానికి గురయ్యాడు. బుధవారం ఈ విషయాన్ని మ్యాచ్ రిఫరీ రిఫర్ డేవిడ్ జాక్స్ స్పష్టం చేశాడు. మంగళవారం ఆఫ్ఘనిస్తాన్- జింబాబ్వే జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆఫ్ఘన్ జట్టు రెండు పరుగుల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో షెహజాద్ ఔటైన అనంతరం మైదానాన్ని వీడే క్రమంలో రెండుసార్లు మైదానాన్ని బ్యాట్‌తో బలంగా కొట్టాడు. ఈ విధంగా చేయడం ఐసిసి కోడ్ 2.1.8 ప్రకారం నిషేధం. ఐసీసీ నిబంధనల ప్రకారం అతనికి ఒక పాయింట్‌తో పాటు మ్యాచ్ ఫీజులో 15% కోత విధించినట్లు తెలిపాడు. ఇప్పటికే నాలుగు డీమెరిట్ పాయింట్లు పొంది ఉండడంతో అతనిపై రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. దీంతో షెహజాద్ అనంతరం జరిగే రెండు వన్డే మ్యాచ్‌లలో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాడు.

ప్రపంచకప్ అర్హత టోర్నీ నేటి మ్యాచ్‌లు...

- నెదర్లాండ్ x యుఎఇ :
- వెస్టిండీస్ x పప్పున్యూగేనియా
- స్కాట్లాండ్ x నేపాల్ :
- ఆఫ్ఘనిస్తాన్ x హాంకాంగ్

ఢిల్లీ డేర్ డెవిల్స్ సారథిగా గంభీర్

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్-2018 సీజన్‌కు ఢిల్లీ డేర్ డెవిల్స్ కెప్టెన్‌గా సీనియర్ క్రికెటర్ గౌతం గంభీర్‌ను ఎంపిక చేశారు. ఢిల్లీ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ గంభీర్ కెప్టెన్సీపై నమ్మకం ఉంచడంతో ఈ మేరకు యాజమాన్యం నిర్ణయం బుధవారం తీసుకుంది. యువ ఆటగాళ్లకు సరైన సారథి గంభీరేనని పాంటింగ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాడు.



కివీస్ ఘన విజయం

రాస్ టేలర్ రికార్డుల మోత!



డూడెన్ (న్యూజిలాండ్) : ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య జరిగిన నాలుగో వన్డేలో కివీస్‌జట్టు ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 335 పరుగుల భారీస్కోర్ సాధించింది. ఆ జట్టులో బారిస్టో 138, రూట్ 102 పరుగులతో రాణించారు. సోధీకి 4, మాన్రోకు 2 వికెట్లు లభించాయి. అనంతరం లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సీనియర్ బ్యాట్స్‌మన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పొందిన రాస్ టేలర్ అజేయంగా 181 పరుగులు చేయడంతో... 49.3 ఓవర్లలో కివీస్ జట్టు 5 వికెట్లను చేజార్చుకొని లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో టేలర్ కివీస్ జట్టు తరపున అనేక రికార్డులను తిరగరాయగా... ఐదు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 2-2తో సమంగా ఉన్నాయి. సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి వన్డే శనివారం (మార్చి-10న) జరగనుంది.

డేవిడ్ వార్నర్‌కు జరిమానా!



దర్బన్ : దక్షిణా ఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు టీ విరామ సమ యంలో ఇరు జట్ల ఆటగాళ్లు స్లెడ్జింగ్‌కి పాల్ప డిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ పూర్తైన అనంతరం వార్నర్ చేసింది తప్పుగా పరిగణించిన ఐసీసీ అతనికి మూడు డీమెరిట్ పాయింట్లతోపాటు మ్యాచ్ ఫీజ్ నుంచి 75 శాతం కోత విధించింది. మరోవైపు డికాక్‌కు కూడా ఒక డీమెరిట్ పాయింట్ విధించినట్లు తెలిపింది. దీంతో వార్నర్‌కు మరో డీమెరిట్ పాయింట్ వస్తే అతనిపై నిషేధం విధించే అవకాశం ఉంది.



ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - సాలూరు (విజయనగరం)

విజయనగరం జిల్లా సాలూరు పట్టణం బంగారమ్మ కాలనీలో మంగళవారం రాత్రి ఇంటర్ విద్యార్థిని చలపరెడ్డి లక్ష్మి(16) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మి అనే విద్యార్థిని స్థానిక శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపిసి మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు నెలల క్రితం లక్ష్మి తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. దీనికి తోడు ఆ విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాసి, మంగళవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని తండ్రి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ మేరకు టౌన్ ఎస్ఐ ఫక్రుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఇపిఎఫ్ పెన్షనర్ల ఆలిండియా మహాసభ



ఆలిండియా మహాసభలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఇపిఎఫ్(95) పెన్షనర్ల మూడో ఆలిండియా మహాసభ ఢిల్లీలోని మాల్‌వాంకర్ హాలులో బుధవారం ఘనంగా జరిగింది. ఈ మహాసభకు 12 రాష్ట్రాల నుంచి 800 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఇపిఎఫ్ 95 పెన్షనర్లకు రూ.9 వేలు పెన్షన్‌తో పాటు కరువు భత్యం ఇవ్వాలని, పెన్షన్ క్యాపిటల్ రిటన్ చేయాలని, కమిటేషన్ చేసిన పెన్షన్ తిరిగి పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం ప్రభుత్వానికి ఇవ్వాలని ఈ మహాసభలో ఆలిండియా కన్వీనర్ దర్మజన్ ప్రతిపాదించగా, మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వ సామాజిక, న్యాయశాఖ మంత్రి తివార్‌చంద్‌తో పాటు సిపిఎం ఎంపి సంపత్ (కేరళ), టిఆర్ఎస్ ఎంపి శ్రీనివాసరెడ్డి (తెలంగాణ), ఇండిపెండెంట్ ఎంపి బషీర్, తమిళనాడుకు చెందిన డిఎంకె ఎంపి ఎలంబిన్ ఎంపి శక్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా ప్రదర్శన

మార్చి 8న మండీహౌస్ (మెట్రోస్టేషన్) నుంచి పార్లమెంట్‌భవన్ వరకు ఇపిఎఫ్ పెన్షనర్లతో ప్రదర్శన నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

పొగాకు రైతులకు న్యాయం చేస్తాం

ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్



లూథరన్ చర్చికి ఆర్థిక చేయూత ఇవ్వాలని వినతిపత్రం ఇస్తున్న హనుమోజిపాలెం వాసులు

ప్రజాశక్తి-ఇంకొల్లు (ప్రకాశం)

తాము అధికారంలోకొస్తే పొగాకు రైతులకు న్యాయం చేస్తామని, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని వైసిపి నేత వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. జగన్ ప్రజాసంకల్ప యాత్ర బుధవారం ఉదయం ప్రకాశం జిల్లా ఇంకొల్లులోని ముప్పరాజువారి కొష్టాల నుంచి ప్రారంభమైంది. ఉదయాన్నే వైసిపి పర్చూరు సమన్వయకర్త రామనాథంబాబు, కార్యకర్తలతో అక్కడ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఇంకొల్లు అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళలతో మాట్లాడారు. హను మోజిపాలెం పల్లెల వద్ద రొడ్డుపైకి వచ్చిన మహిళలను, యువతులను, వృద్ధులను పరామర్శించారు. హనుమోజి పాలెంలో వారి సమస్య లతోపాటు అసంపూర్తిగా నిలిచిపో యిన లూథరన్ చర్చికి ఆర్థిక చేయుత ఇవ్వాలని కాలనీ వాసులు వినతి పత్రాలిచ్చారు. హనుమొజిపాలెంలో, జరుగులవారిపాలెంలో రాజశేఖర్‌రెడ్డి బొమ్మ వద్ద వైసిపి జెండాను ఏగురవేశారు. దారిలో పొగాకు రైతును కలిసి సమస్యలు విన్నారు. అధికారంలోకొస్తే న్యాయం చేస్తానని చెప్పారు. అనంతరం కేపవరప్పాడు, కొడవలవారిపాలెం, స్వర్నపాలెం గ్రామల కూడలి పాదయాత్ర కొనసాగించారు. బోజన విరామం తర్వాత 3 గంటల నుంచి రంగప్పనాయుడుపాలెం, నందిగుంటపాలెం, మీదుగా సంతరావూరు చేరి అక్కడ రాత్రి బసచేశారు. జగన్ దారి పొడువున తన పాదయాత్రలో మహిళలను కలవటానికి మాత్రమే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.



వేమన నాటకంలో ఓ సన్నివేశం

కళల ద్వారా అభ్యుదయ భావాలు

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

కళల ద్వారా ప్రజల్లోకి అభ్యుదయ భావాలను ప్రజానాట్య మండలి తీసుకువెళుందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తెలిపారు. విశాఖలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని రెండురోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక సంబరాలు బుధవారం ముగిశాయి. కళల ద్వారా అందరం ఒక్కటేననే భావనను తెలియ జేస్తూ అంతరాలను దూరం చేయడానికి ప్రజా నాట్య మండలి చేస్తున్న కృషి అభినందనీయమని రమాదేవి పేర్కొన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు సుభాషిణి అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, మన సంస్కృతి వ్యవస్థాపకులు దువ్వాడ లక్ష్మీ భార్గవి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, నగర అధ్యక్షులు దండు నాగేశ్వరరావు, వ్యవస్థాపకులు అరుణ్‌జీ పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68